మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

NAMASTE TELANGANA

ఆదివారం SUNDAY 14.9.2025 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 + 32 పేజీల ఆదివారం అనుబంధం Pages: 12+4 + 32 pages sunday supplement

సంపుటి (Volume): 15 || సంచిక (Issue): 100 || వెల (Price) రూ.8.00



ఆదివారం, సూర్యోదయం: 6-04, సూర్యాస్తమయం: 6-20. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: అష్టమి రాత్రి 3-06 వరకు. నక్షత్రం: రోహిణి ఉదయం 8-21 వరకు, తదుపరి మృగశిర. వర్జ్యం: పగలు 1-59 నుంచి పగలు 3-30 వరకు. రాహుకాలం: సాయంత్రం 4-46 నుంచి సాయంత్రం 6-18 వరకు. దుర్ముహూర్తం: సాయంత్రం 4-40 నుంచి సాయంత్రం 5-29 వరకు. అమృతకాలం: రాత్రి 11-08 నుంచి రాత్రి 12-40 వరకు.

నడిగడ్డపై తొడగొట్టిన గులాబీ
గద్వాలలో గర్జన





గద్వాల తేరు మైదానంలో జరిగిన గద్వాల గర్జన బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహిని. సభలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,

ఉప ఎన్నికలకు వచ్చే దమ్ముందా?

నడిగడ్డ మీద గులాబీ దళం గర్జించింది. తేరు మైదానం జన సందోహంతో శిగమూగింది. పట్టణ శివారునుంచి సభాస్థలి దాకా సాగిన ర్యాలీ జైత్రయాత్రను తలపించింది. సభలో ఉద్వేగభరితంగా సాగిన కేటీఆర్ ప్రసంగం పిడుగుల వర్షం కురిపిస్తే .. సభలో జనం చప్పట్ల జడివానలో తడిసిముద్దయ్యారు. ప్రధానంగా గద్వాల అభివృద్ధికి తాము ఏం చేశామో వివరిస్తూ.. మరోవైపు కాంగ్రెస్ పాలనలో ఏ వర్గం ఎలా మోసపోయిందో విడమర్చి చెప్పిన తీరు జనంలో ఊపు తెచ్చింది. ప్రశ్నలు వేసి ప్రజల నుంచి జవాబులు రాబట్టిన తీరు.. జోష్‌ను తారస్థాయికి తీసుకువెళ్లింది. గంటన్నర పాటు ఉర్రూతలూగించిన ప్రసంగానికి క్లయిమాక్స్‌గా 'దమ్ముంటే ఉప ఎన్నికలకు రావాలి' అని చేసిన సవాల్‌తో గద్వాల దద్దరిల్లింది.

ఆ పది మందితో రాజీనామా చేయించు.. సీఎం రేవంత్‌కు కేటీఆర్ సూటి సవాల్

- ప్రజాస్వామ్యంలో రాజకీయ ద్రోహులకు చోటులేదు
- ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కి స్వార్థంతో ఆస్తులు పెంచుకొనేందుకే వాళ్లు పార్టీ మారిండ్రు
- ఆ పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తథ్యం
- ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ప్రజాకోర్టులో శిక్ష తప్పదు
- ఎవరి అభివృద్ధి కోసం బండ్ల కాంగ్రెస్‌లోకి పోయిండు?
- కాంగ్రెస్‌లో చేరను.. చేరాల్సి వస్తే రైలు కింద తల పెడతా అని చెప్పినోడు ఇవ్వాళ బీఆర్ఎస్ సభకు ఎందుకు రాలే?
- యూరియా నుంచి గ్రూప్-1 పోస్టుల దాకా తెగనమ్ముకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు
- ధ్వజమెత్తిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బీఆర్ఎస్‌లో భారీగా చేరిన గద్వాల కాంగ్రెస్ నేతలు

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన భాషలో చెప్తేనే అర్థమయితది. అయినా అట్లాంటి భాష మనం మాట్లాడలేం. కానీ, తప్పదు.. ఆయన కోసం మాట్లాడాలి. రేవంత్ నువ్వు మొగోడివైతే ఆ 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించు. ఉప ఎన్నికలకు పోదాం. బై ఎలక్షన్లలో చూసుకుందాం. పదేండ్ల కేసీఆర్ పాలన, రెండేండ్ల కాంగ్రెస్ పాలన.. ఏది బాగుందో తేల్చుకుందాం. ఉప ఎన్నికల్లో దమ్ముంటే గెలిచి చూపించు' అంటూ గద్వాల తేరు మైదానం నుంచి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. శనివారం గద్వాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన గద్వాల గర్జన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలు, అభిప్రాయాలను తుంగలో తొక్కి వ్యక్తిగత అవసరాల కోసం పార్టీలు మార్చిన ఎమ్మెల్యేలకు ప్రజాకోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు. పార్టీలు మారిన ఆ పది మంది ఎమ్మెల్యేల పరిస్థితి దయనీయంగా ఉన్నదని, అసలు వారు ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. స్వార్థం కోసం, ఆస్తులు పెంచుకునేందుకు అవకాశవాదంతో వారు పార్టీలు మారారని మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపుల అంశాన్ని సుప్రీం కోర్టు కూడా సీరియస్‌గా తీసుకున్నదని చెప్పారు. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా పార్టీ 2వ పేజీలో

• పోలీస్ స్టేషన్‌లో రైతన్నలు: ఇది రైతు సభ కాదు.. యూరియా రభస



'అరెరే.. ఏందిది ఇంత మందిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టారేంది'.. అనుకుంటున్నారా? లేక ఠాణాలో రైతుల సదస్సో.. సభనో జరుగుతున్నది అనుకుంటున్నారా? రెండూ కాదు.. కామారెడ్డి జిల్లా బీబీపేట సొసైటీ వద్దకు యూరియా కోసం శనివారం వందలాది మంది రైతులు తరలిరావడంతో చేసేదేంలేక చివరికి స్థానిక పోలీస్ స్టేషన్‌లో టోకెన్లు పంపిణీ చేశారు. ఠాణాకు రైతులు పోటెత్తడంతో ఇదిగో ఇలా ఆవరణలోనే ఖైదీల్లా కూర్చోబెట్టి పడిగాపులు కాయించారు. అప్పటికీ ఎండకు తాళలేక రైతు చిన్న రేఖయ్య ఫిట్స్‌తో పడిపోవడంతో పోలీస్ వాహనంలో దవాఖానకు తరలించారు.

యువరైతు ప్రాణం తీసిన యూరియా!

- సొసైటీ వద్ద తోపులాట
- డబ్బులు పోగొట్టుకున్న సుమన్
- భార్యాభర్తల మధ్య నగదు గొడవ
- మనస్తాపంతో రైతు ఆత్మహత్య
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో ఘటన 7

యూరియా దొరక్క ఆందోళన

గడ్డి మందు తాగిన రైతు

మంత్రి సీతక్క ఇలాకాలో ఘటన 7

• ఆదివాసీ మహిళల అరెస్ట్: ఇది హరితహారం కాదు.. పోలీస్ దుర్మార్గం



మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్లపేట రేంజ్ పరిధి దమ్మన్నపేట, మామిడిగూడెంలో ఆదివాసీలు, అటవీ అధికారుల మధ్య శనివారం ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. తమపై దాడి చేశారని అటవీ అధికారులు చేసిన ఫిర్యాదు మేరకు వాహనాల్లో వందలాది మంది అటవీ అధికారులు, పోలీసులు చేరుకొని 13 మంది ఆదివాసీ మహిళలను అదుపులోకి తీసుకున్నారు. 2004 కంటే ముందు నుంచే తాము భూములు సాగు చేసుకుంటూ బతుకుతున్నామని, శుక్రవారం తాము వాగుల్లో స్నానం చేస్తుంటే అటవీ అధికారులు వచ్చి ఇబ్బంది పెట్టడం వల్లే ఎదురు తిరిగామని ఆదివాసీ మహిళలు చెప్తున్నారు.

వేతనాలు రాలేదని

ఉద్యోగి ఆత్మహత్య

- నల్లగొండ జిల్లాలో రైలుకు ఎదురెళ్లిన సోమిరెడ్డి
- తుంగతుర్తి ఎంపీడీవో ఆఫీస్ కంప్యూటర్ ఆపరేటర్ బలవన్మరణం 7

కృష్ణా వాటాపై తలో మాట!

నీటి లెక్కలపై అవగాహనలేని కాంగ్రెస్ సర్కార్



- 811టీఎంసీల్లో 71శాతం వాటా కావాలన్న మంత్రి
- 904 టీఎంసీలు కావాలని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి
- గతంలో 500టీఎంసీలంటూ మరో తరహా మాట
- పదేపదే మాట మార్చుతూ గత సర్కారుపై నిందలు
- ట్రిబ్యునల్‌లో నీటి వాటా దక్కడంపై అనుమానాలు

హైదరాబాద్, సెప్టెంబర్13 (నమస్తే తెలంగాణ): కృష్ణాలో తెలంగాణకు రావాల్సిన నీళ్లు ఎన్ని? అనే దానిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఏమాత్రం అవగాహన లేదని మరోసారి తేలిపోయిందని నిపుణులు విమర్శలు గుప్పిస్తున్నారు. జలాల వాటాపై చెరోవిధంగా ప్రకటనలు చేస్తూ అవగాహన రాహిత్యాన్ని బయటపెట్టుకున్నారని చెప్తున్నారు. దీంతో ట్రిబ్యునల్‌లో తెలంగాణకు న్యాయమైన వాటా దక్కుతుందా? అనే అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే ట్రిబ్యునల్‌లో తెలంగాణ వాదనలు తుది దశకు చేరుకున్నాయి. ఇలాంటి సమయంలో సీఎం, మంత్రి ప్రకటనలు చూస్తే సందేహాలు వస్తున్నాయని చెప్తున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, 6వ పేజీలో

బీఆర్ఎస్‌పై నిఘా.. భద్రతకు దగా!

నేరాల నియంత్రణ గాలికి.. బీఆర్ఎస్ నేతలపైనే ఇంటెలిజెన్స్ విభాగం ఫోకస్



- ఫోన్ల ట్యాపింగ్, లొకేషన్ ట్రేసింగ్‌పైనే మొత్తం దృష్టి
- ధర్నాలు, ఆందోళనలు అడ్డుకోవడానికే ప్రాధాన్యం
- సివిల్ వివాదాల్లో తలదూర్చుతున్న అధికారులు
- రాష్ట్రవ్యాప్తంగా విపరీతంగా పెరిగిపోతున్న నేరాలు
- అభాసుపాలవుతున్న రాష్ట్ర పోలీసుశాఖ తీరు 6

అల్లరి చేయొద్దు.. మీకే నష్టం!



వృత్తివిద్యా కాలేజీల ప్రతినిధులకు భట్టి వార్నింగ్

- కాలేజీలతో సర్కారు జరిపిన చర్చలు విఫలం
- ఇరవై నెలలుగా ఇదే మాట చెప్తున్నారంటూ ఎఫ్‌ఏటీహెచ్‌ఈఐ ప్రతినిధుల అసంతృప్తి
- సోమవారం నుంచి కాలేజీల బంద్‌కు నిర్ణయం
- సెమిస్టర్ పరీక్షల బహిష్కరణ, ఆందోళన బాట

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): 'అకస్మాత్తుగా బంద్‌కు పిలుపునిస్తే ఎట్లా? తొందరపడొద్దు.. అల్లరి చేసి ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టొద్దు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగాలేదు. మీకు ఇవ్వాల్సిన బకాయిలను.. కాస్త ఆలస్యంగా ఇద్దామనుకున్నాం. మీరిలా చేస్తే ఎట్లా? అల్లరి చేస్తే మీకే నష్టం'.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యలివి! 20 నెలలుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం నుంచి బంద్‌కు వెళ్తామని అల్టిమేటం జారీ చేసిన తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సంఘాల సమాఖ్య ప్రతినిధులను శనివారం చర్చలకు పిలిచి.. డిప్యూటీ సీఎం 6వ పేజీలో

బెస్ట్ అవైలబుల్ నిధులిస్తారా? వదిలేస్తారా?

- రెండేండ్లుగా నిలిచిన చెల్లింపులు.. ప్రైవేట్ స్కూల్ యజమానుల ఒత్తిడి
- కాంగ్రెస్ సర్కారు తీరుపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం 9



నల్లగొండలోని గడియారం సెంటర్ వద్ద ట్రిపుల్ ఆర్ బాధిత రైతులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఆర్‌ఆర్‌ఆర్ రైతుల అరెస్ట్

మంత్రికి బాధలు చెప్పుకుందామని వెళ్తుండగా అదుపులోకి

నల్లగొండ గడియారం సెంటర్‌లో అడ్డుకున్న పోలీసులు

నీలగిరి, సెప్టెంబర్ 13: సర్కార్ తీరుపై ట్రిపుల్ ఆర్ బాధితులు ఫైర్ అయ్యారు. మంత్రికి తమ బాధలు చెప్పుకొందామని వస్తే అరెస్ట్ చేస్తారా? అంటూ మండిపడ్డారు. ప్రభుత్వం ట్రిపుల్ ఆర్‌కు సంబంధించి దక్షిణభాగం అలైన్‌మెంట్ వివరాలను హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈనెల 15లోగా అభ్యంతరాలను తెలపాలని కోరుతూ ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లికి చెందిన కొందరు ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితులు నల్లగొండ పర్యటనలో ఉన్న జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసేందుకు శనివారం జిల్లా కేంద్రానికి వచ్చారు. స్థానిక గడియారం సెంటర్‌లోని ఇందిరాభవన్ వద్ద మంత్రిని కలిసి వినతి పత్రం ఇచ్చి వెళ్దామని ఎదురుచూస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. తాము ఎలాంటి ఆందోళన చేయడం లేదని, 3వ పేజీలో




బస్సులో వెళ్తూ తమ అభిమాన నేత కేటీఆర్‌ను చూసిన ఆనందంలో ప్రయాణికులు


బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ర్యాలీని ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు


కేటీఆర్‌ను చూసిన సంబురంలో చేయి ఊపుతున్న రైతులు

ఉప ఎన్నికలకు వచ్చే దమ్ముందా?

మొదటిపేజీ తరువాయి...

మారిన 10 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవని, వారికి ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. రాబోయే ఉప ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి రెఫరెండమని అన్నారు.

సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్లపై ఫైర్..

కాంగ్రెస్‌లోకి వెళ్లిన తర్వాత కూడా ఇంకా బీఆర్‌ఎస్‌లోనే ఉన్నామని గద్వాల సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గద్వాల బీఆర్‌ఎస్ సభలో వేలాదిమంది ఉంటే, బీఆర్‌ఎస్‌లోనే ఉన్నానని చెప్పుకుంటున్న గద్వాల ఎమ్మెల్యే మాత్రం రేవంత్‌రెడ్డితో ఉన్నారని పేర్కొన్నారు. ఎవరి అభివృద్ధి కోసం కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లాడని ప్రశ్నించారు. పేదల కోసమైతే ఆడబిడ్డలకు నెలకు రెండున్నర వేలు ఇస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందని, రెండు లక్షల రుణమాఫీ ఎక్కడ మాయమైందని నిలదీశారు. ఆడబిడ్డలకు స్కూటీ ఎక్కడ ఇచ్చారని, 20 లక్షల దళితబంధు ఎక్కడని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ హామీ ఏమైందని నిలదీశారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ పరిపాలన చూసి పార్టీ మారిండా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ నేతలు యూరియాను బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని, గ్రూప్-1 ఉద్యోగాలను కూడా అమ్ముకున్నారని ఆరోపించారు. ప్రజలు నమ్మి ఓటేసి, ఇప్పుడు మోసపోతున్నారని, ఇందుకే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిండా? అని ప్రశ్నించారు. గద్వాల ఎమ్మెల్యే గతంలో చెప్పిన మాటలపై కూడా కేటీఆర్ విరుచుకుపడ్డారు. 'కాంగ్రెస్‌లో చేరబోనని, చేరాల్సి వస్తే రైలుకింద తలపెడతానని చెప్పిన ఎమ్మెల్యే ఈ సభకు ఎందుకు రాలేదు? బీఆర్‌ఎస్‌లో ఉన్నానని చెప్పుకుంటూ కాంగ్రెస్‌కు లొంగిపోవడం ప్రజలను మోసం చేయడమే' అని ఆయన ధ్వజమెత్తారు.

> బంగారు పళ్లెంలో పెట్టి ఇచ్చిన తెలంగాణను కాంగ్రెస్ పాడు చేసింది. అసమర్థ కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల నుంచి నిరుద్యోగుల వరకు అన్ని వర్గాలు బాధ పడుతున్నాయి. విద్య నుంచి సంక్షేమం వరకు అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సంపూర్ణంగా విఫలమైంది.
> -కేటీఆర్

కాంగ్రెస్ వైఫల్యాలపై కేటీఆర్ ధ్వజం

'రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. మళ్లీ యూరియా కష్టాలు, కరెంటు కోతలు మొదలయ్యాయి. కరోనా సమయంలో కూడా రైతుబంధు వేసిన ఘనత కేసీఆర్‌ది. అన్ని పథకాలను కష్టకాలంలో కూడా అమలు చేసిన ఘనత ఆయనదే. బంగారు పళ్లెంలో పెట్టి ఇచ్చిన తెలంగాణను కాంగ్రెస్ పాడు చేసింది. అసమర్థ కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల నుంచి నిరుద్యోగుల వరకు అన్ని వర్గాలు బాధ పడుతున్నాయి. విద్య నుంచి సంక్షేమం వరకు అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సంపూర్ణంగా విఫలమైంది' అని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో గురుకులాల పరిస్థితి అప్పుడెలా ఉందో? ఇప్పుడెలా ఉందో అందరికీ తెలిసిందేనని అన్నారు. కాంగ్రెస్ మోసం తప్ప మరేం చేయలేదని మండిపడ్డారు. మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. గద్వాల మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్ పాలనలో గద్వాల అభివృద్ధి

'తెలంగాణ ఉద్యమంలో గద్వాల ముందు వరుసలో నిలిచింది. జోగులాంబ తల్లి ఆశీస్సులతో గద్వాల జిల్లాగా మారింది. గద్వాలను జిల్లా కేంద్రంగా మార్చడమే కాకుండా మెడికల్ కాలేజీ కూడా తెచ్చాం. తుమ్మిళ్ల ప్రాజెక్టును పూర్తి చేసి, ఉమ్మడి పాలమూరు జిల్లాలో 18.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాం. 22 నెలలైనా ఇప్పటి దాకా నిర్మాణ పనులను కొనసాగించకుండా గట్టు ప్రాజెక్టును పండబెట్టింది కాంగ్రెస్ అని గుర్తుంచుకోండి' అని కేటీఆర్ విమర్శించారు. గద్వాల బహిరంగ సభ సందర్భంగా భారీ సంఖ్యలో కాంగ్రెస్ నేతలు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. వర్షంలోనూ భారీగా తరలివచ్చిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ వచ్చే ఎన్నికల్లో గద్వాలలో ఎమ్మెల్యేను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.


గద్వాల తేరు మైదానంలో జరిగిన గద్వాల గర్జన బహిరంగ సభలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వేదికపై మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆంజనేయగౌడ్, బాసు హన్మంతునాయుడు, కురువ విజయ్‌కుమార్, బీఎస్ కేశవ్

కృష్ణమోహన్‌రెడ్డికి కౌంటర్

తాను గద్వాలకు వస్తుంటే ఒక కాంగ్రెస్ నాయకుడు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నావని అడుగుతున్నాడని, మనకి ముఖం లేదా ఇక్కడికి రావడానికి అని ప్రశ్నించారు. గద్వాలను జిల్లా చేసి, మెడికల్ కాలేజీ ఇచ్చి, రెండు ఎత్తిపోతలతో లక్ష ఎకరాలకు నీళ్లు ఇచ్చి, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి 8 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తే ఇవాళ మరో 10 లక్షలు కలిపి మరో 18 లక్షల ఎకరాలు ఉమ్మడి జిల్లాలో సాగవుతున్నదని, ఇది కేసీఆర్ నాయకత్వంలో కాదా? అని ప్రశ్నించారు. ఇవాళ డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగాన్ని రూ. 3 కోట్లకు అమ్ముకున్నట్టు వార్తలు వస్తున్నాయని, 563 ఉద్యోగాలు అమ్ముకుని రూ. 1700 కోట్లు దండుకున్నట్టు నిరుద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు.

> కాంగ్రెస్‌లో చేరబోనని, చేరాల్సి వస్తే రైలుకింద తలపెడతానని చెప్పిన ఎమ్మెల్యే ఈ సభకు ఎందుకు రాలేదు? బీఆర్‌ఎస్‌లో ఉన్నానని చెప్పుకుంటూ కాంగ్రెస్‌కు లొంగిపోవడం ప్రజలను మోసం చేయడమే.
> -కేటీఆర్

ఇథనాల్ ఫ్యాక్టరీ లైసెన్స్ రద్దు చేయాలి

ఇథనాల్ ఫ్యాక్టరీ లైసెన్స్ రద్దు చేయాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలంపూర్‌లోని రాజోలి మండలం పెద్దగానివాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం రైతులను తీసుకుపోయి 15 రోజులు జైల్లో పెట్టి, నాన్ బెయిలబుల్ కేసులు పెట్టించారని కేటీఆర్ తెలిపారు. వాళ్లకు అండగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు మహబూబ్‌నగర్ జైలుకు, కోర్టుకు వెళ్లి రైతులను విడిపించి తీసుకువచ్చారని తెలిపారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇట్లాగే ప్రజలు ఆందోళన చేస్తే అక్కడ పర్మిషన్లు రద్దు చేశారని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వానికి నడిగడ్డ మీద ఏమాత్రం ప్రేమ ఉన్నా వెంటనే ఆ ఫ్యాక్టరీ లైసెన్సు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతన్నలకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వర్షంలో సైతం సడలని అభిమానం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్‌ఎస్‌పై జనం అభిమానం ఉందనడానికి గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన గద్వాల గర్జన సజీవ సాక్ష్యంగా నిలిచింది.. ఒకవైపు వర్షం పడుతున్నా కేటీఆర్ రాక కోసం జనం ఎదురు చూశారు. అంతకుముందు ఎర్రవల్లి చౌరస్తా నుంచి గద్వాల వరకు గులాబీ జెండాలతో పట్టణం జనసంద్రంగా మారింది. భారీ కాన్వాయ్‌తో కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో వర్షంలో సైతం 'జై కేసీఆర్', 'జై కేటీఆర్' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, నవీన్‌కుమార్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఇంతియాజ్, ఆంజనేయగౌడ్, రజిని, నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతునాయుడు, శ్యామల, విజయ్‌కుమార్, పల్లయ్యలు పాల్గొన్నారు.


బహిరంగ సభలో కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్. చిత్రంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి..

గద్వాల జిల్లా కేంద్రంలో కేటీఆర్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కేటీఆర్ సమక్షంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌తోపాటు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యూసుఫ్, మాజీ జెడ్పీటీసీ పద్మా వెంకటేశ్వరరెడ్డి, మాజీ కౌన్సిలర్లు జయలక్ష్మి, అరుణ, లక్ష్మి, రంజిత్, జయమ్మ, మహేశ్, జమన్‌సింగ్, రామచంద్రుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అమరవాయి కృష్ణారెడ్డి, ప్రతాప్, మాజీ ఉపసర్పంచులు వెంకటేశ్, గోకారి, గోవిందు, ఆశన్న తదితరులు చేరారు.



గద్వాలలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్నట్టు ఏర్పాటు చేసిన తన ఫ్లెక్సీలు కనపడకుండా ముసుగు కప్పించిన స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

> కాంగ్రెస్‌లోకి వెళ్లిన తర్వాత కూడా ఇంకా బీఆర్‌ఎస్‌లోనే ఉన్నానని గద్వాల సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటు. గద్వాల బీఆర్‌ఎస్ సభలో వేలాదిమంది ఉంటే, బీఆర్‌ఎస్‌లోనే ఉన్నానని చెప్పుకుంటున్న గద్వాల ఎమ్మెల్యే మాత్రం రేవంత్‌రెడ్డితో ఉన్నారు.
> -కేటీఆర్

కేసీఆర్ పాలనకు జనం జేజేలు

- కాంగ్రెస్ రెండేండ్ల పాలనపై కేటీఆర్ అడిగిన పలు ప్రశ్నలకు ప్రజలు పెద్ద ఎత్తున స్పందించారు. ఆయన అడిగిన ప్రతి ప్రశ్నకు ముక్తకంఠంతో బదులిచ్చారు.
- గద్వాలను జిల్లా కేంద్రం చేయడమే కాకుండా మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ తెచ్చింది ఎవరు? అన్న కేటీఆర్ ప్రశ్నకు కేసీఆర్ అని ముక్తకంఠంతో చెప్పారు.
- గద్వాల నర్సింగ్ కాలేజీ పక్కనే 1275 డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చిందెవరు? అవి పూర్తయ్యాయా? అన్న ప్రశ్నలకు జనం నుంచి కేసీఆర్ అని చెప్పారు.
- గద్వాల తాలూకాకు సాగునీరు సమృద్ధిగా అందాలని మొత్తం జిల్లాలో అటు గట్టు తమ్మిళ్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది ఎవరు అని కేసీఆర్ అడిగితే కేసీఆర్ అని సమాధానం చెప్పారు. మొదలు పెట్టింది ఎవరు అన్న ప్రశ్నకు జనం మళ్లీ కేసీఆర్ అని అన్నారు.
- బీఆర్‌ఎస్ దిగిపోయేనాటికి గట్టు దాదాపు 45 శాతం పూర్తయిందని, ఆ పథకాన్ని పూర్తిచేయకుండా పండబెట్టింది ఎవరని అడిగితే... కాంగ్రెస్, కాంగ్రెస్ అని ప్రజలు గట్టిగా బదులిచ్చారు.
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు ఎంతిస్తామన్నారన్న ప్రశ్నకు.. రూ. 15 వేలు అని జనం బదులిచ్చారు. మరి వస్తున్నాయా? అని ప్రశ్నిస్తే లేదు అని చెప్పారు.
- కేసీఆర్ రూ. 2 వేల పింఛన్ ఇస్తున్నడు.. నేనొస్తే రూ. 4 వేలు ఇస్తా అన్నాడు.. మరి ఇస్తున్నాడా? అని ప్రశ్నిస్తే లేదనే సమాధానం వచ్చింది. వీటితోపాటు కల్యాణ లక్ష్మి, దళితబంధు, అభయహస్తం, ఆడబిడ్డలకు రూ. 2,500, రుణమాఫీ వంటి విషయాలపై అడిగిన ప్రశ్నలకు ప్రజలు.. లేదు.. అని ముక్తకంఠంతో బదులిచ్చారు.
- మరో ఆరు నుంచి 9 నెలల్లో ఇదే గద్వాల జిల్లాలో ఉప ఎన్నిలకు రాబోతున్నాయని, పార్టీ మారిన ఎమ్మెల్యేకు బుద్ధి చెప్తామా? అంటే చెబుదాం.. చెబుదాం అని గట్టిగా అన్నారు.
- కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలా? వద్దా? అంటే కావాలి.. కావాలి అని గట్టిగా బదులిచ్చారు.

గద్వాలలో గులాబీ గర్జన

జనసంద్రమైన జిల్లా కేంద్రం
వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భారీగా తరలొచ్చిన పార్టీశ్రేణులు
కేటీఆర్‌కు అడుగడుగునా నీరాజనం
కాంగ్రెస్ నేతల గుండెల్లో గుబులు

గద్వాల, సెప్టెంబర్ 13: గద్వాల జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన గద్వాల గర్జన సభ సక్సెస్‌తో బీఆర్‌ఎస్‌లో జోష్ కనిపించింది. జిల్లా కేంద్రం ఫ్లెక్సీలు, బ్యానర్లతో గులాబీమయమైంది. సభలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కి నేడు హామీలను అమలు చేయకపోవడంతో జనం ఇదేం ప్రభుత్వమని ఛీ కొడుతున్నారని అన్నారు. కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కేటీఆర్‌పై ఉన్న అభిమానంతో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. సభకు కేటీఆర్ వస్తుంటే అడుగడుగునా జనం నీరాజనం పలికారు. గద్వాలకు కేటీఆర్ చేరుకోగానే ముందుగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్ గజమాలతో స్వాగతం పలికారు. కేటీఆర్ ర్యాలీ రాఘవేంద్ర కాలనీ నుంచి ప్రారంభం కాగా శాట్ మాజీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాస్ హనుమంతునాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ కేశవ్ ముందుండి నడిపించారు. ర్యాలీ సమయంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులతో రోడ్లన్నీ జనసంద్రంగా మారాయి. అర కిలోమీటర్‌కు పైగా ఉన్న మైదానానికి ర్యాలీ చేరడానికి దాదాపు గంటకుపైగా సమయం పట్టింది. మోటర్ సైకిళ్లు, వాహనాలు, ప్రజలు, కార్యకర్తలు, నాయకులతో పట్టణం కిక్కిరిసిపోయింది. కార్యకర్తలు అడుగడుగునా బీఆర్‌ఎస్, కేసీఆర్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ సభా ప్రాంగణానికి ర్యాలీగా చేరుకున్నారు. సభ నిర్వహించే తేరు మైదానం నాయకులు, అభిమానులతో కిక్కిరిసిపోయింది. కేటీఆర్ రాకతో గద్వాలలోని అన్ని రహదారులు జనంతో కిక్కిరిసిపోయాయి. సభ కొంత ఆలస్యమైనా సమావేశానికి వచ్చిన ప్రజలు సభ ముగిసేంత వరకు అక్కడి నుంచి కదలలేదు. ఈ సభకు వచ్చిన ప్రజలందరూ స్వచ్ఛందంగా వచ్చిన వారే తప్ప వారిని ఎవరూ సభకు తరలించకపోవడం గమనార్హం. కేటీఆర్ వచ్చే వరకు పార్టీ నాయకులు, అభిమానులను కళాకారులు ఆకట్టుకున్నారు. ఆటపాటలతో ప్రజలను ఉత్తేజపరిచారు.





గద్వాల తేరు మైదానంలో జరిగిన గద్వాల గర్జన బహిరంగ సభలో తల్వార్‌తో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ నేత విజయ్‌కుమార్.. బహిరంగ సభకు పెద్ద ఎత్తున హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు, ప్రజలు



స్వరాష్ట్ర సాధనలో భాగంగా 2011 సెప్టెంబర్‌లో జరిగిన సకల జనుల సమ్మెలో పాల్గొన్న సబ్బండవర్ణాలు

మహోన్నత ఘట్టం.. సకల జనుల సమ్మె

తెలంగాణ సెగ ఢిల్లీకి తాకేలా మహోద్యమం

14 ఏండ్లు పూర్తి.. స్మరించుకున్న కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష ఎంత బలంగా ఉన్నదో చాటిచెప్పిన మహోద్ధృత ఉద్యమ రూపం సకల జనుల సమ్మె అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. ఉద్యమ సారథి కేసీఆర్ పిలుపుతో యావత్ తెలంగాణ సమాజం ఒక్కటైందని గుర్తుచేసుకున్నారు. సబ్బండవర్ణాలు ఏకమై 42 రోజులపాటు శాంతియుతంగా నిరసన తెలిపి, తెలంగాణ సెగను ఢిల్లీకి తాకేలా చేశారని పేర్కొన్నారు. సకల జనుల సమ్మెకు శనివారంతో 14 ఏండ్లు పూర్తయిన సందర్భంగా నాడు సమ్మెలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. 'తెలంగాణ ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష ఎంత బలంగా ఉందో చాటి చెప్పిన మహోద్ధృత ఉద్యమ రూపం సకల జనుల సమ్మె. సబ్బండవర్ణాల ప్రజలు ఏకమై 42 రోజులపాటు శాంతియుతంగా నిరసన తెలిపి, తెలంగాణ సెగను ఢిల్లీకి తాకేలా చేసిన మహోన్నత ఘట్టం సకల జనుల సమ్మె. 2011 సెప్టెంబర్ 12న కరీంనగర్ జనగర్జనలో ఉద్యమ సారథి కేసీఆర్ పిలుపు మేరకు యావత్ తెలంగాణ సమాజం ఒక్కటైంది. సమ్మెలో స్వచ్ఛందంగా భాగస్వాములై 'జై ఏక్ ధక్కా.. తెలంగాణ పక్కా' అని దిక్కులు పిక్కటిల్లేలా తెలంగాణ ప్రజలు నినదించారు. నిర్బంధాలను ఛేదించి, ఆంక్షలకు ఎదురొడ్డి, బెదిరింపులను లెక్కచేయకుండా తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా తెలంగాణ బిడ్డలు పోరాడారు. సకల జనుల సమ్మెకు నేటితో 14 ఏండ్లు నిండిన సందర్భంగా సమ్మెలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

సింహాలై గర్జించిన రోజు: హరీశ్

తెలంగాణ కోసం యావత్ తెలంగాణ ప్రజలు సింహాలై గర్జించిన రోజు.. ఈ రోజు అని, స్వరాష్ట్ర కాంక్షను సకల జనుల సమ్మె పేరిట ప్రపంచానికి చాటి చెప్పిన మహోజ్వల ఘట్టం ఈ రోజు అని మాజీ మంత్రి హరీశ్‌రావు శనివారం ఎక్స్ ద్వారా గుర్తుచేసుకున్నారు. సరిగ్గా 14 ఏండ్ల క్రితం ఇదే రోజు మొదలైన 'సకల జనుల సమ్మె' 42 రోజుల పాటు నిరవధికంగా కొనసాగిందని పేర్కొన్నారు. కేసీఆర్ పిలుపుతో ప్రారంభమైన సమ్మె తెలంగాణ ఉద్యమ దిశను మలుపు తిప్పిందని, స్వరాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటింది' అని గుర్తు చేశారు.

కడియం.. సిగ్గుంటే రాజీనామా చెయ్

నువ్వు ఏ పార్టీలో ఉన్నావో చెప్పుకోలేవా?: తాటికొండ

జనగామ, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : 'కడియం.. నీకు సిగ్గు, శరం ఉందా? బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన నీవు అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరినవ్.. వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్' అని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఘాటు వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన జనగామలో మాట్లాడారు. కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నాడో కూడా చెప్పుకోవడానికి భయపడి ఇప్పటి వరకు స్పీకర్‌కు వివరణ ఇవ్వలేదని ఎద్దేవా చేశారు.

స్పీకర్ నుంచి నోటీసులు అందలేదు: దానం

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 13: ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నుంచి తనకు ఇంకా ఎలాంటి నోటీసులు అందలేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. శనివారం హిమాయత్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ నుంచి నోటీసులు అందుకున్న ఎమ్మెల్యేలు దానికి అనుగుణంగా వివరణ ఇస్తున్నారని పేర్కొన్నారు. తనకు నోటీసులు వచ్చిన తర్వాత అందులో ఏ అంశాలు ఉన్నాయో తెలుసుకుని లీగల్ సూచన మేరకు స్పీకర్‌కు వివరాలు తెలియజేస్తానని చెప్పారు.

• ఫిరాయింపు ఎమ్మెల్యేల దిష్టిబొమ్మ దహనం



బీఆర్‌ఎస్ నుంచి గెలుపొంది కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల దిష్టిబొమ్మను శనివారం సిరిసిల్లలోని నేతన్న చౌరస్తాలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో దహనం చేశారు. – సిరిసిల్ల టౌన్





ఎమ్మెల్యే ఎక్స్ అకౌంట్ నుంచి సీఎం ఫొటోలు డిలీట్

జగిత్యాల, సెప్టెంబర్ 13 : బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఎక్స్ ఖాతా నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోలు డిలీట్ చేశారు. మాకునూరి సంజయ్‌కుమార్ అఫిషియల్ సోషల్ అకౌంట్లలో రేవంత్‌రెడ్డితో ఉన్న ఫొటోలు తొలగించడంతో రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. సుప్రీం కోర్టు ఆదేశాలతో అసెంబ్లీ స్పీకర్ చర్యలు, నోటీసుల నేపథ్యంలో ఎమ్మెల్యే ఎక్స్ అకౌంట్ నుంచి రేవంత్‌రెడ్డి ఫొటోలు తీసివేసి, కేవలం తన ఒక్కడి ఫొటో ఉంచడం గమనార్హం.



లింగాపూర్ బీట్ ఎంట్రెన్స్ వద్ద మీడియాకు అనుమతి ఇవ్వకపోవడంతో ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

13 మంది ఆదివాసీ మహిళల అరెస్టు

- **లింగాపూర్ అటవీ ప్రాంతంలో ఉద్రిక్తత**
- **దమ్మన్నపేట, మామిడిగూడెంలో మోహరించిన అటవీశాఖ అధికారులు, సిబ్బంది**
- **ప్రాణాలు పోయినా పోడు భూములను వదిలేది లేదని తేల్చిచెప్పిన ఆదివాసీలు**
- **అటవీ సిబ్బందిపై దాడిచేశారని కేసు నమోదు**

దండేపల్లి, సెప్టెంబర్13: మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో అటవీ అధికారుల ఫిర్యాదు మేరకు 13 మంది ఆదివాసీ మహిళలను పోలీసులు అరెస్టు చేసినట్టు ఎస్ఐ తహసినొద్దీన్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తాళ్లపేట రేంజ్ పరిధి లింగాపూర్ బీట్ 380 కంపార్ట్‌మెంట్‌లో దమ్మన్నపేట, మామిడిగూడెంలకు చెందిన ఆదివాసీలు పోడు వ్యవసాయం చేసుకుంటూ నివాసాలు ఏర్పర్చుకున్నారు. శుక్రవారం అక్కడికి చేరుకున్న ఫారెస్టు అధికారులు ఇది అటవీప్రాంతమని, ఖాళీ చేయాలని చెప్పడంతో ఆదివాసీలకు, ఫారెస్ట్ సిబ్బందికి మధ్య గొడవ జరిగింది. దీంతో తమపై ఆదివాసీ మహిళలు దాడిచేశారని అటవీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయమే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి వందలాదిగా అటవీ అధికారులు, సిబ్బంది, పోలీసులు ఆదివాసీగూడేలకు చేరుకుని మహిళలను అరెస్టు చేశారు. మీడియాతో పాటు చేరుకున్న ఆదివాసీ సంఘ నాయకుడు మార్నేని భూమేశ్, మరికొంత మందిని ఫారెస్టు ఎంట్రెన్స్ వద్ద నిలిపివేశారు. అటవీ అధికారుల తీరుపై ఆదివాసీ సంఘాల నాయకులు, మీడియా ప్రతినిధులు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. అధికారులు, అటవీ సిబ్బంది వెళ్లిపోయిన తర్వాత అక్కడ చూస్తే పంటలు సాగు చేసిన ప్రదేశాల్లో జేసీబీలతో కందకాలు తవ్విన ఆనవాళ్లు కనిపించాయి. ఈ సందర్భంగా ఆదివాసీలు మాట్లాడుతూ 2004 కన్నా ముందు నుంచే ఈ భూములను సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. అధికారులు ఎన్ని కేసులు పెట్టినా, ప్రాణాలు పోయినా భూములను వదిలేదని తేల్చిచెప్పారు. శుక్రవారం అటవీ అధికారులు తాము వాగుల్లో స్నానం చేస్తుంటే వచ్చి ఇబ్బందికి గురిచేయడంతోనే దాడి చేశామని వివరించారు. మీడియాను ఎందుకు అనుమతించలేదని ఎఫ్‌డీవో రామ్మోహన్‌ను వివరణ కోరగా ఏదైనా ఉంటే ప్రెస్‌నోట్ విడుదల చేస్తామంటూ సమాధానం దాటవేశారు. పోడు భూముల పేరిట చెట్లు నరికినా, వన్య ప్రాణులకు హాని కలిగించినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.



నల్లగొండలోని గడియారం సెంటర్ వద్ద ట్రిపుల్ ఆర్ బాధిత రైతులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఆర్ఆర్ఆర్ రైతుల అరెస్ట్

› మొదటిపేజీ తరువాయి...

శాంతియుతంగా మంత్రికి వినతిపత్రం అందజేసి వెళ్తామని చెప్పినా వినకుండా అరెస్టు చేసేందుకు ప్రయత్నం చేశారు. వారిని బలవంతంగా ఈడ్చుకెళ్లి పోలీసు వాహనంలో పడేశారు. ఈ క్రమంలో బాధితులకు పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. వారిని బలవంతంగా అరెస్టు చేసి నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి మంత్రి పర్యటన ముగిసిన తరువాత సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. మొదటి అలైన్‌మెంట్ ప్రకారంగా రోడ్డు నిర్మించాలని, రెండో అలైన్‌మెంట్‌ను పక్కన పెట్టాలని మంత్రిని వేడుకుందామని వస్తే అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు. గ్రామంలో అంతా సన్నచిన్నకారు రైతులే ఉన్నారని, ఎకరం నుంచి ఐదు ఎకరాల లోపు ఉన్నవారి భూములు మొత్తంగా పోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. 216 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూముల మీదుగా రోడ్డు నిర్మాణం చేస్తే సారవంతమైన భూములు కోల్పోకుండా అక్కరకు రాని భూములు తీసుకుని రోడ్డు నిర్మాణం చేస్తే బాగుంటుందని సూచించారు. పరిహారం ఎకరాకు కేవలం రూ.10 లక్షలలోపు ఇస్తున్నారని, అక్కడ బహిరంగ మార్కెట్ విలువ రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుందని తెలిపారు. కానీ ప్రభుత్వ పరిహారంతో మరోచోట భూములు కొనే వీలు లేదని, ఉన్న జీవనాధారం కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

గుడ్డి గుర్రాల పళ్లు తోమడంలో బిజీ

'రాష్ట్రంలో ఉన్నరా? కేంద్రంలో ఉన్నరా?' —ఉపరాష్ట్రపతి ఎన్నిక విషయంలో బీఆర్ఎస్ పార్టీపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన ఎద్దేవా ఇది! రాజకీయ పార్టీల మధ్య, నాయకుల మధ్య విసుర్లు, చతుర్లు సహజమే కానీ, తమ బాధ్యతల్ని తాము సక్రమంగా నెరవేరుస్తున్నప్పుడు ఎలాంటి విమర్శ అయినా అందగిస్తుంది. అట్లా కానప్పుడు అది మందగిస్తుంది, వక్రబుద్ధి లాగే! రెండు నెలలుగా యూరియా కోసం రైతాంగం రోడ్డుకెక్కింది. తిండి, నిద్ర మాని రైతులు తెల్లవారుజామునే యూరియా కోసం క్యూలు కడుతున్నరు. అక్కడే సొమ్మసిల్లి పోతున్నరు. తోపులాటలో రక్తాలు కారుస్తున్నరు. అధికారుల కాళ్ల మీద పడుతున్నరు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల గల్లా పట్టుకుంటున్నరు. అన్ని ఈతి బాధలకూ ముందుగా గురయ్యే మహిళలు రేవంత్‌రెడ్డిని బూతులు తిడుతున్నరు.



శ్రీశైల్‌రెడ్డి పంజుగుల
90309 97371

రాష్ట్రంలో ఉన్న రేవంత్‌రెడ్డి, కేంద్రంలో ఉన్న కిషన్‌రెడ్డి ఏం వెలగబెడుతున్నరో; బాధ్యత మరిచిన ఆ రెండు పార్టీలు ఏ గుడ్డి గుర్రాల పళ్లు తోముతున్నయో మరి! రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రం; కేంద్రంపై రాష్ట్రం నెపం నెడుతూ కాలక్షేపం చేస్తున్నయి. కేంద్ర-రాష్ట్ర మంత్రుల మాటలు ఇక్కడ ఉటంకించడానికి కూడా మనస్సు రావడం లేదు. న్యూస్ ప్రింటు, ఇంకు, మీ సమయం, నా సమయం వృథా కాబట్టి! అంతటి పనికిమాలిన మంత్రాంగం నడుపుతున్నవి బీజేపీ-కాంగ్రెస్ కలిసి. జనం గోసపట్టనప్పుడు రాష్ట్రంలో ఉంటేనేమీ, కేంద్రంలో ఉంటేనేమీ, ఎంతమంది ఎంపీలు ఉంటేనేమీ, ఊరేగితేనేమీ కిషన్‌రెడ్డీ! అవతల చంద్రబాబు నాయుడును చూడండి. ఆర్రెడీ వాళ్ల దగ్గర 80 వేల మెట్రిక్ టన్నుల యూరియా ఉంది. నాలుగురోజుల క్రితం కాకినాడ పోర్టులో 18 వేల మెట్రిక్ టన్నులు దిగింది. వారంలో మరో 25 వేల మెట్రిక్ టన్నులు దిగబోతున్నది. మరి తెలంగాణలో ఎందుకు ఈ గోస? ఉక్రెయిన్ యుద్ధం కారణంగా అని సాకులు చెప్తున్నరు ఎంపీ రఘునందన్. ఆంధ్రకు యుద్ధం అడ్డురాలేదా? చంద్రబాబుకు బీజేపీ అడిగిన తడవే అన్నీ ఇస్తున్నది. మరి తమతో సత్సంబంధాలు లేని కాలంలో కూడా కేంద్రం నుంచి కావాల్సిన యూరియా రాబట్టుకున్నరు కదా కేసీఆర్. ఆయన పాలనలో ఎప్పుడూ యూరియా గోస వినపడలేదు కదా?

కేసీఆర్‌కు భవిష్యత్ దృష్టి ఉంటది. వందేండ్ల తర్వాత దేశం ఎట్లా ఉండాలో మాత్రమే కాదు, ఆర్నెల్ల తర్వాత వాతావరణ స్థితి, పంటల పరిస్థితి, రైతాంగం మనస్థితి అన్నీ ముందే ఊహించగలరు ఆయన. ఇది కేసీఆర్ నిపుణతకు తార్కాణం మాత్రమే కాదు, జనం పట్ల ఆయన పట్టింపునకు నిదర్శనం.'పని సాధించే విషయంలో కేసీఆర్ ఏ స్థాయికి అయిన వెళ్లిపోతరు. అందుకు బెస్ట్ ఉదాహరణ తెలంగాణ ధాన్యానికి సరిపోను గోనె సంచులు, లేవన్న విషయాన్ని నేషనల్ ఇష్యూ చేసి కేంద్రం మెడలు వంచి మూడు కోట్ల గన్ని బ్యాగ్స్ తెప్పించుకున్నరు'– అన్నరు అనిల్ కుమార్ వరగంటి అనే ఒక ప్రొఫెషనల్.

> తెలంగాణలో బీఆర్ఎస్ పాలన ఉన్న కాలంలోనే మధ్యప్రదేశ్‌లో బీజేపీ పాలనలో యూరియా కోసం ఆందోళన చేస్తున్న రైతులపై కాల్పులు జరిగినయి. కేంద్రంలో కూడా బీజేపీనే. ఏయే రాష్ట్రాలు తమ బఫర్ స్టాక్ వాడుకోవడం లేదో తెలుసుకుని, అప్పటి కేంద్ర ఎరువుల మంత్రి అనంతకుమార్‌తో కూర్చొని, కింది స్థాయి రైల్వే అధికారులతో కూడా కూర్చొని తెలంగాణకు యూరియా తెప్పించిండ్రు కేసీఆర్. ఇప్పుడు రేవంత్‌రెడ్డి కూడా కేసీఆర్‌లా, కనీసం తన గురువు చంద్రబాబులా పని చేయాలని జనం కోరుకుంటున్నరు.

'కేసీఆర్ ఎప్పుడు పంటుండెనో, ఏడ ఉంటుండెనో, ఏమి తింటుండెనో మాకెందుకు సార్. టైమ్‌కు యూరియా ఇస్తుండె, బ్యాంకు లల్ల పైసలు పడుతుండె, నీళ్లు, కరెంటు కడుపు నిండా ఇస్తుండె'– అన్న రైతు మాటలు మిర్రర్ టీవీలో చూసినం కదా! కృష్ణ అనే సూర్యాపేట యువకుడు హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ 'మేము ఇక్కడ ఉద్యోగాల కోసం, ఊళ్లో అమ్మానాన్నలు యూరియా కోసం గోసపడుతున్నం' అంటూ మొరపెట్టుకోవడం ఈ రాష్ట్ర దైన్యస్థితిని తెలియజేస్తున్నది కదా! 'గ్రూప్-1 ఉద్యోగం కోసం 3 కోట్లు అడిగిండు ఒక మంత్రి' అంటూ బాహాటంగా, ధైర్యంగా, ధర్మాగ్రహంతో మాట్లాడిన వీడియోలు వెలుగు చూసినయ్ కదా! ఎవరికి చెప్పుకోవాలి రక్షించమని? ఏమని మొరపెట్టుకోవాలి కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్నవారిని!!



'కన్నీటి బతుకుల కనలేని నాడు.. స్వామి కరుణామయుండన్న బిరుదేలనమ్మా...' అంటూ వేంకటేశ్వరస్వామి గురించి అలమేలు మంగమ్మతో మొరపెట్టుకున్నరు భక్తులు. ఆయన ఆపదమొక్కులవాడు కాబట్టి ఆశ అయినా ఉంటుంది. రేవంత్ గురించి మీనాక్షమ్మకు చెప్పినా, రాహులయ్యకు మొక్కినా ప్రయోజనం లేదని ఎన్నో సంఘటనలు తేల్చేసినయి. 'బట్టలు ఊడదీసి కొడితే ఇందిరమ్మ రాజ్యపు గొప్పతనం అర్థమైతది' అంటూ ఆపదలు హక్కుగా అందించే ముఖ్యమంత్రే పబ్లిక్ మీటింగ్‌లో మాట్లాడినంక ఎవరిపై, ఏ ఆశలు పెట్టుకోగలం? తాము ఎంత అహంకారులమో, ఎంత నియంతలమో రేవంత్ రెడ్డి పదే పదే చెప్తున్నరు. కిమ్మనని నిమ్మలా ఊకుంటూ ఊ కొడుతున్నరు రాహుల్‌గాంధీ.

దేశవ్యాప్తంగా 'ఓట్ చోరీ' గురించి జాతర చేస్తూ, తెలంగాణలో పాతర వేస్తున్నరు రాహుల్. ఓటుకు నోటు దొంగను సీఎం పీఠంపై కూర్చోబెట్టినప్పుడే ప్రజాస్వామిక విలువల పట్ల రాహుల్ నిబద్ధత, ఆయన విశ్వసనీయత బట్టబయలయ్యాయి. తన శిబిరంలోని పార్టీల పట్ల ఎంత అనాదరంగా ఆయన ఉంటరో ఇండీ కూటమి ముక్కచెక్కలు చెప్తున్నయి. 'రాజ్యాంగ పరిరక్షణ' అంటూ మాట్లాడే రాహుల్ మాటలు ఎవరూ నమ్మడం లేదు, మొన్న ఉపరాష్ట్రపతి ఎన్నికలోనూ చెల్లలేదు.తాజాగా తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో న్యాయవ్యవస్థను, స్పీకర్ వ్యవస్థను, రాజ్యాంగాన్ని తీవ్ర అపహాస్యం చేస్తున్నది రాహుల్‌గాంధీయే. ఇపుడు 'ఆ పది మంది' ఎమ్మెల్యేలు తమది కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకోలేని దైన్యంలో ఉన్నరు.

లోపలి కారణాలు ఏమైనా, కనీసం పైకి 'నియోజకవర్గ అభివృద్ధి' కోసం చేరామనీ చెప్పుకోలేరు, అభివృద్ధి శూన్యం కాబట్టి. పోనీ వ్యక్తిగత ప్రయోజనాలు దక్కినయా అంటే అదీ లేదు. కులమూ పోయింది, సుఖమూ దక్కలేదు అన్నట్టు అయింది పరిస్థితి. కాంగ్రెస్‌ను కసికసిగా ఓడించేందుకు సిద్ధంగా జనం ఉన్నరు కాబట్టి రాజీనామా చేసి ఎన్నికలకూ పోలేరు; న్యాయవ్యవస్థ పట్టుబట్టి వారిని అనర్హులుగా ప్రకటించినా తిరిగి రాజకీయంగా బట్ట కట్టలేరు. కాబట్టి, తాము బీఆర్ఎస్ పార్టీయే అని బుకాయిస్తున్నరు. సమాచార విస్ఫోటనంతో జనానికి అన్ని విషయాలూ అరటిపండు ఒలిచినట్టు అర్థం అవుతున్నయనే కనీస ఇంగితం కూడా లేదు వారికి!

ఫిరాయింపులు మనకు కొత్త కాదు. అందరూ, అన్ని పార్టీలూ ఏదో సందర్భంలో చేసినవే, ప్రోత్సహించినవే. కానీ, రాజ్యాంగం అంటూ రాసుకున్నాక దాన్ని పాటించాలి కదా? ఫిరాయింపుల నిరోధక చట్టానికి దొరకనంత సంఖ్యలో ఫిరాయింపులు ఎందుకు జరగలేదు మరి? నాడు కేసీఆర్ హయాంలో జరిగినట్టు ఇప్పుడు ఎందుకు జరగలేదు? ఎందుకంటే... పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ, అభివృద్ధిలోనూ, సంక్షేమంలోనూ, అంతిమంగా తన రాష్ట్రాన్ని సమున్నతంగా నిలబెట్టడంలోనూ కేసీఆర్‌కి, రేవంత్‌రెడ్డికి పోలిక లేదు కాబట్టి. నాడు ఫిరాయించిన వారు దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిన రాష్ట్ర పురోభివృద్ధిలో భాగస్వాములు అయిన్రు కాబట్టి. 'నేనూ గెలవను, కాంగ్రెస్ ప్రభుత్వమూ మళ్లా రాదు' అంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు బహిరంగంగా ప్రకటించిన ఉదంతం ఏం చెప్తున్నది? కాంగ్రెస్ సర్వభ్రష్టత గురించి కాదా? అలాంటి పార్టీని నమ్మిన జనం మోసపోయిన్రు, ఆ పది మంది ఎమ్మెల్యేలూ మోసపోయిన్రు.

తెలంగాణ కోసం గొంగళి పురుగునైనా ముద్దు పెట్టుకుంటానన్న కేసీఆర్ వేరు. తెలంగాణను తాకట్టు పెట్టడానికి ఏ గడ్డి అయినా తింటాననే రేవంత్‌రెడ్డి వేరు. ఈ విచక్షణ, ఈ క్షీర-నీర న్యాయం తెలంగాణ మేధావి వర్గానికి తెలియాలి. కాంగ్రెస్ ఏదో దేశాన్ని ఉద్ధరించే పార్టీ అనే భ్రమలు వీడాలి. అన్ని వ్యవస్థలనూ తన ప్రభుత్వం తుంగలో తొక్కుతూ ఉంటే, దేశమంతా రాజ్యాంగం పట్టుకుతిరగడానికి సాహసించినందుకు రాహుల్‌గాంధీ సిగ్గుపడాలి. ఆ పదిమంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి పరువు నిలుపుకోవాలి. ప్రజాకంటకుడైన రేవంత్‌రెడ్డిని దించేసి పుట్టి పూర్తిగా మునగకుండా చూసుకోవాలి. గుడ్డి గుర్రాల పళ్లు తోమడం ఆపేసి, ప్రజాస్వామ్యాన్ని నిజమైన అర్థంలో పట్టించుకోవాలి.

స్వయం పాలన, ఆత్మాభిమానం కోసం; పీడిత, తాడిత జనాలపై వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమాలకు ఉగ్గుపాలు పోసిన తెలంగాణ గడ్డ మరో పోరాటానికి సిద్ధమయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ధిక్కారానికి మారుపేరైన తెలంగాణ యువతరం ఇప్పుడు మరోసారి వార్తల్లోకి ఎక్కుతున్నది.

అవినీతి సర్కారుపై జెన్-జెడ్ యుద్ధ భేరి



పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

తెలంగాణ మొదటినుంచీ ప్రజా ఉద్యమాల గడ్డగా పేరుగాంచింది. 2009-2014 మధ్య జరిగిన తెలంగాణ సాధన ఉద్యమం యువత, సంఘటిత శక్తిని ప్రపంచానికి చాటిచెప్పింది. సీమాంధ్ర మీడియా కట్టడి చేసినా, సోషల్ మీడియా ప్రభావం అంతగా లేకపోయినా నాడు యువత గల్లీలను దాటి ఢిల్లీ కోటను బద్దలు కొట్టారు. ఇప్పుడు తరం మారింది. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నాటి నూనూగు మీసాల యువతరం స్ఫూర్తితో ఇప్పుడు జనరేషన్-జెడ్ (1997-2012 మధ్య జన్మించినవారు) ఈ ఉద్యమాల జెండాను ముందుకు తీసుకెళ్తున్నది. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, అవినీతిపై యుద్ధ భేరి మోగించడానికి సోషల్ మీడియా వేదికలు వీరికి శక్తివంతమైన ఆయుధాలుగా మారాయి.

తెలంగాణలో కాంగ్రెస్ సర్కారుకు రోజురోజుకు వ్యతిరేకత పెరుగుతున్నది. సర్కారు రెండు నెలలకోసారి నిర్వహిస్తున్న సర్వేల్లోనూ ప్రతికూల ఫలితాలే వస్తున్నాయి. రెండేండ్లుగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకపోవడమే ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో సర్కారుపై సమరభేరి మోగించేందుకు యువత సిద్ధమవుతున్నది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో జరిగిన ప్రజా ఉద్యమాలు, సోషల్ మీడియా, యువత ఐక్యతాశక్తిని నిరూపించిన ఘటనలను చూసి, తెలంగాణ ఉద్యమ తీరుతెన్నులను యువత బేరీజు వేసుకుంటున్నది. ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి ప్లాట్‌ఫామ్‌లు యువతను సంఘటితం చేయడంలో, సమాచారాన్ని వేగంగా వ్యాప్తిచేయడంలో, నిరసనలను సమన్వయపరచడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, హామీల అమల్లో వైఫల్యం ప్రజల్లో అసంతృప్తిని పెంచాయి. ఉద్యోగ నియామకాలు, డబుల్ బెడ్రూమ్ ఇండ్లు, దళిత బంధు పథకం, విద్యా, వైద్య సంస్కరణల్లో జాప్యం వంటి సమస్యలపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతున్నది. 2025 జనవరిలో తెలంగాణ కాంగ్రెస్ తన 'ఎక్స్' (ట్విటర్) ఖాతాలో 'ఫామ్‌హౌస్ పాలన కావాలా? ప్రజల వద్దకు పాలన కావాలా?' అని పోల్ నిర్వహించగా, 67% మంది ఫామ్‌హౌస్ పాలనకు ఓటు వేశారు. హెచ్‌సీయూ భూముల వ్యవహారంలో వచ్చిన వ్యతిరేకత సుప్రీంకోర్టు తలుపు తట్టింది. సీఎం సొంత నియోజకవర్గంలోని లగచర్లలో లంబాడీలపై సర్కారు దాష్టీకాన్ని, భూ దాహాన్ని ఇదే యువత, సోషల్ మీడియా ఎండగట్టి ప్రజల్లో చైతన్యం తీసుకురాగలిగింది. అమీర్‌పేట, అశోక్‌నగర్ చౌరస్తాలో విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఇదే సామాజిక మాధ్యమం అండగా నిలిచింది. ఇక తాజాగా రాష్ట్రంలో ఎరువుల కొరతపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నది సోషల్ మీడియా, యువతే. 'గత పదేండ్లలో ఎరువుల కొరత లేనప్పుడు, ఇప్పుడు ఎందుకు సమస్య వచ్చింది?' అంటూ యువత వల్లనే ప్రజా చైతన్యం వెల్లువలా సాగుతున్నది.

గతంలో సీఎం అమెరికా, దావోస్ పర్యటనల్లో చేసుకున్న స్వచ్ఛబయో కంపెనీతో జరిగిన ఫేక్ ఒప్పందాన్ని కూడా యువత, సోషల్ మీడియా బయటపెట్టాయి. ఇప్పటికీ '420 హామీలు' అనే నినాదంతో కాంగ్రెస్‌ను యువత ట్రోల్ చేస్తూ ప్రశ్నిస్తూనే ఉన్నారు. తెలంగాణలో జనరేషన్-జెడ్ యువత సోషల్ మీడియాను సర్కారు అవినీతిపై యుద్ధ భేరి మోగించే సమయం ఆసన్నమైంది. రానున్న రోజుల్లో సోషల్ మీడియాలో యువత తమ డిమాండ్లను స్పష్టంగా వ్యక్తం చేయాలి. #TelanganaForChange వంటి హ్యాష్‌ట్యాగ్‌లతో క్యాంపెయిన్ ప్రారంభించడం, నిరసనలను లైవ్ స్ట్రీమ్ చేయడం, అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించడం, తద్వారా ఉద్యమాలను బలోపేతం చేయవచ్చు. అంతేకాదు, యువత నిర్మాణాత్మక డిమాండ్లను ముందుకు తీసుకురావడం, విధాన నిర్ణేతలతో సంభాషణలు జరపడం, సమాజంలో సానుకూల మార్పులను ప్రోత్సహించడం ఇప్పుడు అవసరం. యువత ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకొని బాధ్యతాయుతంగా సోషల్ మీడియాను ఉపయోగించి, సమాజంలో శాశ్వతమైన మార్పులను సాధించాలి. యువ శక్తి, డిజిటల్ సాధనాలు కలిస్తే తెలంగాణ భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుంది.

(వ్యాసకర్త: శాసనమండలి సభ్యులు)

మాయల మోదీ.. కలల బేహారి!

దశాబ్దం పైచిలుకు కాలం గడిచిపోయింది. వైఫల్యాలు కుప్పలుతెప్పలుగా పోగుపడ్డాయి. అయినా మన వశీకరణ నేత అవేవీ అసలు పట్టించుకోడు. అన్నిటికీ జైకొట్టే భక్తగణం ఉండటమే అందుకు కారణం. వారిని ఇంకా ఇంకా కలల్లోనే ముంచుతుంటారాయన. ఉజ్వల భవిష్యత్తు చూపిస్తానని నమ్మిస్తూనే ఉంటారు. ఈ విషయంలో ఆయన ప్రదర్శిస్తున్న 'అమోఘమైన ప్రతిభాపాటవాలను, అసాధారణ ఆకర్షణ శక్తిని' బహుధా ప్రశంసించకుండా ఉండటం కష్టమంటున్నారు వ్యాసకర్త.



ఆకార్ పటేల్

భారతదేశాన్ని బహుళ సంస్కృతుల, లౌకికవాద సమాజంగా చూడటం వైపే మొగ్గుచూపే నాకు ఈ ప్రభుత్వంతో నావైన సమస్యలు ఎన్నో ఉన్నాయి. ఆ సమస్యలు ఈ రచయిత ఏండ్ల తరబడి రాస్తున్న వ్యాసాల సంఖ్యతో సమానంగా ఉంటాయేమో. భావజాలం, సూత్రాలపరంగా ఉండే విభేదాలే అందుకు కారణం. చాలామంది ఇతరుల్లాగే హిందూత్వ అనేది సమస్యాత్మకమైనదని, ఈ దేశంపై అసహజంగా రుద్దబడుతున్నదని నేను భావిస్తాను. ఇక ప్రభుత్వం చేసిన పనుల గురించి నచ్చనివి, విభేదించేవి చెప్పాలంటే జాబితా చాంతాడంత ఉంటుంది. ప్రస్తుత ఏలుబడికి సంబంధించి నాకు 'నచ్చినవి' కనీసం ఓ రెండు అంశాలు ఎంచుకోమంటే, మొదటగా ప్రస్తుత ప్రధాని ఇదివరకటి బీజేపీ ప్రధానిలా కాకుండా మైనారిటీల మీద వ్యతిరేకతను గొంతెత్తి చాటుకోవడం వైపు వేలు చూపిస్తాను. ఇక నాకు 'నచ్చిన' రెండో అంశం ఏదని అడిగితే.. తన చర్యల ద్వారా ఆయన సంతృప్త అభిమాన గణాన్ని సృష్టించుకోవడాన్ని చూపిస్తాను.

ఇవి చాలా చిన్న రాయితీల్లాగా కనిపించవచ్చు. బహుశా ఇంకేదైనా చెప్పి ఉండాల్సిందేమో. కానీ, అదంత సులభం కానేకాదు. ప్రస్తుతం పన్నెండో ఏడులో కొనసాగుతున్న ఓ బృహత్ కథాక్రమాన్ని విశ్లేషిస్తున్నప్పుడు దాని ప్రభావాన్ని సమగ్రంగా చూడకుండా తప్పించుకోవడం సాధ్యపడదు. ఒక సినిమా మీరు ఏ మాత్రం చూడలేని విధంగా ఉంటే.. 'ఈ సినిమా చూడటం నా వల్ల కాదు గానీ, హీరో మార్చిన డ్రెస్సులు మాత్రం బాగున్నాయి' అని చెప్పడంలో అర్థం లేదు. మనం చర్చిస్తున్న సినిమాకు ఈ సమీక్షకుడి నుంచి కేవలం ఒకటిన్నర స్టార్లు మాత్రమే పడతాయి. అవీ అయిష్టంగానే. కానీ, ఇక్కడ ఈ సినిమా అద్భుతంగా ఉందనే అభిప్రాయం కలిగిన వ్యక్తులతో కూడిన మరో పార్శ్వం కూడా స్పష్టంగానే ఉంది. ఈ వ్యాసం అలాంటి వారి గురించి రాసిందే.

మోదీ విధానాలకు జైకొట్టేవారు జనాభాలో పరిగణనకు రానంత చిన్న భాగమేమీ కాదు. ఈ కారణంగా దీనిని పరిశీలించడం ఆసక్తికరంగానే ఉంటుంది. వివక్షాపూరిత చట్టాలతో, దూరంగా పెట్టే విధానాలతో, విషపూరిత వాగాడంబరంతో మైనారిటీల మీదే ఆయన దృష్టి కేంద్రీకరించినంత కాలం, ఇతరత్రా ఆయన ఏం చేసినా ఈ అభిమాన వర్గానికి అసమ్మతి కలుగనే కలుగదు. ఈ ధోరణికి ఎల్లెడలా సాక్ష్యాలు పరచుకుని ఉన్నాయి కనుక, దీని



గురించి మరింత లోతుగా విప్పిచెప్పడమే ప్రస్తుత వ్యాస రచన వెనుక గల ముఖ్యోద్దేశం.

> గత కొద్దివారాల్లో జరిగిన ఘటనలు మన పరిశీలనకు బోలెడు సరంజామాను సమకూరుస్తున్నాయి. వస్తు, సేవల పన్నునే తీసుకోండి. సుమారు దశాబ్దం క్రితం ఆ చట్టాన్ని ఆమోదించినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థను భవిష్యత్తులోకి నడిపించే ముందుచూపుతో కూడిన సంస్కరణ అవుతుందని నమ్మబలికారు. సర్కారీ నిపుణులు టెలివిజన్ చానళ్లలో బారులు తీరి జీడీపీని ఆ పన్ను రెండు శాతం అమాంతంగా పెంచేస్తుందని, అదెలా సాధ్యమో వారు చెప్పకుండానే ఊదరగొట్టారు. అంతిమంగా అలాంటిదేదీ జరగనే లేదు.

అది వ్యాపారులకు సంక్లిష్టంగా ఉందని, పరోక్ష పన్నుల తలాతోకా లేని బాదుడు పేదలపై మరీ ఎక్కువ భారం మోపుతుందని, ఆదాయాలపై రాష్ట్రాల నియంత్రణ తొలగించడం ద్వారా వాటికి తీవ్ర అన్యాయం చేస్తుందని విపక్షాలు మొత్తుకున్నాయి. ఈ వాదనలన్నీ నిజమైనవే. ఈ వారం పన్నురేట్లను సవరించిన తర్వాత మరోసారి అదే చెప్పారు. మొదటి జీఎస్టీలో తప్పులున్నాయని, సవరించిన కొత్త జీఎస్టీ గొప్ప భవిష్యత్తులోకి నడిపిస్తుందని మురిపిస్తున్నారు. ఈ తప్పిదాన్ని తెలుసుకునేందుకు పదేండ్ల కాలం ఎందుకు పట్టింది? అనేది అసలు ప్రశ్న. భజనపరులైన మద్దతుదారులు కానివారి నుంచే ఈ ప్రశ్న వస్తుంది. భక్తజనులకు మాత్రం 2017 జీఎస్టీ గొప్పది గానూ, ఇప్పటి 2025 జీఎస్టీ అద్భుతమైనది గానూ కనిపిస్తుంది.

'భారత్‌పై తోకముడిచిన ట్రంప్..' ఇండియా దుష్ట చైనా పాలైందని రుసరుసలాడిన మరుసటి రోజే పీఎం మోదీ గొప్ప మిత్రుడని ప్రశంస వంటి శీర్షికలతో వార్తాపత్రికలు దద్దరిల్లజేశాయి. ట్రంప్ ఏమైనా 50 శాతం టారిఫ్‌లను ఎత్తివేశారా? లేదు. రష్యా నుంచి చమురు కొంటున్నందుకు ఇండియాను శిక్షించాలనే విధానాన్ని, కనీసం ఆ భాషనైనా అమెరికా మార్చుకున్నదా? అంటే అదీ లేదు. పై శీర్షికలు వచ్చిన రోజే ఆ పత్రికలే 'భారత్ క్షమాపణ చెప్తుంది, రెండు నెలల్లోనే ఒప్పందానికి వస్తుంది: లూట్నిక్' అనే శీర్షికతో అమెరికా కామర్స్ సెక్రెటరీ ప్రకటనను ప్రచురించాయి. మరైతే ట్రంప్ తోక ముడిచిందెక్కడ? నమ్మేవారి బుర్రల్లోనే ఆ యూటర్న్ చోటుచేసుకుంది. 'అమెరికా-ఇండియా టారిఫ్ వివాదం నేపథ్యంలో ఐక్య రాజ్య సమితి సర్వప్రతినిధి సభకు మోదీ దూరం' అనే మూడో శీర్షిక తాజాగా దర్శనమిచ్చింది. అంటే సమస్య కొనసాగుతూనే ఉందన్న మాట. మనం గెలిచామని నమ్మేశాం ఇంకా వాస్తవాలతో పనేముంది?

చైనాను శత్రువుగా చూడాలని 2020 ప్రారంభం నాటి నుంచి ఐదేండ్ల పాటు ఈ దేశానికి చెప్తూ వచ్చారు. చైనీస్ యాప్స్ తీసేయాలని, టెలివిజన్లను అవతల పారేయాలని భక్తులకు ఎక్కించారు. చైనాను 'కట్టడి' చేయడానికి మనం అమెరికాతో ఎలా జట్టు కట్టాలో సిద్ధాంతాలు నూరిపోశారు. పశ్చిమానికి దగ్గరగా చేర్చే ఈ మహత్తరమైన ఖండాల కలయిక గురించి ప్రభుత్వంతో మిలాఖతైన థింకుట్యాంకుల్లోని 'జియో-స్ట్రాటజిక్'వాలాలు టన్నుల కొద్దీ విశ్లేషణలు వండివార్చారు. ఇప్పుడు, కొద్దిరోజుల క్రితం వరకైతే, ఈ సెంటిమెంటు ఆగిపోవడమే కాదు, వెనుదిరిగింది కూడా. ఇప్పుడు చైనా మన మిత్రదేశం. చైనా తోడుగా ఉంటే అమెరికా ఆధిపత్యాన్ని మనం ఉఫ్ అని ఊదిపారేయగలం. అయితే చైనీయులు మనల్ని 2020 నాటి కంటే, లేదా అంతకు ముందరి కంటే భిన్నంగా ఏమైనా చూస్తున్నారా? అదేమీ లేదు. ఈ ప్రభుత్వం తన మద్దతుదారుల అభిప్రాయాలను మార్చివేసినంత సులభంగా చైనా మారదు. మనం మన పరిస్థితులకు అనుగుణంగా మన దృక్పథాలను సరిదిద్దుకుంటున్నాం. 'కాసేపు తూర్పు, కాసేపు పడమర' అనే డోలాయమాన విధానం ఇది. భలే సమయస్ఫూర్తి.

> నేను ఇదివరకే చెప్పినట్టుగా గత పన్నెండేండ్ల కాలంలో జరిగిన విషయాల్లో మెచ్చుకోవాల్సినవి పెద్దగా లేవు. వాస్తవిక నష్టం జరిగింది. దశాబ్దాలుగా అది కొనసాగుతుంది. కానీ, చుట్టూరా కుప్పలుతెప్పలుగా పోగైన వర్తమాన శిథిలాల గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా, తన అనుయాయులను ఇంకా ఉజ్వల భవిష్యత్తు చూపిస్తానంటూ నమ్మించడంలో వశీకరణ నేత ప్రదర్శిస్తున్న ప్రతిభాపాటవాలను, ఆకర్షణ శక్తిని బహుధా ప్రశంసించకుండా ఉండటం చాలా చాలా కష్టం.

('నేషనల్ హెరాల్డ్' సౌజన్యంతో...)

సామాన్యుడి మాట



యూరియా బస్తాతో రైతు దంపతులు మాలోతు హస్సేన్-లక్ష్మీ...

'రెక్కల్ ఆతేఖమ్ పిట్టిపిట్ట మాశేమాతి ఓడ్ జావ. ఓడ్ జావ్న సదా. హనురతోజ్ ఓ బంచ. నతో వుందున, వుందుర్ ఛిచావరేన పొళ్నకతో ఆఫ్లేర్ కత వంగ్ద. మనక్యాన ఏక్ కామ్ కరతోజ్ కాయి ఆపణ్ లంబాడీ వాళేర్ దాడో నికళ' (రెక్కలొచ్చిన పచ్చులు గూట్లోంచి ఎగిరిపోతనే ఉంటయి, పోవాలె గూడ. అట్లయితేనే వాటికి బతుకుదెరువు. లేకుంటే వాటిని, వాటి పిల్లల్ని సాకాలంటే తల్లి పచ్చులమైన మనతోనేడైతది? నపరో సార్గం, తలో పని జేస్కుంటెనే గదా మన లంబాడీ బతుకులకు తెల్లారేది?)

యూరియాకు వోతె శెక్కరొచ్చె..!

మాకు ఇద్దరు కొడుకులు, ఓ బిడ్డ. ఆమెను ఓ అయ్యకిచ్చి లగ్గం జేసి, అత్తగారింటికి సాగదోలినం. కొడుకులకూ పెండ్లిళ్లు జేసినం. మాకున్న భూమి ఎకరం అరబిగడే. ఆ ఎకరంన్నరల ఎంతమందిమి బతుకుతమనే ఇశారం జేసి కొడుకులిద్దరు పట్నం వలసవోయిన్రు. ఇగ నా పెనిమిటి 'మాలోతు హస్సేన్'కి పన్జేసి పన్జేసి యాష్టకొచ్చినప్పుడల్లా కొడుకులను యాజ్జేసుకుంటా ఉంటడు. ఆయన వాళ్లను యాజ్జేసుకున్నప్పుడల్లా నేనిట్లా.. 'రెక్కల్ ఆతేఖమ్ పిట్టిపిట్ట' అని సర్దిచెప్తుంటా. ఒక్కనాడా.. రెండ్రోజులా.. ఇయ్యాల్టికి మూడొద్దులాయె. ఎగిలివారంగ వోతున్నడు, పొద్దుగూకినంక అస్తున్నడు. అయినా ఆ పని పాడుగాను దంగుతలేదు. అందుకే ఆ పని మీద పోవుడంటనే ఆయనకిసుగొస్తున్నది. ఎటూ దొయ్యక కొడుకుల మీన పొద్దు వోతున్నడు. నా పెనిమిటి బాధను అర్థం జేస్కున్న గావట్టే.. 'సోవార్ తు జోమత్.. మ జావుంచు' (రేపు నువ్ పోవుడద్దు.. నేనే వోత) అన్జెప్పిన.

***

ఆ రోజు బుధారం. పొద్దుగాళ్ల ఆరు గొడ్తున్నది. ఇంత సద్దన్నం, దానంచుకు మాడికాయ తొక్కుతోని సద్ది గట్టుకున్న. నా తొవ్వ దేవ్లాతండాలోని మా ఇంటికాన్నుంచి పాలకవీడు మండల కేంద్రం (సూర్యాపేట జిల్లా) లోని సుసైటీ దగ్గరికి సాగుతున్నది. దగ్గెర దగ్గెర పది, పన్నెండు కిలోమీటర్లుంటది ఆ తొవ్వ. మా తండాకు గవర్నమెంటోని బస్సు గూడ దిక్కు లేదు. గంటాయె ఆటో కోసం నిలవడి. అట్ల నిలవడితే గానీ ఆటో రాదు. గంటన్నర తర్వాత ఓ ఆటో ఆగింది గనీ, నిండా జనాలున్నరు. ఆ ఆటో ఎక్కకుంటె ఏడగానిదాన్నైతనని ఒక్కశిత్తం జేస్కున్న.

> పదిన్నర గొడ్తున్నది, పాలకవీడు రానే అచ్చింది. సుసైటీ దగ్గర్నే ఆగింది ఆటో. ఆటో దిగి జూస్తే అక్కడ మనుషులే లేరంటే ఇగ లైనెక్కడిది? 'అమ్మయ్యా..' అని మన్సులనుకొని సక్కగ ఆఫీసు దగ్గర్కి వోయిన. 'ఓ పెద్దమ్మా.. నీకు శెప్పుల లైన్ కనవడ్తలేదా?' అని శెట్లకింది నుంచి కీకలేస్తనే ఉన్నరు జనాలు. వైసు మీద వడ్డది గదా? కన్లు జర నజరిస్తలెవ్వు. వాళ్ల కీకలిని పరీక్షవట్టి కిందికి జూస్తే శెప్పుల లైన్ మస్క మస్క గొడ్తున్నది. ఆ శెప్పులను జూసినంక.. 'మస్తు మంది జనాలుంటరు, ఏ న్నాత్తైతదో పో నువ్ మళ్లా ఇంటికొచ్చేసరికి' అని పొద్దున నా పెనిమిటి అన్న మాటలు అప్పుడినవడ్డయి.

ఎంబటే ఎన్కకొచ్చిన. దాదాపు అద్దకిలోమీటరున్నదా శెప్పుల లైన్. జనాల కు నిలవడే ఓసర లేక శెప్పులు లైన్ల వెట్టి శెట్లకిందికి వోయిన్రని నాకు తర్వాత అర్థమైంది. నేన్గూడ శెట్ల కిందికి ఇట్ల శేరుకున్ననో లేదో.. 'ఓ పెద్దమ్మా ఆధార్ కారట సూపెట్టి పేరెక్కిచ్చుకోపో.. లేకుంటే మళ్లా ఉత్తగనే మర్ల గొడుతరు' అని శెప్పవట్టిన్రు శెట్ల కింది జనాలు. వాళ్ల మాటలిన్న నేను సుసైటీ ఆఫీసు లోపల్కి వోయి 'మాలోతు లక్ష్మీ, దేవ్లాతండా' అని హాజరేపిచ్చుకున్న.

పగటీలి ఒకటైతున్నది, రెండైతున్నది. నా సుట్టూరా ఉప్పుకారం వాసన రువ్వడిగా గొడ్తున్నది. ఏంటిదా అని జూస్తే ఒక్కొక్కలు తెచ్చుకున్న సద్దులు ఇప్పుతూ కనవడ్డరు. ఇగ లాభం లేదు, తెచ్చుకున్న సద్దిని తెరుద్దామని నేన్గూడ వోయి శెయ్ గడుక్కున్న. అవే శెట్ల కింద బండలుంటే ఓ బండేస్కొని ఒకాడ గూసున్న. ఇంకో బండ మీన మూతవెట్టిన. ఆ మూతలున్న అన్నం, దానిమీది మాడికాయ తొక్కు కనవడ్డదో మన్నో పక్కపొంటామెకు, ఆమె కడుపు సల్లగుండ. 'ఓ అమ్మా.. పతాకం తొక్కుతోని ఏం దింటవ్, ఇగ వట్టు' అని కొంచెం తమాట కూరేసింది. ఆమెను జూసి ఇంకొగామె గూడ ఇంత అంకాయ కూరేసింది. తెచ్చుకున్న సద్ది రెండు, మూడు కూరలతోని తినేసరికి లారీ లోడ్ యూరియా రానే అచ్చింది. ఏడి గిన్నెలాడ వారేసి అందరు ఒక్కటే ఉరుకుడు. ఈ మోకాళ్లు పాడుగాను, నొప్పులొచ్చేసరికి వాళ్ల లెక్క నాకుర్క రాలె. మెల్లంగ వొయ్యేసరికి లైన్ రైలు డబ్బోలె నిలవడి ఉన్నది. అప్పటిదాన్క శెట్లకింద మంచిగ ముచ్చట వెట్టుకున్న మనుషులు ఆ యూరియా లోడ్‌ను సూడంగనే 'నేనంటె నేను ముందు' అని కొట్టుకున్నంత పన్జేసిన్రు. 'ఎన్కో.. ముందో.. అందరికి మా అస్తది తియ్యరాదున్రి యూరియా' అని నేనంటే.. నా ఎన్కున్న ఓ పెద్దమనిషి.. 'ఓ తల్లీ అచ్చింది లారీల కమాన యూరియా గాదు, ఒక్కటే లారీ లోడ్' అని నోట్లె నోట్లె గునుగుతున్నడు. లైన్ల నిలవడి అప్పటికే రెండు గంటలాయె. నా పేరు ఎప్పుడొస్తదా అని నేను శెవులు దర్వాజ మొకానేసి ఎదురుజూస్తనే ఉన్న. నా పేరు ఇగ రాదు, అగ రాదు.

***

''నీ యూరియా సల్లగుండ! లచ్మీ... నేను మా దీస్కత్త తియ్యే అనంగ గూడ ఉరికితివి. ఇప్పుడేమైంది.. 'నా పేరు పిలుస్తున్నరుల్లా, నా పేరు పిలుస్తున్నరుల్లా...' అని కల్వరిచ్చుకుంటా మంచాన వడితివి'' అని నా పెనిమిటి తిట్టవట్టిండు. అవును, ఆయన నన్నెందుకు తిడుతున్నడో తెలుసానుల్లా.. బుధారం రోజు సుసైటీల నా పేరు విల్శేదాకనే నాకు మతికున్నది. ఆ తర్వాతేమైందో నాకు తెల్వదు. ఎందుకంటే నాకు ముందే ఆస్తమా రోగమున్నది. అందున బుధారం నాడు లైన్ల అంతసేపు నిలవడేసరికి కండ్లకు శెక్క రొచ్చినట్టయి కింద కూలవడ్డనట. మా ఇంటాయెనకు అక్కడున్నోళ్లెవ్వలో శెప్తే.. నన్ను ఇంటికి తోల్కచ్చిండట!



గడ్డం సతీష్
99590 59041



ఈ నెల 15నుంచి అశోక్‌కుమార్ చేపట్టనున్న ఆమరణ నిరాహార దీక్ష పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో అశోక్‌కుమార్, రాజారాంయాదవ్ తదితరులు

ఉద్యోగ నోటిఫికేషన్లలో కాంగ్రెస్ విఫలం

- 15నుంచి ఆమరణ నిరాహార దీక్ష
- మద్దతు కోసం కేటీఆర్‌ను కలిసిన అశోక్‌కుమార్

ఎల్బీనగర్, సెప్టెంబర్ 13: ఉద్యోగ నోటిఫికేషన్లు ప్రకటించడంలో కాంగ్రెస్ సర్కారు ఘోరంగా విఫలమైందని తెలంగాణ నిరుద్యోగుల హక్కుల వేదిక అధ్యక్షుడు అశోక్‌కుమార్ విమర్శించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు శనివారం నందినగర్‌లోని తన నివాసంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. నిరుద్యోగుల కోసం ఈనెల 15నుంచి దిల్‌సుఖ్‌నగర్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేయనున్నట్టు కేటీఆర్‌కు వివరించారు. నిరుద్యోగులకు అండగా నిలవాలని, తన నిరాహార దీక్షకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. దీనికి స్పందించిన కేటీఆర్.. నిరుద్యోగుల పోరాటానికి తన మద్దతు ఎప్పుడు ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం కేటీఆర్ ఆమరణ నిరాహార దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. అదేవిధంగా నిరాహార దీక్షకు మద్దతు ఇవ్వాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావుతో పాటుగా పలువురు నాయకులను అశోక్‌కుమార్ కలిశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు రాజారాం యాదవ్, చంద్రశేఖర్, ప్రశాంత్, ప్రణీత్, రవికుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు బియ్యం నష్టం 140 కోట్లు!

- రేషన్ షాపుల్లో మిగిలిన బియ్యం అమ్మకానికి నిర్ణయం
- ముక్కి, పురుగులు పట్టిన తర్వాత విక్రయానికి చర్యలు
- కేజీ బియ్యం ధర రూ.24గా నిర్ణయం... భారీగా నష్టం

హైదరాబాద్, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ): ధాన్యమైనా, బియ్యమైనా నష్టాలకు విక్రయించడం పౌరసరఫరాలశాఖకు అలవాటుగా మారింది. ఇప్పటికే ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించి వేల కోట్ల నష్టాన్ని మూటగట్టుకున్న సంస్థ.. తాజాగా మిగిలిపోయిన దొడ్డు బియ్యాన్ని సైతం తక్కువ ధరకు విక్రయించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రేషన్ షాపులు, గోదాముల్లో మిగిలిపోయిన 1.4 లక్షల టన్నుల దొడ్డు బియ్యాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించేందుకు సివిల్ సప్లయ్ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. కనీస ధర కేజీ రూ. 24గా నిర్ణయించారు.

ఆర్నెళ్ల తర్వాత జ్ఞానోదయం

ఏప్రిల్ నుంచి రేషన్ షాపుల్లో దొడ్డు బియ్యానికి బదులుగా సన్న బియ్యం పంపిణీని ప్రభుత్వం ప్రారంభించింది. దీంతో అప్పటికే రేషన్ షాపులు, గోదాముల్లోని దొడ్డు బియ్యం నిల్వలు మిగిలిపోయాయి. సన్న బియ్యం పంపిణీ నిర్ణయానికి ముందే దొడ్డు బియ్యం నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలి. కానీ దొడ్డు బియ్యం నిల్వలు ఉండగానే... ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీని ప్రారంభించింది. ఈ విధంగా రూ.500 కోట్ల విలువైన ఆ బియ్యం ఆర్నెళ్లుగా రేషన్ షాపులు, గోదాముల్లోనే మూలుగుతున్నాయి. దీంతో ఆ బియ్యం పురుగులు పట్టి ముక్కిపోయే స్థితికి చేరుకున్నాయి. వాటిని తీసుకెళ్లాలంటూ రేషన్ డీలర్లు ఎంత మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవం లేదు. జరగాల్సిన నష్టం జరిగిన తర్వాత, ఆర్నెళ్ల ఆలస్యంగా అధికారులు ఈ-వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించారు.

కనీస ధర వచ్చేనా?

ధాన్యాన్ని మిల్లింగ్ చేయడానికి, రవాణాతో పాటు ఇతర ఖర్చులన్నీ కలిపి కేజీకి రూ. 34 వ్యయం అవుతుందని అంచనా. అయితే సివిల్ సప్లయ్ మాత్రం దొడ్డు బియ్యం విక్రయించేందుకు కనీస ధర రూ. 24గా నిర్ణయించింది. ఈ లెక్కన ఎఫ్‌సీఐ చెల్లించేదానికన్నా కేజీకి రూ. 10 నష్టం వాటిల్లుతున్నది. ఈ లెక్కన టన్నుకు రూ. 10వేల చొప్పున మొత్తం 1.4 లక్షల టన్నులకు నష్టం రూ. 140 కోట్ల వరకు ఉండే అవకాశం ఉన్నది.

ఇరిగేషన్ ప్రమోషన్లలో అవకతవకలు?

- ఏకంగా మంత్రిపైనే ఆరోపణలు
- కోర్టును ఆశ్రయించిన ఇంజినీర్లు
- నేటి సన్మానసభ రద్దు!



హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఇరిగేషన్‌శాఖలో ఇటీవల కల్పించిన ఉద్యోగోన్నతులలో పలు అవకతవకలు జరిగినట్టుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే విషయమైన పలువురు ఇంజినీర్లు కోర్టును ఆశ్రయించారని, ఏకంగా శాఖ మంత్రిపైనే ఆరోపణలు చేసినట్టుగా తెలుస్తున్నది. అయితే సెక్రటేరియట్‌లోని పలువురు అధికారుల తీరువల్లే ఈ పరిస్థితి వచ్చిందని జలసౌధ వర్గాల్లో జోరుగా చర్చ కొనసాగుతున్నది. అమాత్యుడినే తప్పుదోవ పట్టిస్తున్నారని పలువురు ఇంజినీర్లు బాహాటంగానే విమర్శిస్తున్నారు. వాస్తవంగా ఇరిగేషన్‌శాఖలో 1975 నుంచి నియమితులైన వారెవరికీ ప్రమోషన్లు లేకుండాపోయాయి. అంతా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈఈ) స్థాయి పే స్కేళ్లతోనే ఈఎన్సీలుగా, సీఈలుగా, ఎస్ఈలుగా, ఈఈలుగా పనిచేశారు. ఆ హోదాలోనే విరమణ పొందారు. రాష్ట్ర ఏర్పాటు 2014వరకు గల ఇంజినీర్ల సీనియార్టీ జాబితాను ఉమ్మడి ఏపీ ప్రభుత్వమే రూపొందించి ఇవ్వాల్సి ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఏపీ సర్కారు ఆ జాబితాను అందివ్వలేదు. ఇప్పటికీ కూడా ఇవ్వలేదు. మరోవైపు సమస్యకు పరిష్కారం చూపాలని ఇరిగేషన్‌శాఖ ఇంజినీర్లు అనేక పర్యాయాలు గత కేసీఆర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దానిపై సానుకూలంగా స్పందించిన బీఆర్ఎస్ సర్కారు ప్రమోషన్ల అంశానికి సంబంధించి ప్రత్యేక కమిటీని నియమించింది. ఆ కమిటీ ప్రస్తుత ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులతో అనేక దఫాలుగా చర్చలు జరిపి సీనియార్టీ ఆధారంగా తుది నివేదికను సిద్ధం చేసింది. ఎట్టకేలకు 2020లో బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్‌హాక్ ప్రమోషన్లను కల్పించింది. మొత్తంగా 839 మంది డీఈఈలకు ఈఈలుగా, 279 మంది ఈఈలకు ఎస్ఈలుగా, 75మంది ఎస్ఈలకు సీఈలుగా, నలుగురు సీఈలకు ఈఎన్సీలుగా ప్రమోషన్లు ఇచ్చింది. ఇన్‌చార్జి పోస్టులు లేకుండా హోదాకు అనుగుణంగా పేస్కేళ్లను పొందే అవకాశాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదేరీతిలో ఇటీవల ప్రమోషన్లను కల్పించింది. ఒకరు ఈఎన్సీగా, 11మందికి సీఈలుగా, 46 మందికి ఎస్ఈలుగా, 85మందికి ఈఈలుగా, 123మందికి డీఈఈలుగా ఉద్యోగోన్నతిని కల్పించింది. అయితే ఈ ప్రక్రియలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించకుండా ఇష్టారీతిన ప్రమోషన్లను కల్పించారని పలువురు ఇంజినీర్లు ఆరోపిస్తున్నారు. సెక్రటేరియట్‌లోని పలువురు ఉన్నతాధికారులు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను సరిగా అమలు చేయలేదని జలసౌధ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అంతేకాదు అనునయులు కోసం కొందరు అధికారులను ప్రమోషన్ల జాబితా నుంచి సైతం తప్పించారని విమర్శిస్తున్నారు. అందుకు అనుగుణంగా సీనియార్టీ జాబితాలను రూపొందించారని, జాబితాలో వెనకున్నవారిని ముందుకు తెచ్చారని, ముందున్నవారిని పక్కనపెట్టారని చెబుతున్నారు. ఇప్పుడు ఇవే ఆరోపణలతో పలువురు ఇంజినీర్లు కోర్టును ఆశ్రయించారు. అయితే ప్రమోషన్లలో చక్రం తిప్పిన కీలక అధికారులను వదిలి ఏకంగా ఇరిగేషన్‌శాఖ మంత్రినే ఈ వ్యవహారం మొత్తానికి బాధ్యులుగా చేసినట్టుగా జలసౌధవర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇదిలా ఉండగా ఇదేవిషయమై ఇంజినీర్ల తీరుపై మంత్రి సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టుగా చర్చకొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో ఆదివారం నిర్వహించ తలపెట్టిన అభినందన సభను రద్దు చేశారు. వాస్తవంగా ప్రమోషన్లు పొందిన అధికారులను సన్మానించాలని భావించారు. ఆదివారం రోజున కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జలసౌధలో ఏర్పాట్లు సైతం చేశారు. అయితే ప్రమోషన్లపై అవతవకలు జరిగాయని పలువురు ఇంజినీర్ల నుంచి ఆరోపణలు రావడంతో ఏకంగా కార్యక్రమాన్ని రద్దు చేసినట్టుగా తెలుస్తున్నది.


అక్రమ మద్యం అమ్మండి!

- పట్టుబడిన సరుకు వినియోగించాలి
- దొంగ మద్యాన్ని జాతీయ ఉత్పత్తిగా గుర్తించాలి
- అధికారులకు మంత్రి జూపల్లి వివాదాస్పద సూచనలు
- ఎక్సైజ్, ప్రజా సంఘాల మండిపాటు
- 'నమస్తే' కథనం నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులతో మంత్రి సమీక్ష
- సిబ్బందికి ఆయుధాలిస్తామని హామీ



హైదరాబాద్, సెప్టెంబర్13(నమస్తే తెలంగాణ): ప్రజల ప్రాణాలు ఎట్ల పోయినా తమకు నిధుల రాబడే ప్రధానమని పాలకులు మరోసారి రుజువు చేశారు. మద్యం మాఫియా అక్రమంగా తరలించే నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్డీపీఎల్)ను ఇకపై ధ్వంసం చేయొద్దని సాక్షాత్తూ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. ఈ మద్యాన్ని జాతీయ ఉత్పత్తిగా గుర్తించి ప్రజలకు విక్రయించాలని వివాదాస్పద సూచనలు చేశారు. నకిలీ 'మద్యం దందా నెలకు రూ200 కోట్లు' అనే శీర్షికతో శుక్రవారం 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనానికి ఎక్సైజ్ శాఖ అప్రమత్తం అయ్యింది. ఈమేరకు శుక్రవారం రాత్రే ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ వారం రోజుల గ్రౌండ్ స్టాక్ నిబంధనను అమల్లోకి తేగా.. శనివారం ఆబ్కారీ భవన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి చెందిన ఎస్టీఎఫ్ అండ్ డీటీఎఫ్ టీమ్‌లతో మంత్రి జూపల్లి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సూచనలపై వివాదం చెలరేగింది. దొంగ మద్యం ఏరూపంలో సరఫరా చేసినా అది ప్రజల ప్రాణాలకే ముప్పు అనే కనీస అవగాహన లేకుండా మంత్రి జూపల్లి సూచన చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణలో చీప్ లిక్కర్ నుంచి మొదలుకొని ప్రీమియం లిక్కర్ వరకు ఈఎన్ఏ (ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్)ను వాడుతారని, ముడి ఆల్కహాల్‌ను అనేకసార్లు ప్యూరిఫైడ్ చేస్తే ఈఎన్ఏ వస్తుందని ఎక్సైజ్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అక్రమ మద్యాన్ని వినియోగించేటట్టు చూడాలనే సూచన చేయడంపై ఎక్సైజ్ అధికారులు, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. ఎన్డీపీఎల్, నకిలీ మద్యం గుర్తించలేనంత దగ్గర పోలికలతో ఉంటాయని, నకిలీ మద్యంలో అప్పుడప్పుడు ఇథైల్ ఆల్కహాల్ బదులుగా, మిథైల్ ఆల్కహాల్ కలిసిపోతుందని, అదే జరిగితే ప్రాణాలు పోతాయని చెబుతున్నారు. గతంలో పలు ప్రాంతాల్లో జరిగిన మరణాలకు ఇలాంటి మద్యమే కారణమని వాపోతున్నారు. ఎక్సైజ్ పరిభాషలో దీనిని డెత్ స్పిరిట్‌గా పిలుస్తారని చెబుతున్నారు. మిథనాల్ నింపిన మద్యం సీసాలు ప్రభుత్వం తరపున విక్రయిస్తే జరిగే పెను ప్రమాదానికి బాధ్యులెవరిని ప్రశ్నిస్తున్నారు. ఇక ఎస్టీఎఫ్ టీమ్‌లు సమర్థవంతంగా పనిచేసేందుకు అవసరమైతే ఆయుధాలను కూడా ఇవ్వడానికి ప్రభుత్వం సుముఖంగా ఉందని మంత్రి తెలిపారు. ఒకే బార్ లైసెన్స్‌పై ఎక్కువ బార్లు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్సైజ్ కమిషనర్ సీహెచ్ హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ



వానా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	34.5°c	22.6°c
రంగారెడ్డి	31.6°c	13.4°c
మెదక్	31.4°c	23.9°c
ఖమ్మం	31.0°c	23.0°c
వరంగల్	30.0°c	22.0°c
కరీంనగర్	29.0°c	25.0°c
నల్లగొండ	28.5°c	23.2°c
హైదరాబాద్	28.0°c	24.0°c
నిజామాబాద్	27.1°c	23.3°c
మహబూబ్‌నగర్	27.0°c	22.0°c

మరో రెండ్రోజులు వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో అల్పపీడనంతో రాష్ట్రంలో మరో రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావారణ శాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. గడిచిన 24గంటల్లో కరీంనగర్, మెదక్, జనగాం, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సిద్దిపేట, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో కొన్ని చోట్ల అతి భారీ వర్షాలు కురిసినట్టు పేర్కొన్నది. ఆదివారం రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి జిల్లాలకు వర్షసూచన ఉండటంతో ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్టు తెలిపింది.

బీఆర్ఎస్‌పై నిఘా.. భద్రతకు దగా!

నేరాల నియంత్రణను పక్కనబెట్టిన యంత్రాంగం • బీఆర్ఎస్ నేతలపైనే ఇంటెలిజెన్స్ విభాగం ఫోకస్

ఫోన్ ట్యాపింగ్, లొకేషన్ ట్రేసింగ్‌పైనే మొత్తం దృష్టి

ధర్నాలు, ఆందోళనలు అడ్డుకోవడానికే ప్రాధాన్యం

- సివిల్ వివాదాల్లో తలదూర్చుతున్న అధికారులు
- రాష్ట్రవ్యాప్తంగా విపరీతంగా పెరిగిపోతున్న నేరాలు
- నడిరోడ్లపై హత్యలు, బహిరంగంగా చోరీలు
- మహిళల పట్ల విచ్చలవిడిగా పెరిగిన నేరాలు
- పొరుగు రాష్ట్రాల పోలీసుల సీక్రెట్ ఆపరేషన్లు
- సంఘ విద్రోహ శక్తులపై తగ్గిపోతున్న నిఘా
- అభాసుపాలవుతున్న రాష్ట్ర పోలీసుశాఖ పనితీరు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): నడిరోడ్లపైనే హత్యలు.. బహిరంగంగా దోపిడీలు.. మహిళలపై విచ్చలవిడిగా పెరిగిపోతున్న దాడులు.. ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితి ఇది. నేరాలను నియంత్రించాల్సిన పోలీస్ విభాగం అసలు పనిని వదిలేయడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలో పోలీసుల ఫోకస్ పూర్తిగా మారిపోయిందనే విమర్శలు ఉన్నాయి. రాజకీయకక్షలతో విపక్షాలను కొందరు ఉన్నతాధికారులు కారణంగా నిఘా సంస్థలు శాంతి భద్రతలను గాలికి వదిలేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. నేరస్తులపై నిఘా వదిలేసి ప్రతిపక్ష రాజకీయ నేతలపైనే నిఘా పెడుతుండటంతో నేరాల సంఖ్య క్రమంగా పెరుగుతున్నదని చర్చ జరుగుతున్నది. రాష్ట్రంలో బీఆర్ఎస్ గ్రామ కార్యకర్తలు మొదలు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులపై పోలీసు నిఘా పెరిగిందన్నది బహిరంగ రహస్యం. అంతేకాదు.. పొద్దున లేచింది మొదలు 'ఈ రోజు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు ఆందోళనలు చేస్తున్నారు? ఎక్కడ ధర్నాలు చేస్తున్నారు.? ఎవరు ఎక్కడున్నారు?' వంటి వివరాలు కనుక్కోవడానికే సమయం సరిపోతున్నదని పోలీస్ వర్గాలే పేర్కొంటున్నాయి. వారి మొబైల్ నంబర్లు కనుక్కొని, ఆ నంబర్లను ట్రేస్ చేస్తూ, ముందస్తు అరెస్టులు చేయడానికి, వారు హైదరాబాద్ వరకు చేరుకోకుండా అడ్డుకోవడానికే పూర్తి సమయం వెచ్చించాల్సి వస్తున్నదని వాపోతున్నారు.

రాజకీయ చక్రంలో చిక్కి..


మండలస్థాయి నుంచి జిల్లా ఎస్పీ కార్యాలయాల వరకూ పోలీసులు రాజకీయ చట్రంలో కొట్టుమిట్టాడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా పోలీసు బాసులు స్థానిక రాజకీయ నేతలు, మంత్రులు చెప్పే అంశాలపైనే ఎక్కువగా దృష్టిసారిస్తూ అసలు డ్యూటీలను పక్కన పెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. యూరియా కోసం ఇబ్బందులు పడుతున్న రైతుల ఇండ్లకు వెళ్లి బెదిరించడం, తమ చెప్పులతో తామే కొట్టుకున్నా కూడా రైతులపై కేసులు పెట్టే స్థాయికి దిగజారడమే ఇందుకు నిదర్శనంగా పేర్కొంటున్నారు. చాలాచోట్ల పోలీసులు భూ వివాదాల్లో తల దూర్చుతున్నారనేది బహిరంగ రహస్యం. సివిల్ వివాదాలను పక్కనపెట్టి, నేరాల కట్టడికి కృషి చేయాలని ఇప్పటికే సుప్రీంకోర్టు, హైకోర్టు హెచ్చరించినా కొందరి తీరు మారడం లేదు. నేరాలను తగ్గించడానికి ప్రణాళికలు రచించడం, పెట్రోలింగ్ పెంచడం, మహిళలకు, ప్రజలకు భరోసా కల్పించడం వంటి పోలీసు డ్యూటీలను ఎప్పుడో వదిలేశారని బాధితులు ఆరోపిస్తున్నారు.

ఇటీవల తెలంగాణలో నమోదైన నేరాల గణాంకాలు

2024లో	2.34 లక్షలు
హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో	41%
సైబరాబాద్‌లో	65%
క్రైం డిటెక్షన్ రేట్	31%
ఛేదించలేకపోయిన నేరాల సంఖ్య	163
అసభ్య ప్రవర్తనపై నమోదైన కేసులు	11,325

పెరిగిన కేసులు	శాతం
వరకట్న మరణాలు	6.35
వేధింపుల కేసులు	2.61
ఇండ్లలో దోపిడీలు	5





స్టేషన్ రావడమే మానేశారు

కొందరు ఖాకీలు రోజూ గంటల తరబడి ల్యాండ్ సెటిల్‌మెంట్లు, సొంత పనుల్లో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శిస్తున్నారు. వారు స్టేషన్లలో అందుబాటులో ఉండకపోవడంతో ఫిర్యాదుదారులు గంటల తరబడి ఎదురుచూసి, నిరాశగా వెనుదిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఎస్‌హెచ్‌వోలు ఉదయం పదిగంటలకు స్టేషన్‌లో దర్శనమిస్తే మళ్లీ రాత్రి 7 గంటల తర్వాతే ఫిర్యాదుదారులను కలుస్తున్నారని విమర్శలు ఉన్నాయి. పోలీసు వ్యవస్థ పనితీరు కోసం ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ఫిర్యాదుల్లో ఇదే విషయం తేటతెల్లమైంది.

నేరగాళ్లకు భయం పోతున్నది

పోలీసులు తమ డ్యూటీలను పక్కన పెట్టడం, గ్రామస్థాయిలో సరైన పెట్రోలింగ్ లేకపోవడం, పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా నిఘా పెట్టకపోవడం వల్ల నేరస్తులకు పోలీసులు అంటేనే భయం లేకుండా పోతున్నదన్న ఆరోపణలు ఉన్నాయి. నేరం చేసే సమయంలో 'పోలీసులు పట్టుకుంటారేమో? జైలుకు పంపుతారేమో? శిక్ష పడుతుందేమో?' అనే భయం ఏ మాత్రం కనిపించడం లేదని పోలీస్ వర్గాలే పేర్కొంటున్నాయి. అందుకే నేరం చేయాలనుకునే వారు నిర్భయంగా, జంకు లేకుండా దారుణాలకు ఒడిగడుతున్నారు. నడి రోడ్డుపైనే అత్యంత దారుణంగా ప్రత్యర్థులను నరికి చంపడం, 'ఎందుకు?' అని అడిగితే.. 'మమ్మల్ని అనేవారు ఎవరు?' అంటూ నిర్భయంగా సమాధానాలు చెప్తున్న పరిస్థితి. పోలీసులు పట్టుకుంటారనే భయం లేకుండా పట్టపగలే చోరీలు, హత్యలు, దోపిడీలు, మహిళలపై అఘాయిత్యాలు వంటి తీవ్రమైన నేరాలు పెరుగుతున్నట్టు చర్చ జరుగుతున్నది. ఇక విచ్చలవిడిగా మద్యం, డ్రగ్స్ దొరకడం కూడా నేరాల పెరుగుదలకు కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. పాత నేరస్తులే కాదు కొత్తగా నేరాలు చేయాలనుకున్న వారిలోనూ భయం ఏమాత్రం లేకపోవడం ఆందోళనకరం. తెలంగాణలో ఇటీవల నమోదైన నేరాల్లో కొత్తగా నేరం చేసిన వారే 80శాతం వరకూ ఉండటం ఆందోళన కలిగించే అంశం.

పక్క రాష్ట్రాల నుంచి సీక్రెట్ ఆపరేషన్లు

తెలంగాణ పోలీసులకు తెలియకుండా పక్క రాష్ట్రాల పోలీసులు, జాతీయ దర్యాప్తు సంస్థలు ఇక్కడికి వచ్చి రహస్యంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. వారు వచ్చి.. పెద్ద పెద్ద కేసుల్లో నిందితులను అరెస్టు చేసి, ట్రాన్సిట్ వారెంట్‌కు వెళ్లే వరకూ మనోళ్లకు సమాచారం లేకపోవడం గమనార్హం. ఇటీవల చర్లపల్లి డ్రగ్స్ కేసులో మహారాష్ట్ర పోలీసుల ఆపరేషన్ ఇలానే జరిగింది. గతంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులు, ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు పలు కేసుల్లో సీక్రెట్ ఆపరేషన్లు నిర్వహించారు. ఇటీవల తెలంగాణలో ఉగ్రవాదులు ఉన్నారంటూ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) వచ్చి బోధన్‌లో అరెస్టు చేసింది. పాకిస్థాన్‌తో కలిసి కుట్రలు చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన సమీర్‌ను అదుపులోకి తీసుకుంది. గతంలో గూఢచర్యం చేస్తున్నారని పలుచోట్ల తనిఖీలు నిర్వహించింది. మావోయిస్టులను రహస్యంగా అరెస్టు చేసిన ఘటనలు ఉన్నాయి. కనీసం ఇప్పటికైనా రాష్ట్ర పోలీస్ శాఖ మేల్కొనాలని ప్రజలు కోరుతున్నారు.

కొన్ని కీలక కేసులు..

- ఈనెల 12న కుషాయిగూడలో రియల్ ఎస్టేట్ వ్యాపారి శ్రీకాంత్‌రెడ్డిని నడిరోడ్డుపై ఇద్దరు దారుణంగా పొడిచి చంపారు.
- ఈనెల 10న రేణు అగర్వాల్‌ను ఇద్దరు వ్యక్తులు దారుణంగా చంపి.. నగలు, నగదుతో పరారయ్యారు.
- కూకట్‌పల్లిలో ఆగస్టు 18న 12 ఏండ్ల బాలికను ఓ బాలుడు దారుణంగా హత్య చేశాడు.
- ఆగస్టు 12న ఉదయం 10.30 నిమిషాలకు హైదరాబాద్, చందానగర్‌లోని ఖజానా జ్యువెలరీ షాపులో భారీ చోరీ జరిగింది.
- ఈనెల 7న కరీంనగర్‌లో ఎమర్జెన్సీ వార్డులో యువతిపై ఓ కాంపౌండర్ అత్యాచారం చేశాడు.
- ఈనెల 7న రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారం చేశారు.
- మే 2న పెద్దపల్లిలో ఓ మహిళలను అత్యంత కిరాతకంగా హతమార్చారు.
- ఏప్రిల్ 1న నాగర్ కర్నూల్ జిల్లాలో ఓ మహిళపై ఏడుగురు కిరాతంగా సామూహిక అత్యాచారం చేసి, నోట్లో మూత్రం పోసిన ఘటన సంచలంగా మారింది.
- కాచిగూడలో వ్యాపారవేత్త ఇంట్లో పనివాళ్ళే మత్తుమందు ఇచ్చి సుమారు రూ. 50 లక్షల నగదు, కిలో బంగారం అపహరించారు.
- రంగారెడ్డి జిల్లా కొత్తపల్లిలో పట్టపగలు సినీ ఫక్కీలో రూ.40 లక్షలు దారిదోపిడీ చేశారు.
- బ్యాంకులో ఓ బాలుడు రూ.5 లక్షలు కాజేసిన ఘటన సంచలనంగా మారింది.
- గద్వాలలో 32 ఏళ్ల ల్యాండ్ సర్వేయర్ గంట తేజేశ్వర్ హత్య.
- ఈ ఏడాది ఏప్రిల్ 1న నగరంలోని పహాడిషరీఫ్ పరిధిలో జర్మనీ నుంచి వచ్చిన యువతిపై కారు డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు.
- 2025 జూన్ 14న కాంగ్రెస్ నాయకుడు మారెల్లి అనిల్‌ను నిందితులు తుపాకీతో కాల్చి చంపారు.
- 2025 జూన్ 14న మలక్ పేటలో సీపీఐ నేతపై కంట్లో కారం కొట్టి కాల్పులు జరిపి చంపారు.
- 2025 ఫిబ్రవరి 1న ప్రిజం పబ్ వద్ద మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్, సైబరాబాద్ సీసీఎస్ పోలీసులపై కాల్పులు జరిపాడు.
- 2024 నవంబర్ 1న హైదరాబాద్ సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ఓ వ్యక్తి తాను ప్రేమించిన అమ్మాయి తండ్రిపై ఎయిర్ గన్‌తో కాల్పులు జరిపాడు.



ఖమ్మం నగరంలోని సాంబశివరావు ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

జర్నలిస్టు సాంబశివరావుకు అండగా బీఆర్ఎస్

- కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించిన కేటీఆర్
- ఇంటికెళ్లి భరోసానిచ్చిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

మణుగూరు టౌన్/అశ్వారావుపేట టౌన్/ ఖమ్మం, సెప్టెంబర్ 13 : రైతుల పక్షాన నిలిచి వార్తలు రాసిన టీ న్యూస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి సాంబశివరావుపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. సాంబశివరావు కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. శనివారం బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఖమ్మం బంగారయ్యనగర్‌లోని సాంబశివరావు ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం కేటీఆర్‌కు ఫోన్ చేసి సాంబశివరావు సతీమణి శ్రీదేవితో మాట్లాడించారు. పోలీసు కేసులతో అధైర్యపడొద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని కేటీఆర్ భరోసానిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేయడం పరిపాటిగా మారిందని ఆవేదనచెందారు. ధైర్యంగా ఉండాలని సాంబశివరావు సతీమణి శ్రీదేవి, అత్త మల్లమ్మ, కూతురు సహస్రకు ధైర్యం చెప్పారు. టీ న్యూస్ ప్రతినిధిపై తప్పుడు కేసులు బనాయించడంపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట జర్నలిస్టులు, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక రింగ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా రాస్తూ.. నిరంతరం సమస్యలను వెలికి తీసి వాటి పరిష్కారానికి కృషి చేయడంలో ముందుంటున్న జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టి అణగదొక్కే ప్రయత్నంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలను తెలుసుకునేందుకు వెళ్లిన టీ న్యూస్ ప్రతినిధి సాంబశివరావుపై అక్రమ కేసులు పెట్టడాన్ని మణుగూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మణుగూరులోని అంబేద్కర్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎస్సై రంజిత్‌కు వినతిపత్రం అందజేశారు.

రాబడి 25%..అప్పులు 75%

ఇక మిగిలింది 13 వేల కోట్లే

- రూ.1000 కోట్లకు ఇండెంట్
- అప్పుల్లో కొత్త రికార్డు సృష్టించిన రేవంత్‌రెడ్డి సర్కారు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): అప్పులు తేవడంలో రేవంత్‌రెడ్డి సర్కారు సరికొత్త రికార్డు సృష్టిస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆరు నెలలు పూర్తిగాకముందే బడ్జెట్ రుణ సమీకరణ అంచనాలో 75 శాతానికి చేరింది. ఇప్పటికే రూ.40 వేల కోట్ల వరకు అప్పులు సేకరించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తాజాగా మరో రూ.1000 కోట్ల రుణ సమీకరణ కోసం ఆర్బీఐకి ఇండెంట్ పెట్టింది. రిజర్వు బ్యాంకు ప్రతి మంగళవారం నిర్వహించే ఈ-వేలంలో పాల్గొని ఈ నెల 16న ఈ మొత్తాన్ని సేకరిస్తామని పేర్కొన్నది. 28 ఏండ్ల కాలానికి రూ.1,000 కోట్ల రుణ సమీకరణ కోసం సెక్యూరిటీ బాండ్లు పెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల కింద రూ.54,009 కోట్లు సమీకరిస్తామని కాంగ్రెస్ సర్కారు బడ్జెట్‌లో ప్రతిపాదించింది. కానీ, ఆర్థిక సంవత్సరంలో ఆరు నెలలు గడువక ముందే ఒక్క ఆర్బీఐ నుంచే సుమారు రూ.41,000 కోట్లు అప్పుచేసింది. అర్ధ ఆర్థిక సంవత్సరానికి 75శాతానికిపైగానే రుణ సమీకరణ చేసింది. బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం ఓపెన్ మార్కెట్‌లో సేకరించాల్సిన అప్పు ఇక రూ.13 వేల కోట్లు మాత్రమే మిగిలింది. కాంగ్రెస్ సర్కారు ఆదాయ రాబడిలో 25 శాతం దాటడం లేదు.. కానీ, అప్పుల సేకరణలో మాత్రం 75శాతానికి చేరడంపై ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

కృష్ణా వాటాపై తలోమాట!

> మొదటిపేజీ తరువాయి...

ఉమ్మడి ఏపీ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీ కోసం కేంద్రం మొదటిసారి 1969లో బచావత్ నేతృత్వంలో కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్ 1 (కేడబ్ల్యూడీటీ -1) ఏర్పాటు చేసింది. ఈ ట్రిబ్యునల్ 75శాతం డిపెండబులిటీ (100ఏండ్లలో 75ఏండ్లపాటు ఒక నదిలో వచ్చిన ప్రవాహాలను లెక్కగట్టి సగటు నీటి లభ్యతను తీస్తారు) ద్వారా మొత్తంగా కృష్ణాలో 2060 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయని, వాటి వినియోగం ద్వారా తిరిగి నదిలోకి 70టీఎంసీల జలాలు వస్తాయని అంచనా వేసింది. మొత్తంగా కృష్ణాలో 2130 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయని లెక్కతేల్చింది. ఆ జలాల్లో మహారాష్ట్రకు 585టీఎంసీలు, కర్నాటకకు 734 టీఎంసీలు, ఉమ్మడి ఏపీకి 811టీఎంసీలను పంచింది. మొత్తంగా 330టీఎంసీల మిగులు జలాలు అందుబాటులో ఉంటాయని అవార్డులో ప్రకటించింది. ఈ కేటాయింపులను 2000 సంవత్సరం తర్వాత సమీక్షించుకోవచ్చని మొత్తంగా 1976లో ట్రిబ్యునల్ 1 తన తుది తీర్పును వెలువరించింది. బచావత్ ట్రిబ్యునల్-1 సూచనల మేరకు నాటి అవార్డును సమీక్షించేందుకు కేంద్రం 2004లో జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలో కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్ 2 (కేడబ్ల్యూడీటీ 2) ఏర్పాటు చేసింది. ఈ ట్రిబ్యునల్ 65శాతం డిపెండబులిటీ కింద, సగటు ప్రవాహాల ఆధారంగా కృష్ణా నదిలో మొత్తంగా 2578టీఎంసీలు అందుబాటులో ఉన్నాయని లెక్కతేల్చింది. అందులో ట్రిబ్యునల్1 కేటాయించిన 2130 టీఎంసీలను మినహాయించి.. మిగిలిన 448టీఎంసీల జలాలను మూడు రాష్ట్రాలకు పంచింది. అందులో మహారాష్ట్రకు 81టీఎంసీలు, కర్నాటకకు 173టీఎంసీలు, ఉమ్మడి ఏపీకి 194టీఎంసీలను కేటాయించింది. అందుకు సంబంధించిన అవార్డు డ్రాఫ్ట్‌ను 2010లో, తుది అవార్డును 2013లో కేడబ్ల్యూడీటీ 2 నివేదించింది. ట్రిబ్యునల్ తీర్పుపై పలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ ఉమ్మడి ఏపీ సర్కారుతోపాటు, మిగిలిన రాష్ట్రాలు సైతం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో అవార్డు అమలులోకి రాకుండా పెండింగ్‌లో మిగిలిపోయింది. ఇదిలా ఉంటే ట్రిబ్యునల్ 1, ట్రిబ్యునల్ 2 రెండింటి ద్వారా ఉమ్మడి ఏపీకి ఇప్పటికే కృష్ణా జలాల్లో 1005 టీఎంసీలు దక్కాయి. ఇవి కాకుండా పోలవరం నుంచి కృష్ణాకు 80టీఎంసీలను డైవర్షన్ చేయగా, అవార్డు ప్రకారం ఆ జలాలను కూడా బేసిన్ రాష్ట్రాలకు పంచారు. అందులో ఉమ్మడి ఏపీకి 45, కర్నాటక, మహారాష్ట్రకు 35టీఎంసీలు ఉన్నాయి. మొత్తంగా కృష్ణాలో ఉమ్మడి ఏపీ వాటా 1050టీఎంసీలు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఉమ్మడి ఏపీకి కేటాయించిన కృష్ణా జలాలను తెలంగాణ, ఏపీ రెండు రాష్ట్రాల మధ్య పునఃపంపిణీ చేయాలని నిర్ణయించారు. పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం ప్రాజెక్టుల వారీగా పంపిణీ చేయాలని మార్గదర్శకాలను జారీ చేశారు. అయితే కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం దీనిని తీవ్రంగా వ్యతిరేకించింది. సెక్షన్89 ద్వారా తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందని పదేండ్లపాటు కేంద్రంపై కొట్లాడింది.

అవగాహన లేని సీఎం, మంత్రి

ట్రిబ్యునల్ 1 కేటాయించిన కృష్ణా జలాల్లో 75శాతం డిపెండబులిటీ కింద 555టీఎంసీలు, 65శాతం డిపెంబులిటీ కింద 575టీఎంసీలను కేటాయించాలని బీఆర్ఎస్ మొదటి నుంచీ డిమాండ్ చేస్తున్నది. మొత్తంగా 71క్యాచ్‌మెంట్ ఏరియా, బేసిన్‌లో నివసించే జనాభా, దుర్భిక్ష ప్రాంతాల ఆధారంగా మొత్తంగా 1050 టీఎంసీల కృష్ణా జలాల్లో మొత్తంగా 789టీఎంసీలు తెలంగాణకు దక్కాల్సి ఉంటుందని గతంలో నుంచి బీఆర్ఎస్ సర్కార్ వాదనలు వినిపిస్తూ వస్తున్నది. అయితే రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇష్టారీతిన ప్రకటనలు చేస్తూ తెలంగాణ జల హక్కులను ప్రమాదంలో పడేస్తున్నారని తెలంగాణ నీటిపారుదల నిపుణులు మండిపడుతున్నారు. గతంలో కృష్ణాలో 500టీఎంసీలను రాసిస్తే తెలంగాణకు చాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తాజాగా కృష్ణా జలాల్లో 904టీఎంసీలు దక్కుతాయంటూ ప్రకటించారు. మంత్రి ఉత్తమ్ 811టీఎంసీల్లో 71శాతం నీటివాటా మాత్రమే దక్కుతుందంటూ ప్రకటించారు.

న్యాయమైన వాటా దక్కేనా!

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తీరు చూస్తే కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా దక్కుతుందా? ట్రిబ్యునల్‌లో ఏమేరకు వాదనలు వినిపిస్తున్నారో అని నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం నూతన మార్గదర్శకాల ప్రకారం జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ గత జనవరి నుంచి విచారణ చేపట్టింది. తెలంగాణకు సంబంధించిన వాదనలు ఇప్పటికే తుది దశకు చేరుకున్నాయి. 23, 24, 25వ తేదీల్లో తెలంగాణ తుది వాదనలు వినిపించాల్సి ఉంది. ఆ తర్వాత ఏపీ తన వాదనలను కొనసాగిస్తుంది. అయితే వాదనలు తుదిదశకు చేరుకున్న ప్రస్తుత తరుణంలోనూ రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తెలంగాణ నీటివాటాలపై అవగాహన లేకపోవడం, భిన్న ప్రకటనలు చేయడం ఏంటని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధించాలి

- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): కృష్ణా జలాల పునఃపంపిణీలో న్యాయమైన వాటాకోసం ట్రిబ్యునల్ ఎదుట బలమైన వాదనలు వినిపించాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఈనెల 23నుంచి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట మరోసారి విచారణ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో నీటిపారుదలశాఖ ప్రత్యేకకార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఈఎన్సీ అమ్జద్‌హుస్సేన్, ఇరిగేషన్‌శాఖ ఇంటర్‌స్టేట్ విభాగం ఎస్ఈ సల్లా విజయ్‌కుమార్, ఈఈలతోపాటు ట్రిబ్యునల్‌లో తెలంగాణ తరపున వాదనలను వినిపిస్తున్న సీనియర్ న్యా యవాది వైద్యనాథన్, సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ వోహ్రా బృందంతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ శనివారం సమీక్షించారు. తెలంగాణకు రావాల్సిన వాటా కోసం వాదనలు వినిపించాలని కోరారు.

తెలంగాణలో కూడా 'ఆపరేషన్ కగార్'

- మావోయిస్టులతో చర్చలకు తావులేదు
- మీడియాకు డీజీపీ జితేందర్ వెల్లడి
- లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత సుజాతక్క..రివార్డు అందజేత



సుజాతక్కకు రివార్డు చెక్కు అందజేస్తున్న డీజీపీ జితేందర్

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వంతో సమానంగా తెలంగాణలో కూడా 'ఆపరేషన్ కగార్'ను కొనసాగిస్తున్నామని, మావోయిస్టులతో చర్చలకు ఎక్కడా తావులేదని డీజీపీ జితేందర్ చెప్పారు. గతంలో జరిగిన చర్చల వల్ల ఏం ఉపయోగం జరిగిందని ప్రశ్నించారు. చర్చలు, మావోయిస్టుల విషయంలో ఎక్కడా రాజీ పడటంలేదని చెప్పారు. సీపీఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు, మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల కిషన్‌జీ అలియాస్ కోటేశ్వరరావు భార్య పోతుల పద్మావతి అలియాస్ సుజాతక్క అలియాస్ మైనక్క ఇటీవల మహబూబ్‌నగర్ పోలీసుల ముందు అనారోగ్య కారణాలతో లొంగిపోయారు. ఈ క్రమంలో ఆమెను డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, ఎస్ఐబీ ఐజీ సుమతి శనివారం మీడియా ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా రూ.25 లక్షల డీడీని ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఇప్పటికే 404 మంది మావోయిస్టులు లొంగిపోయారని చెప్పారు. వీరిలో నలుగురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక డివిజనల్ కమిటీ కార్యదర్శి, 8 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 34 మంది ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారని తెలిపారు. గత 20 నెలల కాలంలో సుమారు 34 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారని చెప్పారు.

అజ్ఞాతంలో 78 మంది

ప్రస్తుతం సీపీఐ మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన మావోయిస్టులు 78 మంది వివిధ రాష్ట్రాల కమిటీల్లో ఉంటూ నేటికీ అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ జితేందర్ తెలిపారు. మొత్తం 15మంది కేంద్ర కమిటీ సభ్యుల్లో 10 మంది తెలంగాణకు చెందిన వారే ఉన్నారని చెప్పారు. ఇక తెలంగాణ రాష్ట్ర కమిటీలో 71 మంది ఉండగా.. వారిలో 12 మంది తెలంగాణ వారు కాగా, మిగిలిన వారంతా ఇతర రాష్ట్రాలకు చెందిన మావోయిస్టులేనని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన మావోయిస్టులు స్వరాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు లొంగిపోవాలని డీజీపీ పిలుపునిచ్చారు.

వీడిన 43 ఏండ్ల అజ్ఞాతం..

ఇంటర్ చదువుతున్న రోజుల్లోనే ఉద్యమంలో చేరిన పోతుల పద్మావతి అలియాస్ సుజాతక్క దాదాపు 43 ఏండ్లపాటు అజ్ఞాతంలో గడిపారు. 62 ఏండ్ల సుజాతక్క స్వస్థలం జోగులాంబ గద్వాల జిల్లా, గట్టు మండలం, పెంచికల్‌పాడు గ్రామం. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలిగా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటేరియట్ సభ్యురాలిగా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ పరిధిలోని దక్షిణ సబ్‌జోనల్ బ్యూరో కార్యదర్శిగా, జనతన్ సర్కార్ (రెవల్యూషనరీ పీపుల్స్ కమిటీ) బాధ్యురాలిగా ఆమె పనిచేశారు. ఆమె తండ్రి తిమ్మారెడ్డి పెద్ద కాసు రైతు కుటుంబానికి చెందినవారు. తల్లి వెంకమ్మ, పోస్‌మాస్టర్ అయిన తండ్రి.. 1983లో చనిపోయారు. ఆమెకు ఐదుగురు తోబుట్టువులలో ముగ్గురు సోదరులు, ఒక సోదరి ఉన్నారు. ఆమె పెద్దన్న పోతుల శ్రీనివాస్‌రెడ్డి కూడా 1982లో 2 నెలలు పీపుల్స్‌వార్ గ్రూప్‌లో పనిచేశారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పనిచేసిన సీనియర్ నాయకుడు మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ ప్రహ్లాద్ అలియాస్ కిషన్‌జీని సుజాతక్క 1984లో పెండ్లి చేసుకున్నారు. వీరికి ఒక కుమార్తె ఉంది. 2011లో కిషన్‌జీ ఎదురు కాల్పుల్లో మరణించారు.

బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపేయాలి

- తెలంగాణ పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్



హిమాయత్‌నగర్, సెప్టెంబర్13: కేంద్ర ప్రభుత్వం చేస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లను తక్షణమే ఆపేయాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ జీ లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ నారాయణరావు డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ గరియాబంద్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10మంది మరణించారని ఆవేదన వ్యక్తంచేశారు. 21నెలలుగా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట 72సార్లు ఎన్‌కౌంటర్లు చేయగా, 670 మందికి పైగా చనిపోయారని, ఇందుల్లో ఆదివాసీలు, అమాయక ప్రజలే అధికంగా ఉన్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలని పౌర సమాజం ఘోషిస్తున్నా.. ఎన్‌కౌంటర్ల పరంపర కొనసాగిస్తుందని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజ్యాంగాన్ని సైతం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్‌చేశారు.

అల్లరి చేయొద్దు.. మీకే నష్టం!

> మొదటిపేజీ తరువాయి...

మల్లు భట్టివిక్రమార్క చేసిన వ్యాఖ్యలు. చర్చలకు పిలిచి, రుసరుసలాడటం, హెచ్చరించడం సరికాదని కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'బకాయిలు విడుదల చేయాలని వినతిపత్రాలిచ్చాం. ఆ తర్వాత ప్రభుత్వానికి ఆర్థికభారంలేని ప్రత్యామ్నాయ ప్రణాళికను సమర్పించాం. మంత్రులు, అధికారులను ఎన్నిసార్లు కలిసినా ప్రయోజనం లేనందువల్లే బంద్‌కు పిలుపునివ్వాల్సి వచ్చింది' అని తేల్చి చెప్పినట్టు సమాచారం. 'తొందరపడొద్దు.. బకాయిలు విడుదలచేస్తాం' అని డిప్యూటీ సీఎం చెప్పగా.. 'ఎప్పటిలోగా ఇస్తారో చెప్పండి. దసరాలోపు బకాయిలు చెల్లిస్తామని హామీ ఇస్తేనే బంద్ పిలుపును విరమిస్తాం' అని కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులు స్పష్టంచేశారు. దీంతో 'నేను ఢిల్లీ వెళ్తున్నాను, వచ్చిన తర్వాత మాట్లాడుతాను' అని భట్టివిక్రమార్క తెలపగా.. 'సోమవారం వరకు ఎన్ని బకాయిలు విడుదల చేస్తారో స్పష్టంగా చెప్పండి, అలా అయితేనే బంద్ పిలుపును విరమిస్తాం. కోర్టుకు వెళ్లిన కాలేజీలకు బకాయిలు విడుదల చేశారు. మేమేం పాపం చేశాం?' అని కాలేజీల ప్రతినిధులు ముక్తకంఠంతో మంత్రికి తేల్చిచెప్పారు. అయినా కూడా భట్టివిక్రమార్క ఎలాంటి హామీ ఇవ్వకుండానే సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో పిలుపునిచ్చిన మేరకు సోమవారం నుంచి కాలేజీలు మూసివేసి, ఆందోళనబాట పట్టాలని నిర్ణయించారు.

సెమిస్టర్ పరీక్షలూ బహిష్కరణ



నిరవధిక బంద్ పాటించాలని నిర్ణయం తీసుకున్న కాలేజీ యాజమాన్యాలు సోమవారం నుంచి జరగాల్సిన సెమిస్టర్ పరీక్షలను కూడా బహిష్కరించాలని, పరీక్షల నిర్వహణకు సహకరించవద్దని తీర్మానించాయి. సోమవారం నుంచి బీఈడీ ఒకటో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు జరిగాల్సి ఉంది. యాజమాన్యాలు కాలేజీల బంద్‌కు పిలుపునివ్వడంతో మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఈ పరీక్షలను వాయిదా వేసింది. తిరిగి ఈ నెల 26 నుంచి పరీక్షలను నిర్వహిస్తామని ప్రకటించింది. జేఎన్టీయూ పరిధిలో బీ-ఫార్మసీ సెమిస్టర్ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. కాలేజీల యాజమాన్యాలు మూకుమ్మడిగా బంద్ ప్రకటించడంతో ఈ పరీక్షలు కూడా సందిగ్ధంలో పడ్డాయి.

సోమవారం కీలక సమావేశం

సర్కారుతో చర్చలు విఫలం కావడం, స్పష్టమైన హామీ రాకపోవడంతో కాలేజీల యాజమాన్యాలు బంద్ విషయంలో ముందుకెళ్లాలని నిర్ణయించాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదలయ్యే వరకు విశ్రమించొద్దన్న నిర్ణయానికి వచ్చాయి. ఈ మేరకు ఎఫ్ఏటీహెచ్ఈఐ ప్రతినిధులు సోమవారం ఉదయం అత్యవసరంగా సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి అన్ని కాలేజీల యాజమాన్యాలను ఆహ్వానించారు. సోమవారం ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోతే కాలేజీల బంద్ కొనసాగించడంతోపాటు, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు.

ఫలించని రెండో విడత చర్చలు

వృత్తివిద్యా కాలేజీల యాజమాన్యాలతో భట్టివిక్రమార్క జరిపిన చర్చలు విఫలమయ్యాయి. ఎలాంటి హామీ ఇవ్వకుండానే డిప్యూటీ సీఎం సమావేశం నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఎఫ్ఏటీహెచ్ఈఐ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి రెండో విడత చర్చలు జరిపారు. బంద్ పాటించవద్దని, బకాయిలు చెల్లిస్తామని ఇరువురు చెప్పినట్టు తెలిసింది.

బంద్ పిలుపుతో ఉలిక్కిపడ్డ సర్కారు!

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై 20 నెలలుగా జాప్యం చేస్తున్న ప్రభుత్వంలో.. బంద్ పిలుపుతో కదలిక వచ్చిందని భావించామని ఎఫ్ఏటీహెచ్ఈఐ తెలిపారు. 1500లపైగా కాలేజీలను సోమవారం నుంచి మూసివేస్తామని ప్రకటించడంతో ప్రభుత్వ పెద్దల నుంచి ఏదైనా హామీ లభిస్తుందని ఆశించామని చెప్తున్నారు. కానీ చర్చలు కూడా నిరుత్సాహం మిగిల్చాయని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేతులెత్తేసిన నేపథ్యంలో ఇంజినీరింగ్, నర్సింగ్, ఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, లా కాలేజీలను మూసివేస్తామని, తరగతులు నిర్వహించబోమని హెచ్చరించారు. ఆందోళనబాట తప్పడంలేదని కాలేజీ యాజమాన్యాల ప్రతినిధులు చెప్పారు.



కామారెడ్డి జిల్లా బీబీపేట పోలీస్ స్టేషన్‌లో యూరియా టోకెన్ల కోసం నేలపై వరుసగా కూర్చుని ఎదురుచూస్తున్న రైతులు

స్టేషన్‌లో యూరియా టోకెన్లు !

- టోకెన్ల కోసం 4గంటలు నిరీక్షణ
- చీటీలు పంపిణీ చేసిన పోలీసులు
- ఫిట్స్ వచ్చి పడిపోయిన రైతు

నిజామాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో తొలిసారి యూరియా బస్తాల కోసం టోకెన్లను జారీ చేసేందుకు రైతులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించుకోవడం విమర్శలకు తావిస్తున్నది. కామారెడ్డి జిల్లా బీబీపేట ఠాణా ఇందుకు వేదికగా మారింది. మూడు వారాల నుంచి కామారెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా యూరియా కోసం రైతులు అల్లాడుతున్నారు. శుక్రవారం రాత్రి బీబీపేట సొసైటీ వద్ద నిరీక్షించగా శనివారం 600 యూరియా సంచులు వస్తాయని సిబ్బంది చెప్పడంతో తెల్లవారుజాము నుంచే అన్నదాతలంతా వచ్చి సొసైటీ వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో ఘర్షణ తలెత్తడంతో పోలీసులు రంగ ప్రవేశంచేశారు. రైతులందర్నీ పోలీస్ స్టేషన్‌కు రావాలంటూ హుకూం జారీ చేయగా.. మహిళలు, పురుషులు, వృద్ధులు ఠాణాకు వెళ్లారు. వేయిమందికి పైగా రైతులు పోగవడంతో వారిని సీఐ సంపత్, ఎస్సై ప్రభాకర్ ఠాణా ముందే నేలపై కూర్చో బెట్టారు. పోలీస్ స్టేషన్‌లో యూరియా బస్తాలకు టోకెన్లు అందిస్తున్న క్రమంలో మల్కాపూర్‌కు చెందిన అంబల్ల చిన్నరాకయ్య ఫిట్స్ వచ్చి పడిపోవడంతో దవాఖానకు తరలించారు. 930 మందికి యూరియా టోకెన్లు పంపిణీ చేసినట్టు ఎస్సై తెలిపారు. 660 యూరియా బస్తాలు రైతులకు అందాయి. మిగిలినవారికి యూరియా లోడ్ వచ్చాక ఇవే టోకెన్లపై పంపిణీ చేస్తామని అధికారులు పేర్కొన్నారు. దీంతో చాలా మందికి నిరాశ ఎదురైంది.

రైతులను ఠాణాలకు తరలిస్తరా?
-మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): కామారెడ్డి జిల్లాలో రైతులను పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రేవంత్ రెడ్డీ.. నీ చేతగాని పాలనతో రైతులను అరిగోస పెడుతున్నావు. అన్న దాతలను నడిరోడ్డుకు ఈడ్చి వికృతానందం పొందుతున్నావు' అని మండిపడ్డారు. రైతులను పోలీస్ స్టేషన్‌లో పెట్టి, ఎరువులు పంపిణీ చేసే పరిస్థితులు తెచ్చిన వాడివిగా, చరిత్ర హీనుడిగా మిగిలిపోక తప్పదని హెచ్చరించారు. రైతులను నేరస్థులుగా పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టిన దుర్మార్గ వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తున్నదని, తగిన సమయంలో బుద్ధి చెప్తుందని హరీశ్‌రావు హెచ్చరించారు.

బ్లాక్ మార్కెట్‌లో యూరియా @600

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ నుంచి వరంగల్ జిల్లా నర్సంపేటకు తరలింపు

నర్సంపేట, సెప్టెంబర్13: వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గానికి సమీపంలోని మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం నుంచి నర్సంపేటకు ప్రతిరోజూ బ్లాక్ మార్కెట్‌కు యూరియా తరలుతున్నది. కొంత మంది ముఠాగా ఏర్పడి కొత్తగూడ మండలం నుంచి నర్సంపేటకు యూరియాను రవాణా చేస్తున్నారు. బస్తా యూరియా రూ.600 చొప్పున విక్రయిస్తున్నట్టు తెలిసింది. నర్సంపేటలో యూరియా దొరకడంలేదని కొంత మంది రైతులు తెల్లవారుజామునే కొత్తగూడకు వెళ్లి ఒక్కో బస్తాకు రూ.600 చెల్లించి బైక్‌లపై తీసుకొస్తున్నారు. నర్సంపేటలో దళారులు సైతం యూరియాను బ్లాక్ చేసి రూ.450కి అమ్ముకుంటున్నట్టు సమాచారం. ప్రభుత్వం రూ.267కు బస్తా యూరియా అందిస్తుంటే దళారులు బ్లాక్ మార్కెట్లో డబుల్ రేట్లు పెట్టి విక్రయిస్తున్నట్టు తెలుస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మహబూబాబాద్ జిల్లా కొత్తగూడకు వచ్చిన యూరియా లారీ(ఫైల్)

యువరైతు ప్రాణం తీసిన యూరియా!

- సొసైటీ వద్ద జరిగిన తోపులాటలో డబ్బులు పోగొట్టుకున్న సుమన్
- భార్యాభర్తల మధ్య గొడవ
- మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న రైతు



ఇల్లెందు ప్రభుత్వ దవాఖానలో రైతు సుమన్ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించిన ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియనాయక్

ఇల్లెందు, సెప్టెంబర్ 13 : యూరియా కోసం క్యూలో జరిగిన తోపులాటలో ఓ రైతు డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని ఇంటికి వెళ్లి భార్యకు చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన యువరైతు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు .. సేవాతండాకు చెందిన కున్సోత్ సుమన్ (30) రేపల్లెవాడ పంచాయతీలో యూరియా కోసం వెళ్లాడు. ఈ క్రమంలో రైతుల మధ్య జరిగిన తోపులాటలో తన వెంట తెచ్చుకున్న డబ్బులు పోగొట్టుకున్నాడు. దిక్కుతోచని స్థితిలో ఇంటికి చేరుకున్న సుమన్.. అక్కడ జరిగిన విషయాన్ని భార్యకు వివరించాడు. దీంతో వారి మధ్య గొడవ జరగడంతో మనస్తాపం చెందిన సుమన్ పురుగులమందు తాగాడు. స్థానికులు, కుటుంబసభ్యులు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సుమన్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తండావాసులు కోరారు.

యువరైతు సుమన్‌ది ప్రభుత్వ హత్యే : బానోత్ హరిప్రియ నాయక్

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైందని, యువరైతు సుమన్ ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియనాయక్ ఆరోపించారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం ధనియలపాడు గ్రామ పంచాయతీ పరిధి సేవ్యాతండాకు చెందిన యువరైతు కన్సోత్ సుమన్(30) మృతదేహాన్ని ఇల్లెందు ప్రభుత్వ దవాఖానలో సందర్శించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమన్ వారంరోజులుగా యూరియా కోసం సొసైటీ చుట్టూ తిరుగుతున్న క్రమంలో ఓ గోడౌన్ వద్ద కొంత నగదును పోగొట్టుకున్నాడని తెలిపారు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ సుమన్ ఆత్మహత్యకు దారితీసిందని చెప్పారు. సుమన్ కుటుంబానికి సకాలంలో యూరియా అందిఉంటే అతడు ఆత్మహత్య చేసుకునేవాడుకాదని తెలిపారు. ఇప్పటికైనా రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

యూరియా దొరక్క గడ్డి మందు తాగిన రైతు

మంత్రి సీతక్క ఇలాకాలో ఘటన

కొత్తగూడ, సెప్టెంబర్ 13: నెల రోజుల నుంచి తిరిగినా యూరియా దొరకక మనస్తాపానికి గురైన ఓ రైతు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గ పరిధిలోని మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కొత్తగూడ మండలం భూర్కుగుంపునకు చెందిన రైతు మల్లెల నర్సయ్యకు 8 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేస్తున్నాడు. వర్షాలు సమృద్ధిగా పడుతుండడంతో యూరియా కోసం నెల రోజులుగా పొగుళ్లపల్లి సొసైటీ, ఆగ్రోస్ సేవా కేంద్రానికి తిరుగుతున్నా ఒక్క బస్తా కూడా దొరకలేదు. శనివారం తన పొలాన్ని చూసిన రైతు పొట్టకొచ్చిన పంట చేతికందదనే ఆవేదనతో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు బాధితుడిని కొత్తగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్య సిబ్బంది 108 వాహనంలో వరంగల్ జిల్లా నర్సంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.



మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ పీహెచ్‌సీ వద్ద నర్సయ్యకు వైద్యం అందిస్తున్న సిబ్బంది

మాజీ ఎమ్మెల్యే పెద్ది పరామర్శ

బాధితుడు మల్లెల నర్సయ్యను నర్సంపేటలోని ప్రభుత్వ దవాఖానలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి నర్సయ్యకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ ప్రాంత ఎమ్మెల్యేలు, మంత్రులు రైతుల సమస్యలను పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. మంత్రి సీతక్క ఇలాకాలోనే ఎరువులు దొరకకపోవడంతో ప్రభుత్వంపై రైతన్నలు దుమ్మెత్తిపోస్తున్నారని తెలిపారు. నర్సయ్యను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేణు, మండల ప్రతినిధి బానోత్ నెహ్రూ పరామర్శించారు.

రైతును గోస పెడుతున్న రేవంత్ సర్కారు

- యూరియా ఇవ్వడంలో ఘోరంగా విఫలమైన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం
- కేసీఆర్ చెప్పినట్టే పాతరోజులు వచ్చాయి: వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, సెప్టెంబర్ 13: ప్రభుత్వం రైతులకు యూరియా ఇవ్వకుండా అరిగోస పెడుతున్నదని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో మీడియాతో వేముల మాట్లాడారు. యూరియా కోసం బీఆర్‌ఎస్ పక్షాన అసెంబ్లీలో పోరాటం చేసినా, రాష్ట్ర వ్యాప్తంగా రైతులు యూరియా కావాలని మొత్తుకుంటున్నా ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్‌రెడ్డికి దున్నపోతు మీద వానపడ్డట్టే ఉన్నదని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మళ్లీ పాత రోజులు వస్తాయని కేసీఆర్ ఎప్పుడో చెప్పారని, ఆ మాటే ఇప్పుడు నిజమైందని రైతులు గుర్తు చేసుకుటున్నారని తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పు చేశామని రైతులు బాధపడుతున్నారని పేర్కొన్నారు. వరి పొట్టదశకు వస్తున్నది, రెండు మూడు రోజుల్లో యూరియా అందకపోతే దిగుబడి తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని చెప్పారు. యూరియా బస్తా ఇవ్వడం చేతగాని రేవంత్‌రెడ్డి లక్ష కోట్లతో ఫ్యూచర్ సిటీ కడుతాడట అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని యూరియా కోసం నిలదీస్తే కేంద్రంపై నెపం వేస్తున్నారని విమర్శించారు. యూరియాపై సమీక్ష చేయడానికి సమయం లేదు కానీ నిత్యం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను తిట్టడానికి సమయం దొరుకుతదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన అప్పులతో మిషన్‌భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, రోడ్లు, బ్రిడ్జిలు, చెక్‌డ్యాంలు, భవనాలు, హాస్పిటల్స్ తదితర పనులు చేపట్టామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేండ్లలోనే రూ.2.20 లక్షల కోట్లు అప్పు చేసి తట్టెడు మట్టి ఎక్కడన్న తీసినవా, ఒక్క ప్రాజెక్ట్ అన్న కట్టినవా, ఒక్క గుంతయినా పూడ్చినవా, ఏంచేశావు చెప్పు రేవంత్‌రెడ్డి అని తెలంగాణ ప్రజలు అడుగుతున్నారని తెలిపారు.




నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

మంత్రి పొన్నం ఇలాకాలో యూరియా బ్లాక్ దందా

- సిద్దిపేట జిల్లా నందారంలో యూరియా బస్తాలు స్వాధీనం
- పోతారం(జే)లో రెట్టింపు ధరతో జోరుగా అమ్మకాలు

అక్కన్నపేట, సెప్టెంబర్ 13: మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో యూరియా బ్లాక్ దందా జోరుగా నడుస్తున్నది. నందారం గ్రామానికి చెందిన సంజీవరెడ్డి(రిటైర్డ్ ఆర్మీ జవాన్) బ్లాక్ మార్కెట్ నుంచి యూరియా తెప్పించి గ్రామంలోని రైతులకు అధిక ధరతో విక్రయిస్తున్నాడు. శుక్రవారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తనకు నాలుగు బస్తాలు కావాలని అడుగగా, ఒక్కో బస్తా రూ. 500 అని చెప్పడంతో అతడు మండల వ్యవసాయాధికారి తస్లీమా సుల్తాన్‌కు ఫిర్యాదుచేశాడు. హుస్నాబాద్ ఏడీఏతో కలిసి జిల్లా వ్యవసాయాధికారి స్వరూపారాణి, ఏవో వెళ్లి వివరాలు సేకరించి బస్తాలు సీజ్ చేశారు. పోలీసులు సంజీవరెడ్డిపై కేసు నమోదుచేశారు. పోతారం(జే)లో లక్ష్మి ఫర్టిలైజర్ షాపు యజమాని రాజు తన వద్దకు వచ్చే రైతుల నుంచి ఒక్కో యూరియా బస్తాను రూ. 500కు విక్రయించి, ఇతర ఎరువులను అంటగట్టాడు. దీనిపై రైతులు ఫిర్యాదు చేయడంతో ఏవో, ఏఈవో వెళ్లగా షాపునకు తాళం వేసి పారిపోయారు. అధికారులు ఆ షాపు యజమానికి నోటీసులు అందజేశారు.



నందారంలో విచారణ జరుపుతున్న జిల్లా వ్యవసాయాధికారి



క్షేత్రస్థాయిలో రైతుల యూరియా కష్టాలు తెలుసుకుంటున్న తెలంగాణ సమితి సభ్యులు

యూరియా కొరతతో అల్లాడుతున్న అన్నదాతలు

- తెలంగాణ వికాస సమితి క్షేత్రస్థాయి అధ్యయంలో వెల్లడి
- రైతులు ఇబ్బంది పడుతుంటే.. ప్రభుత్వ పెద్దల తీవ్ర నిర్లక్ష్యం
- ప్రభుత్వం యూరియా కొరత లేదనడం అత్యంత దుర్మార్గం

హైదరాబాద్, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రైతులు యూరియా కోసం అరిగోస పడుతున్నారని, కొరతతో అల్లాడుతున్నారని తెలంగాణ వికాస సమితి తెలిపింది. ఈ మేరకు యూరియా కొరత-రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆచార్య కే సీతారామరావు, ఎర్రోజు శ్రీనివాస్, పులి రాజుతో కూడిన తెలంగాణ వికాస సమితి బృందం క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన వివరాలను వెల్లడించింది. వర్గల్, గజ్వేల్, రాయపోల్, ములుగు మండలాల్లోని యూరియా విక్రయ కేంద్రాలు, గ్రామాలలో రైతుల అభిప్రాయాలు సేకరించింది. తాము సందర్శించిన ప్రతిచోటా భారీగా యూరియా కొరత ఉందని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధ్యయన నివేదికలో సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలన కాలంలో యూరియా సమస్య లేదనే విషయం రైతులందరూ చెప్పారని తెలిపారు. అరక దున్నే సమయంలో ఆటో వాళ్లకు డబ్బులు ఇస్తే.. యూరియా తీసుకొచ్చి ఇంటి దగ్గర వేసేవారని, కానీ ఇప్పుడు యూరియా కావాలంటే రోజుల తరబడి లైన్‌లో నిలబడి, ముందుగా టోకెన్ తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. రోజులు, గంటల తరబడి లైన్‌లో నిలబడితేనే యూరియా బస్తాలు చేతికి రావడం లేదని వివరించారు. బయోమెట్రిక్ వల్ల పొలం పనులు వదిలేసి, యూరియా కోసం వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు విలపిస్తున్నట్టు వివరించారు. వరి పిలకలు వేసే సమయంలో యూరియా వేయకపోతే గొలుసు సరిగ్గా రాదనే విషయం ఎక్కువ మంది రైతులు చెప్పినట్టు నివేదికలో పేర్కొన్నారు. దీనివల్ల పంట పండినా దిగుబడి భారీగా పడిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలంగాణ వికాస సమితి సభ్యులు తెలిపారు. కొందరు రైతులు పంటలను వదిలేసుకుంటున్నారని పేర్కొన్నారు. మక్క, పత్తి పరిస్థితి కూడా దయనీయంగానే ఉన్నదని చెప్పారు. రాష్ట్రంలో అసలు యూరియా సమస్యనే లేదన్నట్టు ప్రభుత్వ పెద్దలు మాట్లాడటం సరికాదని వికాస సమితి సభ్యులు అన్నారు. రైతులకు కరెంటు సమస్య కూడా తీవ్రంగా ఉందని, గతంలో పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎన్నడూ కరెంటు సమస్య తలెత్తలేదని చెప్పారు. ఒకవేళ వచ్చినా విద్యుత్తు అధికారులకు ఫిర్యాదు చేసి, ట్రాక్టర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పంపిస్తే పునరుద్ధరణ జరిగేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని వాపోయారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంలో జాప్యం

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : కొత్తగా ఏర్పాటు చేసిన జేఎన్టీయూ కాలేజీల్లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం అటకెక్కింది. సంబంధించిన ఫైల్ సీఎం రేవంత్‌రెడ్డికి పంపించినా ఇంకా ఆమోదం లభించలేదు. బాధిత అభ్యర్థులకు ఎదురుచూపులు తప్పడంలేదు. జేఎన్టీయూ పాలేరు, మహబూబాబాద్ కాలేజీల్లో 8 డిపార్ట్‌మెంట్లలో అసిస్టెంట్ కాంట్రాక్ట్ ప్రొఫెసర్ల నియామకానికి 2023లో సెప్టెంబర్ 29న అధికారులు నోటిఫికేషన్ జారీచేశారు. రెండు కాలేజీలకు ఇటీవలే 74 పోస్టులు మంజూరుచేశారు. మంజూరుచేసిన పోస్టుల్లోనైనా ఎంపికైన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

గ్రోమోర్ ఎరువుల దుకాణం సీజ్

అక్రమంగా తరలిస్తున్న యూరియా, వాహనం స్వాధీనం

మానకొండూర్, సెప్టెంబర్ 13 : యూరియాను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న కరీంనగర్ జిల్లా మానకొండూర్ లోని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి శనివారం సీజ్‌చేశారు. శుక్రవారం అర్ధరాత్రి (టీఎస్ 03 యూసీ 9269) వాహనంలో 50 బస్తాల యూరియా, 50 ఎఫ్-20 ఎరువుల బస్తాలను అనుమతి లేకుండా ఉమ్మడి వరంగల్ జిల్లా పరకాలకు తరలిస్తుండగా పక్కా సమాచారంతో పట్టుకున్నారు.



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్. చిత్రంలో రైతు సంఘాల నేతలు, సీనియర్ జర్నలిస్టులు

మా రిపోర్టును ఘోష్ తొక్కేశారు

- కమిషన్‌పై రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ దామోదర్‌రెడ్డి సంచలన వ్యాఖ్య
- కాళేశ్వరం ప్రాజెక్టును ఫెయిల్యూర్ ప్రాజెక్టుగా చిత్రీకరించేలా కుట్ర
- మేడిగడ్డను బూచిగా చూపిస్తూ బనకచర్లకు నీటి తరలింపు ప్లాన్
- టీ జర్నలిస్టుల ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ మీటింగ్‌లో వక్తలు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 13 : కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణలో భాగంగా తామిచ్చిన రిపోర్టును జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తొక్కిపెట్టిందని రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్, ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యుడు దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ జర్నలిస్టుల ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ జర్నలిస్ట్ రమణకుమార్ అధ్యక్షతన 'గోదావరి జలాలు-కాళేశ్వరం ప్రాజెక్టు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఘోష్ నివేదికలో తాము చెప్పిన అంశాలు, ఇచ్చిన రిపోర్టుకు సంబంధించిన ప్రస్తావనే లేదని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఓ ఫెయిల్యూర్ ప్రాజెక్టుగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతున్నదని ఆయన మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ మేడిగడ్డలో కుంగిన పిల్లర్లను బూచిగా చూపి గోదావరి జలాలను బనకచర్లకు తరలించుకపోయే కుట్రను తెలంగాణ, ఏపీ సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు చేస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడ ప్రాంతీయ అస్థిత్వం లేకుండా చేస్తే తెలంగాణ వనరులను దోచుకోవచ్చని చంద్రబాబు ప్రయత్నాలు చేస్తుంటే రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. తమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని తెలిసినా ఉద్దేశ్యపూర్వకంగా తెరపైకి తెస్తున్నారని మండిపడ్డారు. రిటైర్డ్ ఇంజినీర్ టీ వెంకటేశం మాట్లాడుతూ ఇప్పుడు నీళ్లలో తెలంగాణకు అన్యాయం జరిగే పరిస్థితి వచ్చిందని, మనకు కేటాయించిన 969 టీఎంసీల నీటిలో 300 టీఎంసీలు కూడా వాడుకోలేదని తెలిపారు. గోదావరిలో మనకు కేటాయించిన నీటిని సంపూర్ణంగా ఉపయోగించుకోవాలంటే కాళేశ్వరం ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు సాగర్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టేందుకు మొత్తం ఖర్చు లక్ష కోట్లే కాలేదని, అయినా లక్ష కోట్లు తిన్నారంటూ ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ఎక్కువయ్యాయని మండిపడ్డారు. తెలంగాణలో వరి ధాన్యం, పంటల ఉత్పత్తి పెరిగిందంటే అది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్ నాయక్, నీటిపారుదల రంగ నిపుణులు వీరమల్ల ప్రకాశ్, సీపీఎం నేత సారంపల్లి మల్లారెడ్డి, సీపీఐ నేత పశ్య పద్మ, సీనియర్ జర్నలిస్టులు నరా విజయ్, శివారెడ్డి, రాము, హుస్సేన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు రాలేదని ఉద్యోగి ఆత్మహత్య



సోమిరెడ్డి (ఫైల్)

నీలగిరి, సెప్టెంబర్ 13: వేతనాలు సక్రమంగా అందకపోగా.. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న సూర్యాపేట జిల్లా తుంగతుర్తి ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఎస్సై బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండలోని శివాజీనగర్‌కు చెందిన సోమిరెడ్డి (45) తుంగతుర్తి ఎంపీడీవో కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం నల్లగొండకు వెళ్లాడు. రెండు నెలలుగా జీతాలు రాకపోగా.. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయన చనిపోవాలని నిర్ణయించుకుని శ్రీరాంపురం-నల్లగొండ మధ్యలో జన్మభూమి రైలుకు ఎదురు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకుముందు వాట్సాప్ ద్వారా స్నేహితులకు మెసేజ్ పంపించాడు. 'నా ఇంట్లో ఆర్థిక పరిస్థితులు బాగా లేవు. ప్రతినెలా వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. పూట గడవని పరిస్థితి. ఏమి చేయాలో అర్థం కాక.. మిమ్మల్ని వీడిపోతున్నా. నన్ను క్షమించండి. నా కుటుంబానికి అండగా ఉండండి. చిరకాలం మిమ్మల్ని తలుచుకుంటూ ఉంటా' నని మెసేజ్ చేశాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బ్రోకర్ కంపెనీకి కార్మికుల సంక్షేమం

బీమా వ్యవహారాలు రూ.346 కోట్లకు అప్పగింత

- కార్మిక సంఘాలు వ్యతిరేకించినా ఏకపక్ష నిర్ణయం
- సెస్ సొమ్మును కాజేసేందుకు సీఎం అనుచరుడి కుట్ర
- బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ కార్మికుల సంక్షేమ కార్యక్రమాలను ప్రైవేటు సంస్థకు కట్టబెట్టి కార్మికుల సొమ్మును కాజేసేందుకు ముఖ్యమంత్రి అనుచరుడు కుట్రపన్నారని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సర్కారు తీసుకున్న ఏకపక్ష నిర్ణయం కారణంగా కార్మికులకు 11 సంక్షేమ పథకాలు, బీమా అందకుండా పోతున్నాయని మండిపడ్డారు. తక్షణమే ఈ అంశంపై విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని, లేనిపక్షంలో బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. తెలంగాణభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భవన, ఇతర నిర్మాణ కార్మికులకు బీమా, పింఛను, ఆరోగ్య సంరక్షణ వంటి సామాజిక భద్రత పథకాలు, సంక్షేమ చర్యలు చేపట్టడానికి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటైందని చెప్పారు. ఈ బోర్డు కార్మికుల ప్రమాద బీమా, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించిందని తెలిపారు. కానీ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కార్మికల బీమా వ్యవహారాలను ట్రేబ్లేజర్ అనే బ్రోకర్ కంపెనీకి రూ.346 కోట్లకు కట్టబెట్టిందని విమర్శించారు. బోర్డు చేయాల్సిన సంక్షేమ కార్యక్రమాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించవద్దని కార్మిక సంఘాలు చేసిన ఆందోళనలు, వినతులను పట్టించుకోకుండా, ఏకపక్షంగా బీమా వ్యవహారాలను ప్రైవేటు కంపెనీకి అప్పగించారని మండిపడ్డారు. భవన నిర్మాణాల ద్వారా కార్మికుల సంక్షేమం కోసం ఒక శాతం సెస్ రూపంలో సమకూరే నిధులను కాజేయడానికి సీఎం అనుచరుడు కుట్ర చేశాడని ఆరోపించారు.

ఎన్నడూ రూ.346 కోట్లు కాలేదు..

తెలంగాణలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటైన నాటి నుంచి ఎన్నడూ కూడా రూ.346 కోట్ల బీమా క్లెయిమ్‌లు కాలేదని, ఇది కార్మికుల సొమ్మును దుర్వినియోగం చేయడమేనని రాంబాబుయాదవ్ చెప్పారు. కార్మికుడు 122 రూపాయలు చెల్లించి బోర్డులో సభ్యుడిగా చేరితే ఆ సభ్యత్వం ఐదేండ్లపాటు ఉండేదని, కొత్త బ్రోకర్ సంస్థ నిబంధనల ప్రకారం దానిని ఏడాదికి తగ్గించారని తెలిపారు. దీంతో ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే కార్మికులకు బీమా సొమ్ము అందే పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తంచేశారు. బోర్డు వద్ద 1.18 లక్షల కార్మికుల దరఖాస్తుల పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించకుండానే బీమా వ్యవహారాలు ప్రైవేటు సంస్థకు అప్పగించారని విమర్శించారు. కొత్తగా తెచ్చిన బీమా వ్యవస్థను రద్దుచేసి, ఒక సంక్షేమ కార్యక్రమం కూడా రద్దు కాకుండా పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్ చేశారు.



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్. చిత్రంలో వేముల మారయ్య, శ్రీనివాస్, నారాయణ

పాలకుడే అవినీతిపరుడు: మారయ్య

పాలకుడే అవినీతిపరుడు అయినప్పుడు, అధికారులు కూడా అందినకాడికి దోచుకుంటున్నారని ఆటో, మోటార్ ట్రేడ్ యూనియర్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య ఆరోపించారు. రవాణాశాఖ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లు అవినీతి, సెటిల్‌మెంట్లకు అడ్డగా మారాయని వ్యాఖ్యానించారు. కార్మికుల ప్రమాద బీమాను కేసీఆర్ సర్కారు రూ.6 లక్షలు పెంచారని, కాంగ్రెస్ సర్కారు హామీలు ఎగ్గొడుతున్నదని ఆరోపించారు.

దివ్యాంగులపైనా దయ లేదా?

వారి సహాయ పరికరాలపై 5 - 18% జీఎస్టీ విధింపు ▪ సవరింపులోనూ దొరకని ఉపశమనం ▪ ఆర్థిక భారంతో కునారిల్లుతున్న కుటుంబాలు



న్యూఢిల్లీ: ఖజానాకు ఆదాయమే ప్రధాన లక్ష్యంగా జీఎస్టీని అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం మానవత్వం కోణాన్ని కూడా పూర్తిగా విస్మరిస్తున్నది. సకలాంగులూ.. వికలాంగులూ.. తమకు ఒకటేనంటూ నిర్దాక్షిణ్యంగా వారి సహాయ పరికరాలపై కూడా పన్ను వేస్తున్నది. దేశంలో దివ్యాంగులకు ఉపయోగపడే అనేక సహాయ పరికరాలు ఉదా.. వీల్ చైర్‌లు, బ్రెయిలీ పుస్తకాలు, వినికిడి పరికరాలు, కృత్రిమ అవయవాలు, స్పెషల్ సాఫ్ట్‌వేర్‌లు జీఎస్టీ నుంచి తప్పించులేక పోయాయి. ఇవన్నీ దివ్యాంగుల రోజువారీ జీవనానికి అవసరమైనవి. ఇవి ఐశ్వర్యానికి గానీ , విలాస జీవితానికి గానీ సంబంధించినవి కావు. బతికే హక్కు కోసం అవసరమయ్యే వస్తువులు. కానీ జీఎస్టీ పేరుతో వీటిపై 5 నుంచి 18 శాతం వరకు పన్ను వేసి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఇటీవల జీఎస్టీ సవరణలో కూడా వీరికి ఎలాంటి ఉపశమనం చేకూర్చలేదు. అటువంటి ముఖ్యమైన పరికరాలపై పన్ను విధించడం వల్ల వైకల్యం ఉన్న వ్యక్తుల కదలిక, కమ్యూనికేషన్, స్వాతంత్ర్యం కోరుకునే వారిపై కూడా నిర్దాక్షిణ్యంగా శిక్ష విధించినట్టేనని న్యాయవాదులు, పార్లమెంటరీ ప్యానెళ్లు వాదిస్తున్నాయి.

18 శాతం వరకూ పన్ను

ప్రస్తుతం వీల్‌చైర్లు, హియరింగ్ ఎయిడ్‌లు, క్లచెస్, బ్రెయిలీ పేపర్, స్క్రీన్ రీడర్లపై 5 శాతం రాయితీతో జీఎస్టీని వేస్తూనే ఉన్నారు. కొన్ని సందర్భాల్లో పునరావాసం, చికిత్సా సేవలు 18 శాతం వరకు అధిక రేట్లను విధిస్తున్నారు. జీఎస్టీలో తక్కువ శాతం పన్ను అయిన 5 శాతం తయారీదారులు ముడి పదార్థాలపై ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ నుంచి ప్రయోజనం పొందేందుకు వీలు కల్పిస్తుందని జీఎస్టీ కౌన్సిల్ వాదించినప్పటికీ ఈ ప్రయోజనం అరుదుగా వినియోగదారుడిని చేరుతుందని నిపుణులు అంటున్నారు. ముడి పదార్థాలపై తరచుగా 18 శాతం పన్ను విధించడంతో ఉత్పత్తి ఖర్చును తయారీదారులు వినియోగదారుల నెత్తి మీదకు తోసేస్తున్నారు. దీంతో దివ్యాంగ కుటుంబాలు అదనపు ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తున్నది.

మరింత ఆర్థిక భారం

దివ్యాంగులపై జీఎస్టీ భారం మోపడం వల్ల పలు సమస్యలు వస్తున్నాయి. దివ్యాంగులు, వారి కుటుంబాలు ఎక్కువ మంది తక్కువ ఆదాయ వర్గాల్లో ఉంటారు. వీరిలో ఎక్కువగా చిన్న చిన్న ఉద్యోగాలు, చిన్న వృత్తులు, వ్యాపారాలు చేస్తూ ఉంటారు. వీరిపై జీఎస్టీ విధించడం వల్ల వారిపై మరింత ఆర్థిక భారం పడుతుంది. రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు ఉండాలి. కానీ దివ్యాంగులు తమ సహాయ పరికరాలు కొనడానికి కూడా పన్ను చెల్లించాలి. అంటే ఇది వివక్ష చూపడమే. వికలాంగుల వస్తువులు లగ్జరీ వస్తువులు కావు కాబట్టి వాటిపై జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలి అని వికలాంగుల సంఘాలు, సామాజిక కార్యకర్తలు అంటున్నారు.

సహాయ పరికరాలు.. ప్రాథమిక అవసరాలు

వికలాంగుల సహాయ పరికరాలు ఐచ్ఛిక వస్తువులు కావని, నిస్సందేహంగా అవి ఉపాధి, దైనందిన జీవితాన్ని గౌరవంగా పొందేందుకు వీలు కల్పించే ప్రాథమిక అవసరాలు అని ఎంపీ రమాదేవి నేతృత్వంలోని సామాజిక న్యాయం, సాధికారిత కమిటీపై వేసిన పార్లమెంటరీ కమిటీ స్పష్టంగా పేర్కొంది. దీంతో దివ్యాంగులు వినియోగించే పరికరాలు, సహాయకాలపై పన్ను పూర్తిగా జీఎస్టీ నుంచి మినహాయించడమో లేదా సున్నా శాతమో ఉండాలని సిఫార్సు చేసింది.

పన్ను విధింపు ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే

ఇక న్యాయ కోణంలో చూస్తే ముఖ్యమైన వస్తువులపై పన్ను విధించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 19, 21 కింద హామీ ఇచ్చిన హక్కులను బలహీన పరుస్తుందని న్యాయ నిపుణులు వాదిస్తున్నారు. ఈ హక్కులు సమానత్వం, వివక్షత లేనితనం, గౌరవాన్ని కాపాడుతుంది. పన్ను విధింపు హక్కు అనేది పౌరుడి ప్రాథమిక హక్కులను ఉల్లంఘించకూడదని సుప్రీం కోర్టు చాలాసార్లు పేర్కొంది. ప్రస్తుత వ్యవస్థ దీనికి విరుద్ధంగా ఉందని దివ్యాంగ న్యాయవాదులు అంటున్నారు. ఇక ఈ విషయంలో మహిళలపై అసమాన ప్రభావం ప్రస్తావిస్తే పురుషుల కంటే మహిళల్లో వైకల్యం ప్రాబల్యం ఎక్కువగా ఉంది.

ప్రభుత్వం ఏమి చేయాలి?

వికలాంగుల సహాయ పరికరాలను జీరో కేటగిరీలో పెట్టి జీఎస్టీ నుంచి పూర్తిగా తొలగించాలి. ప్రభుత్వ పథకాల ద్వారా వాటిని తక్కువ ధరకు అందించాలి. సబ్సిడీలు, సౌకర్యాలు కల్పించాలి. దివ్యాంగులకు పన్ను మాఫీ కల్పించడం కేవలం ఆర్థిక ఉపశమనం కాదు అది వారి గౌరవం, సమానత్వం, మౌలిక హక్కులను ఇచ్చే గుర్తింపు కూడా అని నిపుణులు పేర్కొంటున్నారు. ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాలు వైకల్య సహాయాలపై పన్నును పూర్తిగా మినహాయించాయి. వాటిపై పన్ను విధించడం అన్యాయం, ప్రతికూల ఫలితాన్ని ఇస్తుందని అంగీకరించాయి. సహాయ పరికరాలను విభిన్న కోడ్ కింద వర్గీకరించడం ద్వారా భారత దేశం ఈ నమూనాను అనుసరించాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతానికి జీఎస్టీ కౌన్సిల్ పన్నును రద్దు చేయడాకి ఎలాంటి చర్య తీసుకోలేదు. కాని వాటిని మార్చాలంటూ డిమాండ్లు పెరుగుతున్నాయి. తదుపరి కౌన్సిల్ సమావేశం సమీపిస్తుండటంతో హక్కుల కార్యకర్తలు, పార్లమెంటరీ కమిటీలు అత్యవసర చర్య కోసం ఒత్తిడి తెస్తున్నాయి. పన్ను సంస్కరణలు అన్నవి తరచుగా సాంకేతికపరంగా రూపొందించినప్పటికీ ఈ సందర్భంలో నైతికతను కూడా పరిగణనలోకి తీసుకోవాలని వారు వాదిస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీల బంధుప్రీతి

- ఆ పార్టీల్లో వారసత్వ రాజకీయాలదే హవా!
- హస్తం పార్టీ చట్టసభ సభ్యుల్లో 32 శాతం 'వారసులే'
- 18 శాతంతో రెండో స్థానంలో బీజేపీ ఉందన్న ఏడీఆర్ నివేదిక



న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో బంధుప్రీతి నానాటికీ పెరుగుతున్నది. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రస్థానంలో ఉండగా, బీజేపీ దానిని అనుసరిస్తున్నట్టు అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రీఫార్మ్స్ (ఏడీఆర్) తాజా నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఉన్న 5,204 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలలో దాదాపు 21 శాతం మంది (1,107) రాజకీయ కుటుంబాల నుంచి వచ్చినవారేనని శుక్రవారం విడుదలైన నివేదికలో ఏడీఆర్ పేర్కొంది. వారసత్వ రాజకీయాల ప్రాతినిధ్యం లోక్‌సభలో అత్యధికంగా 31 శాతంగా ఉండగా, రాష్ట్రాల అసెంబ్లీల్లో 20 శాతంతో అత్యల్పంగా ఉంది. రాజ్యసభ, రాష్ట్ర శాసన మండళ్లలో ఈ సంఖ్య వరుసగా 21 శాతం, 22 శాతంగా ఉంది. ఇక, జాతీయ పార్టీల విషయానికొస్తే మొత్తం 3,214 మంది సిట్టింగ్ ప్రజాప్రతినిధుల నేపథ్యం విశ్లేషించగా, వారిలో 657 మంది (20 శాతం) రాజకీయ వారసత్వ నేపథ్యం ఉన్నవారేనని ఏడీఆర్ తెలిపింది. ఈ జాబితాలో కాంగ్రెస్ 32 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, 18 శాతంతో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రెండో స్థానంలో ఉన్నది. సీపీఐ, సీపీఎం కేవలం 8 శాతంతో అత్యల్ప వారసత్వ ప్రతినిధులను కలిగి ఉన్నాయి.

ప్రాంతీయ పార్టీల్లో ఎన్సీపీ టాప్

రాష్ట్ర పార్టీలకు చెందిన 1,809 మంది ప్రజాప్రతినిధులను విశ్లేషించగా, వారిలో 406 మంది (22 శాతం) వారసత్వ రాజకీయాల నుంచి వచ్చినవారే. రాష్ట్ర పార్టీలైన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ-ఎస్పీ) 42 శాతం, జమ్మూకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ (42 శాతం), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (38 శాతం), తెలుగుదేశం పార్టీ (36 శాతం), ఎన్సీపీ (34 శాతం) లలో వారసత్వ ధోరణులు ఎక్కువగా ఉన్నట్టు నివేదిక వెల్లడించింది. తృణమూల్ కాంగ్రెస్ (10 శాతం), అన్నాడీఎంకే (4 శాతం) వంటి పార్టీలలో ఈ శాతం తక్కువగా ఉంది.

రాష్ట్రాల్లో యూపీ టాప్

రాష్ట్రాల వారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌లోని 604 మంది ప్రజాప్రతినిధుల్లో అత్యధికంగా 141 మంది (23 శాతం) రాజకీయ కుటుంబాల నుంచి వచ్చినవారే. ఈ విషయంలో మహారాష్ట్ర రెండో స్థానంలో ఉంది. జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ అత్యధికంగా వారసత్వ ప్రతినిధుల వాటాను కలిగి ఉంది. ఇక్కడ 255 మంది సిట్టింగ్ ప్రజాప్రతినిధులలో 86 మంది (34 శాతం) రాజకీయ కుటుంబాల నేపథ్యం ఉన్నవారే. మహారాష్ట్రలో 403 మందిలో 129 మంది (32 శాతం), కర్ణాటకలో 326 మందిలో 94 మంది (29 శాతం) వారసత్వ నేపథ్యాన్ని కలిగి ఉన్నారు.

తీసిపోని మహిళలు

ఈ నివేదికలో ఆసక్తికరమైన మరో అంశం మహిళా వారసత్వం. పురుష ప్రజాప్రతినిధులలో 18 శాతం వారసత్వ ఉంటే, మహిళల్లో 47 శాతం ఉంది. వామపక్ష పార్టీలు, కొత్తగా ఏర్పడిన సంస్కరణవాద పార్టీలలో (సీపీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ) వారసత్వ ధోరణి చాలా తక్కువగా ఉంది.

మీరు లోక్‌సభ స్పీకర్ మాటే వినరు

రాహుల్‌తో యూపీ మంత్రి వాగ్వాదం

లక్నో, సెప్టెంబర్ 13: రాయ్‌బరేలీలో నిర్వహించిన ఓ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, యూపీ మంత్రి దినేశ్ ప్రతాప్ సింగ్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీని వీడియో ఒకటి నెట్టింట వైరల్ అయ్యింది. రాహుల్ తన పర్యటనలో భాగంగా ఇటీవల జిల్లా అభివృద్ధి సమన్వయం, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన రాహుల్ గాంధీ మొదట యూపీ మంత్రిని ఏదైనా చెప్పాలనుకొంటే ముందుగా అడగాలని.. ఆ తర్వాత ఆయనకు మాట్లాడే అవకాశం ఇస్తానని చెప్పారు. దీనికి మంత్రి స్పందిస్తూ... 'మీరు లోక్‌సభ స్పీకర్ మాటే వినరు. అలాంటిది మీ మాటలను నేను ఎలా వింటాను' అని వ్యాఖ్యానించారు. దీంతో ఇరువురి నేతల మధ్య వాగ్వాదం ఉద్రిక్తతకు దారితీసింది.

చౌకైన పద్ధతిలో ఇన్సులిన్ తయారీ

గువాహటి: మనిషి ఇన్సులిన్‌ను మరింత చౌకగా తయారుచేసే పద్ధతిని ఐఐటీ గువాహటి పరిశోధకులు కనుగొన్నారు. సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ అనే బాక్టీరియా సాయంతో సురక్షితమైన, సమర్థమైన రీతిలో ఔషధ తయారీకి దోహదపడే ఈ ప్రక్రియ వల్ల ఇన్సులిన్ మరింత చౌకగా అందుబాటులోకి రాగలదని ఐఐటీ గువాహటి తెలిపింది. దీనికి రెండు భారత పేటెంట్లు లభించాయి. సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ బాక్టీరియాతో ఇన్సులిన్ తయారీ విధానాన్ని కనుగొన్నామని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ మాజీ డైరెక్టర్ వీరంకి వెంకటదాసు తెలిపారు.

జీఎస్టీ చెల్లింపుపై 'కల్పతరు'కు ఊరట

న్యూఢిల్లీ: కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (కేపీఐఎల్)కు అప్పిలేట్ అథారిటీ ఊరటనిచ్చింది. 2017-18 ఆర్థిక సంవత్సరం కోసం కేపీఐఎల్ క్లెయిమ్ చేసిన జీఎస్టీఆర్-3బీలోని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ), జీఎస్టీఆర్-2ఏలో పేర్కొన్న ఐటీసీకి మధ్య పొంతన లేదని సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ (సీజీఎస్టీ) డిపార్ట్‌మెంట్ ఆరోపించింది. తాము సమర్పించిన సమాధానాన్ని పరిశీలించకుండానే జీఎస్టీని, పెనాల్టీని చెల్లించాలని సీజీఎస్టీ డిపార్ట్‌మెంట్ డిమాండ్ చేస్తున్నట్లు కేపీఐఎల్ తెలిపింది.దీనిపై అప్పీల్‌ను దాఖలు చేయడాన్ని అప్పిలేట్ అథారిటీ సమర్థించింది.

బ్రిటన్‌లో సిక్కు యువతిపై లైంగిక దాడి

నీ దేశానికి తిరిగి వెళ్లాలని బెదిరింపు

లండన్, సెప్టెంబర్ 13: బ్రిటన్‌కు చెందిన సిక్కు యువతిపై అక్కడి శ్వేత జాతీయులు ఇద్దరు వ్యక్తులు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆమెపై జాత్యహంకార వ్యాఖ్యలు చేశారు. ఆ యువతి బ్రిటన్‌కు చెందిన వ్యక్తి కాదని, ఆమె తన దేశానికి తిరిగి వెళ్లిపోవాలని లైంగిక దాడికి ముందు ఆ వ్యక్తులు బెదిరించారు. ఈ నెల 9న ఉదయం వెస్ట్ మిడ్‌ల్యాండ్స్ ఓల్డ్‌బరీలోని టేమ్ రోడ్ వద్ద ఉన్న పార్కులో ఈ ఘటన జరిగింది. బాధిత సిక్కు యువతి ఫిర్యాదుమేరకు దీనిని జాత్యహంకార దాడిగా పరిగణిస్తున్నామని మిడ్‌ల్యాండ్స్ పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై బ్రిటన్‌లోని సిక్కు సమాజం ఆగ్ర హం వ్యక్తం చేసింది. లేబర్ పార్టీ ఎంపీ ప్రీత్ కౌర్ గిల్ దాడిని తీవ్రంగా ఖండించారు.

కాంగో పడవ ప్రమాదాల్లో 193 మంది మృతి

కిన్షస: వాయవ్య కాంగోలో ఈ వారంలో జరిగిన రెండు వేర్వేరు పడవ ప్రమాదాల్లో 193 మంది మరణించగా, పలువురి ఆచూకీ తెలియడం లేదు. ఈక్వెటోర్ ప్రావిన్స్‌లో బుధ, గురువారాల్లో ఈ ప్రమాదాలు జరిగాయని కాంగో ప్రభుత్వం తెలిపింది. కాంగో నది వెంబడి గురువారం సాయంత్రం దాదాపు 500 మంది ప్రయాణికులతో వెళ్తున్న పడవ అగ్ని ప్రమాదానికి గురైంది. వీరిలో 209 మందిని సురక్షితంగా కాపాడగలిగారు. బసన్‌కుసు టెరిటరీలో బుధవారం మోటారు పడవ మునిగిపోవడంతో సుమారు 86 మంది మరణించారు. సామర్థ్యానికి మించిన బరువుతో ప్రయాణించడం వల్ల ఈ పడవ మునిగిపోయిందని వాదిస్తున్నారు.

ఎన్నికల ప్రక్రియను చేపట్టే అధికారం మాకుంది

సుప్రీంకోర్టులో ఈసీ కౌంటర్ అఫిడవిట్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: దేశ వ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను నిర్వహించేలా ఆదేశించాలంటూ సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్‌కు వ్యతిరేకంగా ఎన్నికల కమిషన్ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. రాజ్యాంగానికి అనుగుణంగా ఎన్నికల జాబితా సవరణ, ఎన్నికల ప్రక్రియను చేపట్టే ప్రత్యేక అధికారం తమకు ఉందని ఈసీ తెలిపింది. సర్‌పై నిరంతరం ఆదేశాలు ఇవ్వడం తమ అధికార పరిధిని అతిక్రమించడమే అవుతుందని పేర్కొంది. ప్రతి ఎన్నికలకు ముందు అక్కడ ఉన్న ఓటర్ల జాబితాలను నవీకరించడం, సవరించడం తమ బాధ్యత అని, అందుకే బీహార్ ఎన్నికలకు ముందు అక్కడ సర్‌ను చేపట్టినట్టు తెలిపింది. ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడుకోవడం తమ బాధ్యత అని, దానినిచిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నామని సుప్రీంకు స్పష్టం చేసింది.


జమిలీ ఎన్నికలతో ప్రజాస్వామ్యం హత్య

టీవీకే అధ్యక్షుడు, నటుడు విజయ్ ఆగ్రహం

చెన్నై : 'వన్ నేషన్, వన్ పోల్(జమిలీ ఎన్నికలు)' అంటే 'ప్రజాస్వామ్యం హత్య' అని నటుడు, టీవీకే పార్టీ చీఫ్ విజయ్ మండిపడ్డారు. తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ యాత్రను ఆయన శనివారం ప్రారంభించారు. అరియలూర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనను విమర్శించారు. తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాల్లోని ప్రతిపక్ష పార్టీలను బలహీనపరచడమే లక్ష్యంగా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదన చేసిందన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ, నియోజకవర్గాల పునర్విభజన దేశవ్యాప్తంగా బీజేపీ చేస్తున్న ద్రోహానికి మరో రూపమని ఆరోపించారు. బీజేపీ ఎంతో దుర్మార్గమైనదని, బీహార్‌లో 60 లక్షల ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతయ్యాయని చెప్పారు.

ఇథనాల్ బ్లెండింగ్ విఫలం

- డీజిల్‌లో ఇథనాల్ కలపడం విఫలమైందని గడ్కరీ అంగీకారం
- ఐసొబ్యూటనాల్‌ను కలపడంపై పరీక్షలు చేస్తున్నట్టు వెల్లడి



న్యూఢిల్లీ: పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలపడంపై ప్రజాగ్రహం వెల్లువెత్తుతున్న తరుణంలో డీజిల్‌లో ఇథనాల్ కలపడం విఫలమైందని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అంగీకరించారు. డీజిల్‌లో పదో వంతు ఇథనాల్‌ను కలపడం కోసం చేసిన ప్రయోగాలు విఫలమయ్యాయని తెలిపారు. మరోవైపు డీజిల్‌కు 10 శాతం ఐసొబ్యూటనాల్‌ను కలపడం సాధ్యమవుతుందా? అనే అంశంపై ఆటోమోటివ్ రీసెర్చ్ ఆసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ) పరీక్షలు చేస్తున్నదని చెప్పారు. ఇండియా సుగర్ అండ్ బయో-ఎనర్జీ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐఎస్ఎంఏ) వార్షిక సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. ఐసొబ్యూటనాల్‌ను ఇతరత్రా వేటితోనూ కలపకుండా ఉపయోగించడంపై కూడా ప్రయోగాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఐసొబ్యూటనాల్ అనేది ఆల్కహాలిక్ కాంపౌండ్, దీనికి మండే స్వభావం ఉంటుంది. పెయింట్స్, కోటింగ్ వంటి పరిశ్రమల్లో దీనిని ద్రావణంగా ఉపయోగిస్తారు. గడ్కరీ మాట్లాడుతూ, ఇటీవల ట్రాక్టర్ కంపెనీలు, వ్యవసాయ పరికరాల తయారీదారుల సమావేశం జరిగిందని, సీఎన్‌జీ, ఐసొబ్యూటనాల్ మిశ్రమం సాధ్యాసాధ్యాల గురించి ఆత్రుత వ్యక్తం చేశారని తెలిపారు.

ఈ20 ప్రయోగంపై వాహనదారుల్లో వ్యతిరేకత

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి తాము కొంటున్న పెట్రోలులో 20 శాతం ఇథనాల్ ఉన్నట్లు తెలుసుకుని వాహనాల యజమానులు ఉలిక్కిపడ్డారు. ఈ విధానాన్ని 2030నాటికి అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ అకస్మాత్తుగా, రహస్యంగా దీనిని ముందుగానే అమల్లోకి తెచ్చింది. ఫలితంగా ప్రజాగ్రహం వెల్లువెత్తింది. అయితే ఇథనాల్ వాడకం వల్ల వాహనాల మైలేజీ దెబ్బ తింటుందని, కొన్ని పరికరాలు దెబ్బ తింటాయని నిపుణులు చెప్పారు. డీలర్లు మాత్రం ఫ్యూయల్ ఎఫిషియెన్సీ ప్రయోగశాల పరిస్థితుల్లో 2-4 శాతం మేరకు తగ్గవచ్చునని చెప్తున్నారు. రోడ్డుపైకి వెళ్లిన తర్వాత, పాత వాహనాలకు ఈ తగ్గుదల మరింత పెరగవచ్చు. దీనిపై కేంద్రం స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. వాహనాల్లో స్వల్ప మార్పులు చేసుకుంటే సరిపోతుందని చెప్పింది. అయితే ఆయన తాజా ప్రకటనతో ఇథనాల్ 'భావి ఇంధనం' అంటూ ఆయనే చెప్పిన మాటలు డొల్ల అని తేలిపోయింది. ఇథనాల్ కలిపిన పెట్రోల్ ధర లీటరుకు కేవలం రూ.22 మాత్రమే ఉంటుందని ఆయన చెప్పిన మాటలు కూడా నిజం కాలేదు.

టీవీ షోలో అర్ధ నగ్నంగా బీజేపీ నేత

- పైజామా లేకుండా కాసేపు హాజరు

ముంబై: నిజంగా మర్చిపోయాడో.. లేక కావాలని చేశాడో తెలియదు కానీ బీజేపీ నేత ఒకరు ఒంటిపై పైజమా లేకుండా కొద్దిసేపు అర్ధనగ్నంగా ఒక టెలివిజన్ షోలో కన్పించడం అందరినీ షాక్‌కు గురి చేసింది. దీనికి సంబంధించిన క్లిప్ సామాజిక మాధ్యమంలో విస్తృతంగా వైరల్ కావడంతో విపక్షాలు ఆయన చర్యను తీవ్రంగా విమర్శిస్తున్నాయి. న్యూస్ 18 లో శుక్రవారం జరిగిన 'ఆర్ పార్' టెలివిజన్ షోకు బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ పాటియా పైజమా లేకుండా గులాబీ రంగు కుర్తా మాత్రమే ధరించి ఒక ప్యానెల్ సభ్యుడిగా హాజరవ్వడం స్పష్టంగా కన్పించింది. ఈ వీడియోను సమాజ్‌వాది పార్టీ ఐటీ సెల్ షేర్ చేస్తూ 'టీవీ షోలో సిగ్గు లేకుండా, అసహ్యకరంగా గౌరవ్ భాటియా టెలివిజన్ చర్చలో పైజామా లేకుండా కూర్చున్నాడు. దానికి అతను సిగ్గు పడటం లేదా? నిజమైన బీజేపీ పాత్రను ప్రతిబింబించే గౌరవ్ భాటియా చర్యను అందరూ చూడాల్సిందే' అంటూ విమర్శించింది. కాగా, గౌరవ్ భాటియా పైజామా ధరించకుండానే నేరుగా టీవీ షోకు వచ్చాడని అక్కడి వారు తెలిపారు. ఆయన చర్యను విపక్షాలు విమర్శించాయి.

గృహ నిర్మాణం ప్రాథమిక హక్కు

రియల్ ప్రాజెక్టుల పునరుద్ధరణకు నిధిని ఏర్పాటు చేయాలి

సుప్రీం కోర్టు ఆదేశం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: గృహ నిర్మాణ హక్కును ప్రాథమిక హక్కుగా ప్రకటించిన సుప్రీం కోర్టు ఒత్తిడిలో ఉన్న రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల కోసం పునరుద్ధరణ నిధిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే ప్రాథమిక హక్కులో ఆశ్రయం పొందే హక్కు అంతర్భాగం. దీనివలన రాష్ట్రం తన పౌరులకు తగిన గృహాలను పొందేలా చూసుకోవాలి' అని సుప్రీం కోర్టు శుక్రవారం నొక్కి చెప్పింది. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు గృహ కొనుగోలుదారులను రక్షించడం, రియల్ ఎస్టేట్ రంగాన్ని ఊహాజనిత పద్ధతుల నుంచి ప్రక్షాళన లక్ష్యంగా అనేక ఆదేశాలను జారీ చేసింది. ఈ రంగంలో కొన్ని అవకతవకల కారణంగా అనేక ప్రాజెక్టులు నిలిచిపోయాయని, అనేక కుటుంబాలు చిక్కుకుపోయాయని పేర్కొంది. గ్రేటర్ నోయిడాలోని ఒక హౌసింగ్ ప్రాజెక్టుకు సంబంధించి నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) ప్రకటించిన నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పలువురు దాఖలు చేసిన అప్పీళ్లపై విచారించిన జస్టిస్ జేబీ పార్దీవాలా, ఆర్ మహదేవన్ ధర్మాసనం.. ఇల్లు అన్నది కేవలం ఒకరి తలపై కప్పు కాదు.. అది ఆశలు, కలల ప్రతిబింబం అని వ్యాఖ్యానించింది. పన్ను చెల్లించే మధ్య తరగతి పౌరుడు ఇంటి కోసం తన జీవితాంతం పొదుపు చేసిన డబ్బును పెట్టుబడి పెట్టి రెట్టింపు భారాన్ని మోస్తున్నాడని తెలిపింది. ఒక వైపు ఈఎంఐ చెల్లిస్తున్నా కలల ఇల్లు అసంపూర్ణ భవనంగా మిగిలిపోతున్నదన్నారు. ఇల్లు లేకపోవడం వల్ల కలిగే ఆందోళన ఆరోగ్యం, ఉత్పాదకత, గౌరవంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని సుప్రీంకోర్టు విచారం వ్యక్తం చేసింది. 'గృహ నిర్మాణం విలాసవంతమైనది కాదు, ఊహాజనిత సాధనం కాదు. కానీ ఒక ప్రాథమిక అవసరం' అని పేర్కొన్న సుప్రీం బెంచ్ 12 విస్తృత ఆదేశాలను జారీ చేసింది. ఇందులో ఎన్‌సీఎల్‌టీ, ఎన్‌సీఎల్ఏటీ వంటి వాటిలో యుద్ధ ప్రాతిపదికన ఖాళీలను భర్తీ చేయడం, ట్రైబ్యునళ్లను బలోపేతం చేయడం, రియల్ ఎస్టేట్ దివాలా తీయడాన్ని పరిష్కరించడానికి అదనపు బెంచ్‌లను ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయి. మురికి నీటి ప్రవాహం వంటి ఘటనల కారణంగా ఢిల్లీలోని ఎన్‌సీఎల్‌టీ కోర్టు గదులను మూసివేసిన క్రమంలో ట్రైబ్యునళ్ల మౌలిక సదుపాయాల ఉన్నతీకరణపై మూడు నెలల్లోగా నివేదికలు దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించారు. తీర్పుకు సంబంధించిన కాపీని క్యాబినెట్ కార్యదర్శి, అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

నేపాల్ సంక్షోభం వెనుక సీఐఏ

- భారత దేశ మాజీ గూఢచారి లక్కీ బిష్త్

న్యూఢిల్లీ: నేపాల్‌లో రాజకీయ సంక్షోభం, అధికార మార్పిడి వెనుక అమెరికాకు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ) ఉందని భారత దేశ మాజీ గూఢచారి లక్కీ బిష్త్ చెప్పారు. ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ప్రపంచంలో 60కిపైగా దేశాల్లో ప్రభుత్వాలను సీఐఏ కూల్చిందన్నారు. మన పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లలో సంఘటనలను సీఐఏ ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. నేపాల్‌లో తనకు తెలిసిన వారు చెప్పినదానిని, తన అధ్యయనాన్ని బట్టి చూసినపుడు, నేపాల్ ప్రజలు భారత దేశంతో సత్సంబంధాలను కోరుకుంటున్నారని తెలిపారు. కొత్త ప్రధాన మంత్రి సుశీల అత్యధికంగా అమెరికా వైపు మొగ్గు చూపుతారన్నారు. నేపాల్ అనిశ్చితి వెనుక నూటికి నూరు శాతం సీఐఏ ఉందని తెలిపారు.

మార్చి 5న పార్లమెంట్ ఎన్నికలు

వచ్చే ఏడాది మార్చి 5న నేపాల్ పార్లమెంట్‌కు ఎన్నికలు జరుగుతాయని ఆ దేశ అధ్యక్షుడు రామ చంద్ర పౌడెల్ కార్యాలయం శనివారం ప్రకటించింది. ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరింది.




వలసదారులకు వ్యతిరేకంగా లండన్‌లో భారీ ప్రదర్శన

లండన్ : యాంటీ ఇమిగ్రెంట్, యాంటీ ఇస్లాం యాక్టివిస్ట్ టామీ రాబిన్సన్ నేతృత్వంలో సెంట్రల్ లండన్‌లో శనివారం భారీ నిరసన ప్రదర్శన జరిగింది. ఇంగ్లండ్, బ్రిటన్ జెండాలతో వేలాది మంది దీనిలో పాల్గొన్నారు. థేమ్స్ నది దక్షిణ ప్రాంతంలోని వీధుల గుండా వెస్ట్ మినిస్టర్‌లోని పార్లమెంటు వైపు ప్రదర్శనగా వెళ్లారు. ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వలసదారులను బ్రిటన్ నుంచి పంపించేయాలనే నినాదాలతో ప్లకార్డులు ధరించారు.

మూడు నిమిషాల్లో ఎముకలు

అతికేలా 'సూది మందు'


ఆల్చిప్పలే ప్రేరణగా 'బోన్‌గ్లూ' అభివృద్ధి



బీజింగ్: విరిగిన ఎముకలను మూడు నిమిషాల్లో అతికించడం సాధ్యమేనా అంటే అవుననే అంటున్నాడు ఈ చైనా వైద్యుడు. గంటల తరబడి ఆపరేషన్ థియేటర్లలో వైద్యులు సర్జరీ చేస్తే తప్ప ఎముకలు అతకడం కష్టం. అలాంటిది మూడు నిమిషాల్లోనే అతికేలా సూది మందు 'బోన్ గ్లూ'ను తన బృందంతో కలిసి అభివృద్ధి చేశారు. తూర్పు చైనాలోని షెజాంగ్ ప్రావిన్స్‌లో ఈ పరిశోధనలు పూర్తయ్యాయి. 'బోన్ 02' అని దీనికి పేరు పెట్టినట్టు స్థానిక మీడియా తెలిపింది. చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ బృంద వైద్యుడు లిన్ షాన్‌పింగ్ ఈ మేరకు వివరాలను వెల్లడించారు. ఈ జిగురు లాంటి సూది మందు రెండు, మూడు నిమిషాల్లోనే ఎముకలు అతికేలా చేస్తుందని, గతంలో లాగా శరీర కోతలు అవసరం లేకుండా కేవలం ఒక సూదితో ఎముకలు అతికించవచ్చని ఆయన స్పష్టం చేశారు. దీనిపై పరిశోధనలు కూడా పూర్తయ్యాయని, ఇది పూర్తి సురక్షితమని తెలిపారు. దీని కారణంగా ఎలాంటి రియాక్షన్లు, ఇన్‌ఫెక్షన్లు ఉండబోవని చెప్పారు. నీటి లోతులలో ఉండే ఆల్చిప్పలే ప్రేరణగా ఈ బోన్ గ్లూ ఇంజెక్షన్‌ను తయారు చేసినట్టు ఆయన తెలిపారు.

భారత్‌పై సుంకాలకు

జి-7 సానుకూలం!



వాషింగ్టన్, సెప్టెంబర్ 13: ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు రష్యాపై ఒత్తిడి తేవడమే సరైన మార్గమని అమెరికా భావిస్తున్నది. అందులో భాగంగా ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలను లక్ష్యంగా చేసుకోవాలని చూస్తున్నది. ఈ క్రమంలో ఈయూ, జి-7 దేశాలు భారత్, చైనాలపై సుంకాలు విధించాలని ట్రంప్ పాలకవర్గం ప్రతిపాదనలు చేసింది. ఇందుకు జి-7 సభ్య దేశాలు కూడా సానుకూలంగా స్పందించినట్టు తెలుస్తున్నది. జి-7దేశాల ఆర్థిక మంత్రులు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుకున్నారు.

భారత్‌పై సుంకాలు సాధారణ విషయం కాదు: ట్రంప్


రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై 50 శాతం సుంకాలు విధించటం సాధారణ విషయం కాదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. దీనివల్ల భారత్‌లో విభేదాలు ఏర్పడే పరిస్థితి వచ్చిందని అన్నారు. శుక్రవారం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, రష్యా చమురుకు భారత్ అతిపెద్ద వినియోగదారుగా మారిందని విమర్శించారు. రష్యా మిత్ర దేశమైన భారత్‌పై భారీగా సుంకాలు విధించటం ద్వారా ఒకరకంగా మాస్కోపై చర్యలు తీసుకున్నట్టేనని చెప్పారు.

బీజేపీ నేతృత్వంలోనే

మణిపూర్ దగ్ధం

ప్రధాని మోదీకి విపక్షాల నిరసనల వెల్లువ

ఎట్టకేలకు రాష్ట్రాన్ని సందర్శించిన ప్రధాని



ఇంఫాల్: జాతి వైషమ్యాలతో రెండేండ్లుగా అట్టుడుకుతున్న మణిపూర్‌ను ప్రధాని నరేంద్రమోదీ ఎట్టకేలకు శనివారం సందర్శించారు. అయితే ప్రధాని రాకపై విపక్షాల నుంచి భారీ స్థాయిలో నిరసనలు వెల్లువెత్తాయి. చారిత్రక కాంగ్లా ఫోర్ట్‌కు భారీ సంఖ్యలో చేరుకున్న ఆందోళనకారులు బీజేపీ నేతృత్వంలోనే మణిపూర్ దగ్ధమైందని, మత రాజకీయాలకు స్వస్తి పలకాలని నినదించారు. పలువురు విపక్షాల కార్యకర్తలను బయటకు రాకుండా పోలీసులు వారి కార్యాలయాలలోనే నిర్బంధించారు. మణిపూర్‌లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వమే అధికారంలో ఉండటంతో శాంతిభద్రతలను పరిరక్షించడంలో విఫలమైందని విమర్శలు వెల్లువెత్తాయి. మరోవైపు చురాచాంద్‌పూర్‌లో నివాసాలు కోల్పోయిన బాధితులను ప్రధాని పరామర్శించారు. శాంతిని నెలకొల్పడానికి కేంద్రం తోడ్పాటు అందిస్తుందని.. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. రూ.7 వేల కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు.



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత బాలరాజ్‌యాదవ్, తదితరులు

పేదలను విద్యకు దూరం చేస్తున్న ప్రభుత్వం

- రాష్ట్రంలో కేసీఆర్ కట్టించిన గురుకులాలు పూర్తిగా నిర్వీర్యం
- బీఆర్‌ఎస్ నేత బాలరాజ్‌యాదవ్, వాసుదేవరెడ్డి, శుభప్రదపటేల్

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని బీఆర్‌ఎస్ నేత దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ విమర్శించారు. తెలంగాణభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్ నేత వాసుదేవరెడ్డి, శుభప్రదపటేల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సర్కారు విద్యా విధానం నిర్లక్ష్యానికి గురవుతున్నదని మండిపడ్డారు. విద్యాశాఖకు మంత్రి లేకుండా పోయారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో పట్ట పగలే దోపిడీలు, దొంగతనాలు జరుగుతుంటే హోంమంత్రి ఎక్కడా అంటూ ప్రశ్నించారు. బడుగు, బలహీన వర్గాలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేసీఆర్ ఏర్పాటు చేసిన గురుకులాలను సర్కారు నిర్వీర్యం చేస్తున్నదని మండిపడ్డారు. బడిలో టీచర్లు మధ్యాహ్న భోజనం పథకం కోసం వంట మనుషులుగా అవతారమెత్తాల్సిన దుస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు.

హైకోర్టు తీర్పును గౌరవించాల్సిందే..

రాష్ట్రంలో గ్రూప్-1 పరీక్షలను పారదర్శకంగా నిర్వహించడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని బీఆర్‌ఎస్ నేత వాసుదేవరెడ్డి విమర్శించారు. హైకోర్టు తీర్పును గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. విద్యార్థులు, రైతుల సమస్యలపై బీజేపీ నోరెత్తకపోవడం విడ్డూరమన్నారు. పార్టీ నేత శుభప్రద్‌పటేల్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రీన్ ఛానల్ ద్వారా ఫీజు బకాయిలు చెల్లిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రేవంత్ అధికారంలోకి వచ్చాక మాట తప్పారని మండిపడ్డారు.

గ్రూప్-1పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- తప్పుచేసిన వారిని శిక్షించాలి
- నిరుద్యోగుల తరఫున అసెంబ్లీలో ప్రశ్నిస్తాం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్



సిద్దిపేటలో నిర్వహించిన జాబ్‌మేళాలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ): గ్రూప్-1 విషయంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, తప్పు చేసిన వారిని, అవినీతికి పాల్పడిన వారిని శిక్షించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేటలోని విపంచి కళా నిలయంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళా కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం గ్రూప్-1 పరీక్ష పెడితే నిరుద్యోగులు ఎంత ఆవేదన చెందుతున్నారో చూశారని పేర్కొన్నారు. ఎంత దారుణంగా పరీక్ష నిర్వహించారో హైకోర్టే చెప్పిందని గుర్తుచేశారు. ఇంత నిర్లక్ష్యంగా పరీక్ష నిర్వహిస్తారా? అని ప్రభుత్వానికి హైకోర్టు మొట్టికాయలు వేసిందని తెలిపారు. అయినా ఈ ప్రభుత్వానికి బుద్ధి రాలేదని మండిపడ్డారు. పలానా మంత్రులు, పలనా అధికారులు ఇన్ని లక్షల రూపాయల లంచాలు అడిగారని నేరుగా నిరుద్యోగులే ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. నిజంగా తప్పు చేయకపోతే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అవినీతికి పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. తప్పును సరిదిద్దకుండా మరో అప్పీల్‌కు వెళ్తామని చెప్తున్నారని, ఏ ముఖం పెట్టుకొని అప్పీలుకు వెళ్తారని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఏడాదికి రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారని, కానీ రెండేళ్లు పూర్తయినా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. రేవంత్‌రెడ్డిని ఎవరూ నమ్మడం లేదని చెప్పి అశోక్‌నగర్ సెంట్రల్ లైబ్రరీలో రాహుల్‌గాంధీని కూర్చోబెట్టి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ మాట ఏమైందని ప్రశ్నించారు. 2 లక్షల ఉద్యోగాలు కాదు కదా, కనీసం 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. గతంలో కేసీఆర్ ఉద్యోగ నోటిఫికేషన్‌లు ఇచ్చి, పరీక్ష నిర్వహించి, ఇంటర్వ్యూలు నిర్వహిస్తే రేవంత్‌రెడ్డి మాత్రం కేవలం ఉద్యోగ పత్రాలు ఇచ్చి తామే ఇచ్చినట్టు చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో గట్టిగా నిలదీస్తే చర్చ పెట్టకుండా జాబ్ క్యాలెండర్ అని చెప్పి పారిపోయారని, అది జాబ్ క్యాలెండర్ కాదని జాబ్‌లెస్ క్యాలెండర్ అని ఎద్దేవా చేశారు. ప్రియాంకగాంధీతో హుస్నాబాద్ సభలో నిరుద్యోగ భృతి నాలుగు వేలు ఇస్తామని చెప్పించారని గుర్తుచేశారు. నిరుద్యోగుల పక్షాన అసెంబ్లీలో ప్రశ్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాధాకృష్ణశర్మ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ నిధులిస్తారా? వదిలేస్తారా?

రెండేండ్లుగా నిలిచిన చెల్లింపులు • ప్రభుత్వ తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులను ప్రభుత్వం రెండేండ్లుగా చెల్లించడం లేదని, దీంతో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. సర్కారు నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తక్షణం నిధులను చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన చిన్నారులకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యను ఉచితంగా అందించేందుకు 'బెస్ట్ అవైలబుల్ స్కూల్' పథకాన్ని అమలు చేస్తున్నారు. 17 ఏండ్ల నుంచి ఈ పథకం రాష్ట్రంలో అమలవుతున్నది. ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖల ద్వారా ఎంపికైన విద్యార్థులను అదే జిల్లా పరిధిలోని ప్రైవేట్ స్కూళ్లల్లో చదివిస్తారు. వీరికి ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులకు 1, 5వ తరగతిలో, గిరిజన విద్యార్థులకు 1, 5, 8వ తరగతుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఎంపికైన ప్రాథమిక తరగతి విద్యార్థికి ఏడాదికి రూ.28,000, ప్రాథమికోన్నత తరగతుల విద్యార్థులకు(వసతితో కలిపి) రూ.42,000 చెల్లిస్తున్నారు. ప్రాథమికోన్నత విద్యార్థి వసతి గృహంలో ఉండటానికి ఇష్టపడకపోతే అతడికి ఫీజుగా రూ.28 వేలు చెల్లిస్తున్నారు. గిరిజన విభాగంలోనూ ఇదే పద్ధతి అవలంభిస్తున్నారు. ఒకసారి ప్రవేశం పొందితే.. పదో తరగతి వరకు ప్రభుత్వమే ఫీజు చెల్లించడంతోపాటు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్ డ్రెస్ వంటి వాటిని సైతం ఉచితంగా అందిస్తుంది. అడ్మిషన్ పొందిన పాఠశాలల్లోని ఫీజులను ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖల ద్వారా రీయింబర్స్‌చేస్తారు. ఈ స్కీం కింద రాష్ట్రవ్యాప్తంగా 230 ప్రైవేట్ పాఠశాలల్లో 26వేల మంది విద్యార్థులు ఉచితంగా విద్య పొందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 22 నెలలుగా ఈ స్కీమ్‌కు సంబంధించి రూ.220కోట్ల నిధులు బకాయి పెట్టింది. ప్రభుత్వం నిధులు చెల్లించకపోవడంతో ఆయా పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నాయి. పాఠశాలలు నడపలేమని, విద్యార్థులను స్కీం కింద చేర్చుకోబోమని తెగేసి చెబుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువైందని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. తమ విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారవుతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరిస్తున్నారు.


విద్యారంగంపై నిర్లక్ష్యం సిగ్గుచేటు : ఏఐవైఎఫ్

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : విద్యారంగంపై సీఎం రేవంత్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటు అని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మండిపడ్డారు. శనివారం ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి వై జంక్షన్ కూడలి వరకు చెవిలో పూలు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టిన కాంగ్రెస్, అదే స్కీమ్‌కు తూట్లు పొడుస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యా రంగ సమస్యలపై సమీక్షించకపోవడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. దసరాలోపు విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులతో పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు











ఆరు కోట్లుదాటిన ఐటీ ఫైలింగ్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: అసెస్‌మెంట్ ఇయర్ 2025-26కిగాను ఇప్పటి వరకు ఆరు కోట్లకు పైగా ఐటీ రిటర్నులు దాఖలు చేసినట్టు ఆదాయ పన్ను మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. ఐటీ రిటర్నులు దాఖలు చేసినవారందరికి కృతజ్ఞతలు..వీరి వల్లనే కీలక మైలురాయి 6 కోట్లను అధిగమించినట్టు, అయినప్పటికీ ప్రస్తుతేడాదికి ఐటీ రిటర్నుల గడువు మరో రెండు రోజుల్లో ముగియనుండటంతో మరింత మంది పెరిగే అవకాశం ఉన్నదని ఎక్స్‌లో పేర్కొంది. చివరి గడువు ఈ నెల 15. ఐటీ రిటర్నులు దాఖలు చేసేవారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు హెల్ప్‌డెస్క్ 24 గంటలు పనిచేస్తున్నదని, ముఖ్యంగా కాల్స్, లైవ్ చాట్స్, ఎక్స్ ద్వారా సమాధానాలు ఇస్తున్నట్టు పేర్కొంది. 2024-25లో రికార్డు స్థాయిలో 7.28 కోట్ల మంది ఐటీ రిటర్నులు దాఖలు చేశారు. 2023-24లో దాఖలు చేసిన 6.77 కోట్లతో పోలిస్తే 7.5 శాతం అధికం.

సన్నగిల్లిన వడ్డీరేట్ల తగ్గింపు అవకాశాలు

ద్రవ్యోల్బణం పెరగడం వల్లనే అంటున్న ఎస్బీఐ రిసర్చ్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: ధరల సూచీ మళ్లీ ఎగబాకడంతో వచ్చే నెల రిజర్వ్ బ్యాంక్ సమీక్షలో కీలక వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు లేవని ఎస్బీఐ తన రిసర్చ్ నివేదికలో వెల్లడించింది. ఆగస్టు నెలకుగాను రిటైల్ ధరల సూచీ రెండు శాతం పైకి ఎగబాకింది. అక్టోబర్ సమీక్షలో వడ్డీరేట్లను ముట్టుకోకపోవచ్చని, అలాగే డిసెంబర్ సమీక్షలోనూ రేట్లను తగ్గించే అవకాశాలు కనిపించడం లేదని తెలిపింది. జీఎస్టీ రేట్లను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆహారేతర ద్రవ్యోల్బణ సూచీ మరింత దిగిరానున్నదని అభిప్రాయపడింది. పలు రాష్ర్టాల్లో వర్షాలు అధికంగా కురియడంతో గత నెలలో ఆహార పదార్థాల ధరలు భగ్గుమన్నాయని, ముఖ్యంగా కూరగాయలు, కోడిగుడ్లు, మాంసం, చేపల ధరలు భారీగా పెరగడంతో వరుసగా తొమ్మిది నెలలుగా తగ్గుతూ వచ్చిన ధరల సూచీ మళ్లీ ఎగబాకింది. కీలక వస్తువులపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి లేదా సున్నాకు తగ్గించింది. ఈ నిర్ణయంతో ద్రవ్యోల్బణ సూచీ 25-30 బేసిస్ పాయింట్లు తగ్గే అవకాశం ఉన్నదని పేర్కొంది.



గోల్డ్‌పైనే గురి

పసిడి నిల్వలను పెంచుకుంటున్న రిజర్వ్ బ్యాంకులు

ఆర్థిక మాంద్యాలు, అనిశ్చిత పరిస్థితులతో రక్షణగా బంగారం

కరెన్సీ మార్కెట్ ఒడిదొడుకులతోనూ పుత్తడికి డిమాండ్


న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: ప్రపంచంలో అత్యంత సురక్షిత పెట్టుబడి సాధనం ఇప్పుడు ఏమైనా ఉందా? అంటే బంగారమేనన్న సమాధానం అంతటా వినిపిస్తున్నది. భారత్ సహా వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకులు పెద్ద ఎత్తున పోగేస్తున్న పసిడి నిల్వలే ఇందుకు ఉదాహరణ అని చెప్పవచ్చు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలతో ప్రపంచ వాణిజ్య స్వరూపమే మారిపోయింది. దీంతో అన్ని దేశాలూ తమ ఆర్థిక వ్యవస్థల రక్షణార్థం గోల్డ్ రిజర్వ్‌లను పెంచుకుంటూపోతున్నాయని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) చెప్తున్నది. మరోవైపు అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు, ఆయా దేశాల యుద్ధాలు పరిస్థితుల్ని ఇంకా దిగజార్చుతున్నాయి. ఇవి దేశ జీడీపీలను, కరెన్సీలను కూలదోస్తున్నాయి. ఈ క్రమంలోనే మునుపు అమెరికా బాండ్లను భారీగా కొన్న ఆర్బీఐ.. ఇప్పుడు వాటిని తగ్గించుకునే పనిలో పడింది. ఈ ఏడాది జూన్ నాటికి 227 బిలియన్ డాలర్లుగానే ఉన్నాయి. ఏడాది క్రితం ఇవి 242 బిలియన్ డాలర్లుగా ఉండటం గమనార్హం. ఇక చమురు దిగుమతులపైన ఆధారపడినందున భారత్‌కు విదేశీ మారకపు నిల్వలతో చాలా అవసరమే ఉన్నది. అయితే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయి కనిష్ఠాలకు దిగజారుతుండటంతో ఆర్బీఐపై ఒత్తిడి పెరుగుతున్నది. దీన్ని తగ్గించుకోవడానికి బంగారమే ప్రత్యామ్నాయంగా మారుతున్నదని ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయం.

మరింతగా కొనుగోళ్లు..

ఇటీవలి ప్రపంచ స్వర్ణ మండలి వివరాల ప్రకారం.. 43 శాతం సెంట్రల్ బ్యాంకులు తమ పసిడి నిల్వలను మరింత పెంచుకునే యోచనలోనే ఉన్నట్టు తేలింది. అమెరికాపై రుణ భారం గరిష్ఠంగా 37 ట్రిలియన్ డాలర్లకుపైగా ఉండటంతో ఇప్పుడు ఆ దేశ ప్రభుత్వ బాండ్లకు ఆదరణ క్షీణిస్తున్నది. పైగా ప్రెసిడెంట్ ట్రంప్ తీరు ఆ దేశ రాజకీయ అనిశ్చితికీ దారితీసే ప్రమాదం ఉండటంతో యూఎస్ డాలర్ బాండ్లకు గిరాకీ సన్నగిల్లింది. 75 శాతం సెంట్రల్ బ్యాంకులు వచ్చే ఐదేండ్లలో అమెరికా డాలర్ నిల్వల స్థానంలో గోల్డ్ రిజర్వ్‌లుంటాయని చెప్తుండటం గమనార్హం. ఫలితంగా పుత్తడిపైనే అన్ని దేశాలు దృష్టి పెడుతున్నాయి. ఇక స్టాక్ మార్కెట్లూ అల్లకల్లోలంగానే ఉంటున్నాయి. దీంతో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను గోల్డ్ వైపునకే మళ్లిస్తున్నారు. ఈ కారణంగానే ఆల్‌టైమ్ హై రికార్డుల్లో బంగారం ధరలు కదలాడుతున్నాయి. దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల దాదాపు 1.14 లక్షలు పలుకుతున్న విషయం తెలిసిందే. దీంతో గోల్డ్‌కు ఆదరణ ఎప్పటికీ తగ్గదన్న అభిప్రాయాలైతే బలంగా నెలకొన్నాయి. మొత్తానికి ట్రంప్ సుంకాలతో వాణిజ్య యుద్ధం మొదలైతే సెంట్రల్ బ్యాంక్‌లు పసిడి కొనుగోళ్లను ఇంకా పెంచవచ్చన్న అంచనాలే గట్టిగా వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే ధరలు పరుగులు పెట్టడం ఖాయమనే చెప్పాలి.


- 2018 నుంచి ఇప్పటిదాకా 320 టన్నులకుపైగా పసిడి నిల్వలను పెంచుకున్న ఆర్బీఐ
- ఒక్క 2009లోనే 200 టన్నులు ఎగబాకిన భారత సెంట్రల్ బ్యాంక్ గోల్డ్ రిజర్వ్‌లు
- అమెరికా ప్రభుత్వ బాండ్ల నిల్వలను తగ్గించుకుంటున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- నిరుడు 1,000 టన్నులకుపైగా పుత్తడిని కొన్న ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు
- యుద్ధాలు, అమెరికా టారిఫ్ వార్ నడుమ పడిపోతున్న ప్రపంచ ఆర్థిక వృద్ధిరేటు

ప్రస్తుతం టాప్-10 దేశాల రిజర్వ్ బ్యాంకుల బంగారం నిల్వలు



దేశం	టన్నులు
అమెరికా	8,133.5
జర్మనీ	3,351.6
ఇటలీ	2,451.9
ఫ్రాన్స్	2,437
రష్యా	2,333.1
చైనా	2,279.6
స్విట్జర్లాండ్	1,039.9
ఇండియా	880
జపాన్	876.2
నెదర్లాండ్స్	612.5

ఏటా ఆర్బీఐ పసిడి కొనుగోళ్లు..



సంవత్సరం	టన్నులు
2018	42.3
2019	34.5
2020	41.7
2021	77.5
2022	33.3
2023	16.2
2024	72.6
2025	3.8



రిటైల్ రుణాలతో జాగ్రత్త

హెచ్చరించిన కేవీ కామత్

ముంబై, సెప్టెంబర్ 13: రిటైల్ రుణాలతో జాగ్రత్త అని బ్యాంకులను హెచ్చరించారు బ్యాంకింగ్ వెటరన్ కేవీ కామత్. రిటైల్ రుణాలు అన్ని పరిశీలించాకే మంజూరు చేయాలని, లేకపోతే భవిష్యత్తులో నిరర్థక ఆస్తులుగా మారే అవకాశాలుంటాయని బెంగాల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చెప్పారు. బ్యాంకుల వ్యాపారంలో ఎక్కువ భాగం రిటైల్ విభాగం నుంచి వస్తుండటంతో కాలక్రమేణా బ్యాంకులు నిధులపై ఆధారపడటం తగ్గుతుందని, రిటైల్ రంగంలో ఆస్తి నాణ్యత చాలా త్వరగా క్షీణిస్తుంది. దీంతో ఎటువంటి సమస్య ఉండదని చెప్పలేను అని చెప్పారు. ఇటీవల బ్యాంకింగ్ సేవలు అందిస్తున్న ఫిన్‌టెక్ సంస్థలు తక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్నవారికి కూడా రుణాలు మంజూరు చేస్తున్నాయని, ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం డెరివేటివ్ సెగ్మెంట్‌లో పెట్టుబడులు పెట్టిన చిన్నస్థాయి ఇన్వెస్టర్లు రూ.1.75 లక్షల కోట్ల పెట్టుబడులు నష్టపోయారన్నారు.



విశ్వసనీయతను పెంచిన మిరాయ్

'మా సంస్థకు గత ఏడాది అంతగా కలిసి రాలేదు. ఇలాంటి సమయంలో 'మిరాయ్' అపూర్వ విజయం మరెన్నో సినిమాలు చేసే శక్తినిచ్చింది. ఈ సినిమాతో మేము ప్రేక్షకుల విశ్వసనీయతను పొందాం. అది మాకు చాలా ఆనందాన్నిస్తున్నది' అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. స్వీయ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై తేజ సజ్జా హీరోగా, కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో ఆయన తెరకెక్కించిన 'మిరాయ్' చిత్రం ఇటీవలే విడుదలై విజయపథంలో పయనిస్తున్నది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన బ్లాక్‌బస్టర్ థాంక్స్ మీట్‌లో నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడారు. ఇంకా చెబుతూ..'దర్శకుడు కార్తీక్ ఈ కథ చెప్పినప్పుడే మంచి కమిట్‌మెంట్ ఉన్న హీరో తేజతో ఈ సినిమా చేయాలనుకున్నాం. దర్శకుడు కార్తీక్, తేజ, మనోజ్.. అందరూ అద్భుతమైన ఎఫర్ట్స్ పెట్టారు. మా అమ్మాయి కృతిప్రసాద్ ఈ సినిమాతో నిర్మాతగా మారారు. తను మాకు లక్కీ ఛార్మ్ అని భావిస్తున్నా' అన్నారు. 'మిరాయ్' చిత్రాన్ని ప్రేక్షకులు గుండెల్లో పెట్టుకున్నారని, దర్శకుడు కార్తీక్, నిర్మాత విశ్వప్రసాద్‌గారి ఎమోషనల్ సపోర్ట్ వల్లే ఈ సినిమా ఇంత గొప్పగా వచ్చిందని హీరో తేజ సజ్జా తెలిపారు. 12 ఏళ్ల తర్వాత వచ్చిన ఈ సక్సెస్ వల్ల తన ఫోన్ మోగుతూనే ఉందని, ఈ కథలో తనను భాగం చేసిన దర్శకుడు కార్తీక్‌కు రుణపడి ఉంటానని, ఈ సినిమా తన కుటుంబాన్ని నిలబెట్టిందని మంచు మనోజ్ భావోద్వేగపూరితంగా మాట్లాడారు. ఇంకా ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

ట్రోల్స్ గురించి ఆలోచించలేదు!



జాన్వీకపూర్, ఇషాన్ కట్టర్ ప్రధాన పాత్రల్లో నటించిన 'హోమ్‌బౌండ్' సినిమా విడుదలకు ముందే అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో ప్రశంసలు దక్కించుకుంటున్నది. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ చిత్రానికి స్టాండింగ్ ఓవేషన్ దక్కింది. ఇటీవలే ఈ చిత్రాన్ని టోరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కూడా ప్రదర్శించగా..అక్కడ కూడా ప్రశంసలు వెల్లువెత్తాయి. తాజా ఇంటర్వ్యూలో ఈ సినిమా గురించి జాన్వీకపూర్ ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. ఈ సినిమా ఒప్పుకునేముందు ఎలాంటి అంచనాలు పెట్టుకోలేదని, ఓ సాధారణ సినిమాగానే భావించానని జాన్వీకపూర్ పేర్కొంది. షూటింగ్ టైమ్‌లోనే సినిమా గొప్పతనం అర్థమైందని, టీమ్ అందరిలో ఏదో అద్భుతాన్ని సృష్టించబోతున్నామనే భావన కలిగిందని చెప్పింది. 'కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ సినిమాకు పది నిమిషాల పాటు స్టాండింగ్ ఓవేషన్ లభించడంతో ఈ కథ ఎంతగా ఒక్కొక్కరి హృదయాల్ని కదిలించిందో అర్థం చేసుకున్నా. గొప్ప కథలో భాగమైనందుకు గర్వంగా అనిపించింది' అని జాన్వీకపూర్ తెలిపింది. ఈ తరహా చిత్రాల వల్ల ట్రోల్స్ ఎదుర్కోవాల్సి వస్తుందని చాలామంది తనతో చెప్పారని, కానీ ట్రోల్స్ గురించి ఏరోజూ పట్టించుకోలేదని జాన్వీకపూర్ వ్యాఖ్యానించింది. భారతీయ జర్నలిస్ట్ బషరత్‌పీర్ న్యూయార్క్ టైమ్స్ పత్రికలో రాసిన కథనం ఆధారంగా 'హోమ్‌బౌండ్' చిత్రాన్ని తెరకెక్కించారు. ఉత్తరాదిలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు స్నేహితులు సూరత్ నగరానికి చేరుకొని అక్కడ పోలీస్ ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాల నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించారు.

చిత్రం

కమల్ యాక్షన్ ఎంటర్‌టైనర్




ఈ ఏడాది 'థగ్‌లైఫ్'తో పలకరించారు కమల్‌హాసన్. ఆయన తదుపరి సినిమా కోసం సినీ ప్రియులంతా ఆతృతగా ఎదురు చూస్తున్న నేపథ్యంలో రజనీకాంత్‌తో కలిసి మల్టీస్టారర్ చేయనున్నట్టు అధికారిక ప్రకటన వెలువడింది. సగటు ప్రేక్షకుడ్ని సైతం ఆనందింపజేసిన వార్త ఇది. అయితే.. ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కడానికి టైమ్ పడుతుంది. కారణం రజనీ ప్రస్తుతం ఖాళీగా లేరు. ఆయన 'జైలర్ 2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఆ సినిమా పూర్తయితే గానీ ఇంకో సినిమా చేసే పరిస్థితి లేదు. కాబట్టి రజనీ ఫ్రీ అయ్యే లోపు కమల్ కూడా ఓ సినిమా చేసేందుకు రెడీ అయిపోయారు. కవల స్టంట్ కొరియోగ్రాఫర్లు అన్బరివ్, పుష్కరిన్‌లలో ఒకరైన అన్బరివ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. కల్యాణి ప్రియదర్శన్ కీలక పాత్ర పోషించనున్నట్టు సమాచారం. ఇందులో కమల్ కొత్త లుక్‌లో కనిపిస్తారని, హాలీవుడ్ స్థాయిలో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కిస్తామని మేకర్స్ చెబుతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత శ్యామ్ పుష్కరన్ రచనా సహకారం అందించనున్న ఈ చిత్రాన్ని ఆర్.మహేంద్రన్‌తో కలిసి రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించనున్నది.

సూపర్ హీరో మూవీ క్యాన్సిల్!



ఇటీవల విడుదలైన రజనీకాంత్ 'కూలీ' చిత్రంలో అమీర్‌ఖాన్ అతిథి పాత్రలో మెరిసిన విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ టైమ్‌లో దర్శకుడు లోకేష్ కనకరాజ్ వర్కింగ్ స్టైల్, క్రియేటివ్ విజన్ చూసి అమీర్‌ఖాన్ బాగా ఇంప్రెస్ అయ్యారు. దాంతో ఆయన లోకేష్ కనకరాజ్‌తో ఓ సూపర్‌హీరో మూవీకి సన్నాహాలు చేస్తున్నారని, కథ కూడా కుదిరిందని వార్తలొచ్చాయి. 'సితారే జమీన్ పర్' ప్రమోషన్ సమయంలో లోకేష్‌తో తాను సూపర్ హీరో కాన్సెప్ట్‌తో సినిమా చేయబోతున్నానని అమీర్‌ఖాన్ ప్రకటించారు. అయితే విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ ప్రాజెక్ట్ రద్దయినట్లు తెలిసింది. దర్శకుడు లోకేష్ కనకరాజ్ బౌండ్‌స్క్రిప్ట్ సిద్ధం చేయకపోవడమే ఈ సినిమా క్యాన్సిల్‌కు కారణమని చెబుతున్నారు. రఫ్ డ్రాఫ్ట్‌తో షూటింగ్‌కు వెళదామని, చిత్రీకరణ జరుగుతున్న కొద్దీ స్క్రిప్ట్‌కు మెరుగులుదిద్దుదామని లోకేష్ కనకరాజ్ ప్రతిపాదన తెచ్చారట. అయితే బౌండ్‌స్క్రిప్ట్ లేనిదే తాను సెట్స్‌లో అడుగుపెట్టనని, అది తన ప్రొఫెషనల్ రూల్ అని అమీర్‌ఖాన్ తేల్చిచెప్పారట. దీంతో ఇద్దరూ స్నేహపూర్వక వాతావరణంలోనే ప్రాజెక్ట్ రద్దు వైపు మొగ్గుచూపారని, భవిష్యత్తులో కలిసి పనిచేద్దామనే హామీతో చర్చలు ముగించారని బాలీవుడ్‌లో కథనాలొస్తున్నాయి.




నటి దిశా పటానీ ఇంటిపై కాల్పులు



నటి దిశా పటానీ ఇంటిపై శనివారం కాల్పులు జరిగాయి. తెల్లవారు జామున 3.30 గం.ల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి సుమారు 8 నుంచి 10 రౌండ్లు కాల్పులు జరిపారని దిశాపటానీ తండ్రి, రిటైర్డ్ పోలీస్ అధికారి జగదీష్ పటానీ తెలిపారు. ఉత్తరప్రదేశ్ బరేలీలో ఈ సంఘటన చోటు చేసుకున్నది. దిశా పటానీ స్వగృహం అక్కడే కావడం గమనార్హం. ఇదిలావుంటే.. ఈ దాడి చేసింది తామేనంటూ హిందూ అతివాద సంస్థ 'గోల్డీ బ్రార్' సోషల్ మీడియాలో సుదీర్ఘమైన ఓ నోట్‌ను పోస్ట్ చేసింది. తమ ముఠా సభ్యులైన వీరేంద్ర చరణ్, మహేంద్ర శరన్ ఈ దాడికి పాల్పడ్డారని, సాధువులు ప్రేమానంద్ జీ మహరాజ్, అనిరుధ్ ఆచార్య జీ మహారాజ్‌లను దిశా పటానీ అవమానించిందని, సనాతన ధర్మాన్ని తక్కువ చేయడానికి ప్రయత్నించిందని, అందుకే ఈ కాల్పులు జరిపామని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ ఘటనపై కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

నిన్ను వదలడమంటే ఊపిరి వదలడమే..



తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంతో వస్తున్న చిత్రం 'బ్యూటీ'. అంకిత్ కొయ్య, నీలఖి జంటగా నటించిన ఈ చిత్రానికి జె.ఎస్.ఎస్.వర్ధన్ దర్శకుడు. విజయ్‌పాల్‌రెడ్డి అడిదల, ఉమేష్‌కుమార్ భన్సల్ నిర్మాతలు. ఈ నెల 19న విడుదల కానుంది. అగ్ర హీరో నాగచైతన్య ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. 'ఎప్పుడైనా నేను నిన్ను కోప్పడితే నన్ను వదిలిపెట్టి వెళ్లకు..' అని హీరోయిన్ అంటే.. 'నిన్ను వదిలేసి వెళ్లడం అంటే.. నా ఊపిరి వదిలేయడమే కన్నా..' అని హీరో చెప్పడంతో ట్రైలర్ మొదలైంది. స్కూటీ కొనిస్తానని తండ్రి మాట ఇవ్వడం, మిడిల్ క్లాస్ ఫాదర్ ఎమోషన్స్ ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. నరేష్, వాసుకి తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, నిర్మాణం: వానర సెల్యులాయిడ్, జీ స్టూడియోస్, మారుతీ టీమ్ ప్రొడక్ట్.



నలభై ఏళ్ల క్రితం.. అదే కాఠ్మండు వీధుల్లో.. అవే నినాదాలిచ్చిందామె. ప్రజాస్వామ్యం కావాలని, సమానత్వం ఉండాలని, గణతంత్రం రావాలని పోరాడి జైలుపాలైంది. తన స్వప్నం ఫలించి ప్రజాస్వామ్యం సిద్ధించిన వేళ ఆ ఖైదీ... న్యాయమూర్తి అయింది. ఆ తర్వాత దేశ సర్వోన్నత న్యాయమూర్తిగా ఎదిగింది. ఆ ప్రజాస్వామ్యం మళ్లీ సంక్షోభంలో కూరుకుపోయిన ఈ సమయాన.. ఆ దేశ ప్రధానిగా పాలనా పగ్గాలు చేపట్టింది సుశీల కర్కి. న్యాయవ్యవస్థకే వన్నె తెచ్చిన తీర్పులెన్నో ఇచ్చిన సుశీలకు జనరేషన్ జెడ్ జై కొట్టింది!

ప్రజాస్వామ్య ప్రేమిక నేపాల్ నాయిక



భారతదేశ సరిహద్దుకు సమీపంలోని శంకాపూర్ అనే గ్రామంలో సుశీల పుట్టింది. న్యాయశాస్త్రంలో ఉన్నత విద్యనభ్యసించేందుకు ఆమె భారత దేశానికి వచ్చారు. వారణాసిలోని బెనారస్ హిందూ యూనివర్సిటీలో చదివారు. అదే సమయంలో ఆమెకు నేపాలీ పౌరుడు దుర్గాప్రసాద్ సుబేది పరిచయమయ్యారు. ఆయనకు రాజకీయాలంటే ఇష్టం. అభిరుచులూ కలిసిన వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు.

విమానం హైజాక్

ఇరుగుపొరుగు దేశాల్లో స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటాల ప్రేరణతో నేపాల్‌లో కూడా స్వేచ్ఛాకాంక్ష పెరిగింది. ప్రజాపోరాటానికి రాజు తలవంచక తప్పలేదు. రాజును ఆమోదిస్తూనే ప్రజాస్వామ్యం మొగ్గతొడిగింది. అది మూణ్నాళ్ల ముచ్చటే అయింది. నేపాల్ రాజు ప్రజా ప్రభుత్వాన్ని పక్కనపెట్టి, 'పంచాయత్' అనే వ్యవస్థని ఏర్పాటు చేశాడు. ప్రజలకు ఆ పంచాయత్ పాలకుల పక్షపాతం, అవినీతి శాపాలుగా మరాయి. అప్పటికి ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న సుశీల.. రాచరిక వ్యతిరేక పోరాటంతో భుజం కలిపింది. దుర్గాప్రసాద్ నేపాలీ కాంగ్రెస్‌లో సభ్యుడు. కర్కి కూడా ఆయన బాటలోనే నడిచింది. దుర్గాప్రసాద్ పార్టీ అనుబంధ యువజన విభాగానికి నాయకుడు. 1973లో రాయల్ నేపాల్ ఎయిర్‌లైన్స్ డీహెచ్‌సీ–6 విమానాన్ని హైజాక్ చేశాడు. ఆ దేశ చరిత్రలోనే మొట్టమొదటి విమాన హైజాక్‌గా ఇది చరిత్రకెక్కింది. నేపాల్‌లో సాయుధ పోరాటాన్ని పునరుద్ధరించి, రాజుని దించాలని పార్టీలన్నీ అనుకున్నాయి. ఆ ఉద్యమానికి కావాల్సిన నిధుల కోసం విమానాన్ని హైజాక్ చేశారు. ఆ విమానంలో బాలీవుడ్ ప్రముఖ నటి మాలాసిన్హా కూడా ఉన్నారట. భర్తకు సరిజోడుగా ఉన్న సుశీల ఆ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. ఆ కారణంతో ఆమెను జైలులో నిర్బంధించారు.

'కారా'గారం నుంచి..

తన జైలు జీవితానుభవాన్ని 'కారా' పేరుతో సుశీల నేపాలీలో నవలీకరించారు. ఇందులో తన కారాగార జీవితంతోపాటు సమాజంలో బానిసల్లా బతికే స్త్రీల దయనీయ స్థితిని అక్షరీకరించారు. 'నేపాల్ సమాజానికి ఇది వాస్తవ రూపం' అని ఆ దేశ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సపనా మల్లా 'కారా' నవలను ప్రశంసించారు.



గడుసరి తీర్పరి

నేపాల్ విప్లవం సఫలమై ప్రజాస్వామ్యం మళ్లీ పురుడు పోసుకుంది. నేపాల్ గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించింది. సుశీల సాధారణ జీవితం ప్రారంభించారు. మూడు దశాబ్దాల పాటు ఆమె న్యాయ రంగంలో పనిచేశారు. ఓ ఎనిమిదేళ్లు జడ్జిగా సేవలు అందించారు. నేపాల్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆ దేశ మొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా గౌరవాన్ని అందుకున్నారు. నిజాయతీగా పనిచేశారు. పాలకులకు ఎన్నడూ భయపడలేదు. పార్టీల విమర్శలకు తలొగ్గలేదు. అవినీతికి లొంగలేదు. ఏనాడూ బంధుప్రీతి చూపలేదు. పదవికే వన్నె తెచ్చిన వ్యక్తిగా పేరు గడించారు. నేపాల్ ప్రజా జీవితాన్ని, పాలనా వ్యవస్థల్ని ప్రభావితం చేసే తీర్పులెన్నో ఇచ్చి ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు సుశీల.

'న్యాయ'ం కోసం

సుశీల కర్కి 'న్యాయ' అనే ఆత్మకథ రాసుకున్నారు. కాలేజీ జీవితం నుంచి వృత్తి జీవితంలో ఎదురైన అనుభవాలను ఈ పుస్తకంలో పంచుకున్నారు. తాను ఎదుర్కొన్న ఒత్తిళ్లు, తీర్పులకు అనుకూలంగా, వ్యతిరేకంగా రాజకీయ పార్టీల స్పందనల్ని ఈ పుస్తకంలో పొందుపరిచారు.



సంక్షోభం వేళ ..

నేపాల్‌లో సాకారమైన ప్రజాస్వామ్యం మళ్లీ సంక్షోభంలోకి కూరుకుపోయింది. ఆ దేశ గణతంత్ర ప్రజాస్వామ్యానికి పదిహేడు సంవత్సరాలు. నేపాల్ సంపూర్ణ ప్రజాస్వామ్య దేశంగా ఏర్పడినప్పుడు పుట్టిన పిల్లలకు ఈ పాలన నచ్చలేదు. ఊడలు దిగిన పాలకుల్ని, కాకలుతీరిన పార్టీల నేతల్ని తరిమికొట్టారు. అవినీతి, బంధుప్రీతి లేని ప్రజాస్వామ్యం కోసం రాజధానిని ముట్టడించి ప్రజాస్వామ్యం కావాలని ఎలుగెత్తి చాటారు. పాత పాలకులు గద్దె దిగిన వేళ, 'పాలన గాడిలో పెట్టేందుకు ఎవరు ఉత్తమం?' అన్న ప్రశ్నకు దేశమంతా బదులిచ్చిన సమాధానం సుశీల కర్కి. విద్య, వ్యక్తిత్వం, పోరాట జీవితం, న్యాయమూర్తిగా చూపిన తెగువకు దక్కిన గుర్తింపు ఆమె ఎంపిక. నేపాల్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించిన తొలి మహిళగా చరిత్రకెక్కిన సుశీల నేపాల్ తొలి మహిళా ప్రధానమంత్రిగా (తాత్కాలిక) బాధ్యతలు చేపట్టి మరోసారి చరిత్ర సృష్టించారు. తాను కలలుగన్న ప్రజాస్వామ్యం విఫలం కానివ్వనని, ఎందరో అమరుల స్వప్నం సాకారం చేస్తానని ప్రధానమంత్రిగా ప్రమాణం చేసే సమయంలో సుశీల కర్కి ఇచ్చిన మాట రేపటి చరిత్రలో నిజం కావాలని కోరుకుందాం.





డేటింగ్‌లో షో-ఆఫ్‌కి చెక్!

ఓ సినిమాలో 'మేరే పాస్ పైసా హై! బంగ్లా హై! గాడీ హై! నౌకర్ హై! బ్యాంక్ బ్యాలెన్స్ హై!' అని అమితాబ్ బచ్చన్ చెబితే.. శశి కపూర్ 'మేరే పాస్ మా హై' అని సగర్వంగా చెప్పిన డైలాగ్ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. రియాలిటీ ముందు మిగతావన్నీ దిగదుడుపే కదా మరి!! ఇప్పుడెందుకు ఈ డైలాగ్ అంటారా? యస్.. నేటి తరం జెన్-జెడ్ ఇప్పుడు డేటింగ్, పార్ట్‌నర్ ఎంపిక విషయంలో ఇదే డైలాగ్‌కి దగ్గరవుతున్నారు. రివర్స్ క్యాట్‌ఫిషింగ్ పేరుతో నిజాయతీని ఫాలో అవుతున్నారు. డేటింగ్ ప్రొఫైల్స్‌లో ఉన్నది ఉన్నట్టు చెబుతూ... షో-ఆఫ్‌కి చెక్ పెడుతున్నారు.

సాధారణంగా జెన్–జెడ్ లైఫ్‌స్టైల్ కాస్త భిన్నంగా ఉంటుంది. బ్యూటీ, ఫిట్‌నెస్, ఫ్యాషన్స్, ట్రెండ్స్.. వీటికే చాలా ఇంపార్టెన్స్ ఇస్తుంటారు. అయితే ఈ నయా జమానా ఈ రూల్స్‌ని రివర్స్ చేస్తున్నారు. ముఖ్యంగా కెరీర్, డేటింగ్ విషయాల్లో నిజాయతీగా ఉండటానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ ట్రెండ్‌కు కొత్త పేరు కూడా పెట్టారు. అదే 'రివర్స్ క్యాట్‌ఫిషింగ్'. ఇంతకు ముందు డేటింగ్ ప్రొఫైల్స్‌లో అందరూ తమని తాము చాలా గొప్పగా, పర్‌ఫెక్ట్‌గా చూపించుకునేవారు. కానీ 'రివర్స్ క్యాట్‌ఫిషింగ్' దానికి పూర్తి ఆపోజిట్! డబ్బులు చూపించడం, కెరీర్ సక్సెస్ గురించి చెప్పడం, ఎడిట్ చేసిన సెల్ఫీలు పెట్టడం.. ఇవన్నీ ఈ ట్రెండ్‌లో కనిపించవు. ఇది మెస్సీగా ఉంటుంది. రియల్‌గా, ఫిల్టర్లు లేని ఫొటోలతో తమని తాము ఆవిష్కరించుకుంటున్నారు.

అసలేంటీ రివర్స్ క్యాట్‌ఫిషింగ్!

వాస్తవ ప్రపంచం నుంచి వర్చువల్ వరల్డ్‌లోకి వెళ్లింది మొదలు.. మొన్నటి మిలీనియల్స్, ఇప్పటి జెన్–జెడ్ కుర్రకారు ట్రెండింగ్ కోసం తెగ తాపత్రయపడుతుంటారు. ఫిల్టర్లు, ఫ్లెక్సింగ్, పర్‌ఫెక్ట్ పిక్స్‌తో సందడి చేస్తుంటారు. తమని తాము చాలా స్టైల్‌గా చూపించుకుంటారు. లేనివి ఉన్నట్టుగా చెబుతూ ఉంటారు. అయితే, ఇప్పుడిది రివర్స్ అయింది. అంటే, తమ స్టేటస్‌ని, అందాన్ని కావాలనే తక్కువ చేసి చూపిస్తున్నారు కొందరు. రియల్‌గా, ఎమోషనల్‌గా స్ట్రాంగ్ కనెక్షన్స్‌ని బిల్డ్ చేసుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఓ డేటింగ్ యాప్ చేసిన ఒక సర్వే ప్రకారం.. ఇండియాలో ప్రతి ఐదుగురు జెన్–జెడ్ డేటర్లలో ఇద్దరు 'రివర్స్ క్యాట్‌ఫిషింగ్'ని వాడుతున్నారట. 2025 ప్రారంభం నుంచి ఈ ట్రెండ్ నానాటికీ పెరుగుతున్నది. జెన్–జెడ్ యువత అన్‌ఫిల్టర్డ్ అథెంటిసిటీకి ఎంత ఇంపార్టెన్స్ ఇస్తుందో దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు.

సోషల్ మీడియా ముసుగులకు చెక్

ఒకర్ని మెప్పించడం కోసం వారిది కాని ముసుగులు ధరించడం.. మాయ చేయడం.. అదే నిజమని నమ్మించడం సోషల్ మీడియాలో చాలా మంది చేసే పనే. ఫిల్టర్లు, ఫేక్ పర్సనాలిటీలు, డబ్బు, ఆకర్షణ, ఫ్యాషన్స్, మేకప్‌లు.. వీటిని మోసీ మోసీ విసిగిపోయిన యువత క్రిస్టల్ క్లియర్‌గా ఉండాలని ఫిక్సవుతున్నది. దీన్నే 'డిజిటల్ ఎగ్జాషన్' అని పిలుస్తున్నారు. 'పర్‌ఫెక్ట్ సెల్ఫీలు, లగ్జరీ వెకేషన్లు, డిజైనర్ వస్తువులను ఏళ్ల తరబడి చూస్తూ చూస్తూ అందరూ అలసిపోయారు. ఇన్‌సెక్యూర్‌గా ఫీల్ అవుతున్నారు. ఏది నిజమో? ఏది శాశ్వతమో? తెలుసుకుంటున్నారు. ఎందుకంటే.. నేటి జెన్–జెడ్ కిడ్స్ చాలా క్విక్‌గానే మార్పుని స్వీకరిస్తున్నారు. మానసిక పరిపక్వతకి ఓటు వేస్తున్నారు. ఫేక్ కల్చర్‌కి గుడ్ బై చెబుతున్నారు. 'ఇన్‌స్టాగ్రామ్‌బుల్' పోకడ వీడి.. లైఫ్‌ని గ్రాటిట్యూడ్‌తో చూడాలని కోరుకుంటున్నారు. అందుకే రివర్స్ క్యాట్‌ఫిషింగ్‌కు దగ్గరవుతున్నారు' అని పలువురు సైకాలజిస్టులు చెబుతున్నారు.

నో అతిశయం..

నిజాల్ని నిర్మొహమాటంగా చెప్పే నేటి తరం.. ఈ ట్రెండ్‌ని మనుగడలోకి తేవడానికి మరో కారణం మితిమీరిన ఒత్తిడి. రెడీ అనగానే కెమెరా ముందు ఫేక్‌స్మైల్ ఇవ్వలేకపోతున్నారు. సోషల్ మీడియాలో సోగ్గాళ్ల ముసుగు ధరించలేకపోతున్నారు. ముఖ్యంగా లేనిపోని హెచ్చులు ప్రదర్శించి అందుకు తగ్గ పార్ట్‌నర్‌ని ఎంచుకుంటే మొదటికే మోసం వస్తుందని గ్రహిస్తున్నారు. పక్కా ఫొటోలు, అతిశయోక్తులు లేని కచ్చితమైన ప్రొఫైల్‌తో డేటింగ్ యాప్‌లో అప్‌డేట్ అవుతున్నారు. తమకు తగ్గ అర్థవంతమైన ఎమోషనల్ కనెక్షన్ కోసం సెర్చ్ చేస్తున్నారు. కొందరు దీన్ని ఒక రకమైన డిజిటల్ సెల్ఫ్–కేర్ అని, డిజిటల్ డీటాక్స్ అని కూడా అంటున్నారు. 'డేటింగ్ యాప్స్‌లో లేనిపోని విషయాలు ఊదరగొట్టి.. అందుకు తగ్గట్టుగా ఉండలేక ఒత్తిడికి గురవ్వడం కన్నా... సింపుల్‌గా, సాదాసీదాగా గడపడానికి ఓ కొత్త విండో ఓపెన్ చేస్తున్నాం' అని చెబుతున్నాడు ప్రముఖ కంపెనీలో హెచ్‌ఆర్‌గా పనిచేస్తున్న విక్రాంత్. మొత్తంగా దేన్నీ ఎక్కువ చేసి చెప్పకపోవడం కొత్త రకం సోషల్ 'ఫ్లెక్స్' అంటున్నది జెన్–జెడ్! పైపై ఆకర్షణల కంటే కాస్త లోతుగా అర్థం చేసుకునే డేటింగ్ ఉత్తమమని కొందరు భావిస్తున్నారు. ఇందుకోసం 'ఇన్‌స్టా–వర్తీ' లైఫ్‌స్టైల్‌కి ఫుల్‌స్టాప్ పెట్టేస్తున్నారు. డిజిటల్ వరల్డ్‌లో షో–ఆఫ్‌కి తిలోదకాలిచ్చి... నిజాయతీగా నిలబడుతున్నారు.

నో ఫిల్టర్స్.. బీ ఒరిజినల్

- ఫోన్‌లో ఫిల్టర్ యాప్స్‌కి చోటు లేకుండా చేయడం. కెమెరా కంటికి కనిపించే నిజాల్నే ప్రపంచానికి చూపడం.
- లగ్జరీ లైఫ్‌స్టైల్ గురించి లేనిపోని రాతలు ఉండవు. హై–పేయింగ్ ప్యాకేజీ కహానీలు కనిపించవు. గొప్ప విజయాల గురించి అస్సలు చెప్పుకోరు!
- బయోడేటా సింపుల్‌గా, నిజాయతీగా చూపిస్తున్నారు.
- లోపాల్ని కూడా బహిరంగంగా చెబుతున్నారు. వింత అలవాట్లు ఏవైనా ఉంటే మాత్రం హైలైట్ చేస్తున్నారు.

చదరంగంలో పదమూడేండ్ల ప్రతిభ



తన వయసులో ఉన్న పిల్లలంతా టీవీలు చూస్తూ.. ఫోన్స్‌లో రీల్స్ చేస్తుంటే ఆమె మాత్రం పదమూడేళ్లకే చెస్ చాంపియన్ అయింది. ఆటలో పడి చదువును నిర్లక్ష్యం చేయలేదు. చెస్ గడుల్లోనే కాదు.. బడిలోనూ ద బెస్ట్ అనిపించుకుంది హైదరాబాద్‌కు చెందిన మోదిపల్లి దీక్షిత. ఇటీవల గోవాలో జరిగిన జాతీయ చెస్ చాంపియన్‌షిప్ అండర్ 13లో సత్తాచాటిన ఈ హైదరాబాదీ.. గ్రాండ్ మాస్టర్ కావడమే తన లక్ష్యం అంటున్నది.

హైదరాబాద్‌కు చెందిన మోదిపల్లి శేషాద్రినాయుడు–రజినీ దంపతుల కుమార్తె దీక్షిత. చిన్నప్పటి నుంచి చెస్ పావులే ఆమె ఆటవస్తువులు. ఇంట్లో పెద్దవాళ్లు చదరంగం ఆడుతుంటే... చిన్నారి దీక్షిత దీక్షగా వాళ్ల ఆటను గమనిస్తూ ఉండేది. నెమ్మదిగా ఆ ఆటపై ఆసక్తి పెంచుకుంది. కూతురి అభిరుచిని గమనించిన తల్లిదండ్రులు ఆమెను చెస్ అకాడమీలో జాయిన్ చేశారు. కోచ్ కృష్ణతేజ ప్రోత్సాహంతో ఆటలో మెలకువలు ఒడిసిపట్టింది. గంటల తరబడి ప్రాక్టీస్ చేస్తూ ఉంటుంది. ఆటలో ఎంత ఆరితేరిందంటే.. ప్రత్యర్థి ఎత్తులకు తన పావులు కుదేలవుతున్నా.. ఈ చిన్నారి ముఖంలో ప్రశాంతత చెక్కుచెదరదు. చివరి మలుపులో మెరుపులాంటి ఎత్తువేసి ప్రత్యర్థిని చిత్తు చేసి అందర్నీ ఆశ్చర్యపరుస్తుంటుంది.

చదువులోనూ ముందంజే..

ఇప్పటివరకు నాలుగుసార్లు జాతీయ స్థాయి చెస్ పోటీల్లో రాణించిన దీక్షిత ఇటీవల గోవాలో నిర్వహించిన 30వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్‌లో అండర్ 13 విభాగంలో విజేతగా నిలిచింది. ఆటలోనే కాదు చదువులోనూ దీక్షిత ముందంజలో ఉంది. ఏ పరీక్షలు రాసినా 90 శాతం మార్కులు సాధిస్తూ ఉంటుంది. ఆట గురించి బాధ్యత తండ్రిది కాగా, చదువు విషయమంతా తల్లిదే! చెస్ ప్రాక్టీస్ నుంచి రాగానే కూతురికి పాఠాలు చెబుతుంటుంది తల్లి రజని. 'మా అమ్మానాన్నల ప్రోత్సాహం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయి. గ్రాండ్ మాస్టర్ కావడమే నా లక్ష్యం. కోనేరు హంపి వారసత్వాన్ని అందిపుచ్చుకునేలా నిరంతరం శ్రమిస్తాను' అంటున్న దీక్షితకు మనమూ ఆల్ ద బెస్ట్ చెబుదామా!

📷 చిన్నయాదగిరి గౌడ్




మనుషులు.. మనసులు!

ఓటీటీ హిట్

సు ఫ్రమ్ సో

జియో హాట్‌స్టార్: స్ట్రీమింగ్ అవుతున్నది.
తారాగణం: షనీల్ గౌతమ్, జేపీ తుమినాడ్, రాజ్ బీ శెట్టి, సంధ్య అరాకెరె, ప్రకాశ్ తుమినాడ్ తదితరులు
దర్శకత్వం: జేపీ తుమినాడ్

పల్లె నిండా సహజంగా కనిపించే స్వభావాలను ఆవిష్కరిస్తూ, దర్శకుడు జేపీ తుమినాడ్ తెరకెక్కించిన కన్నడ చిత్రం.. సు ఫ్రమ్ సో. తక్కువ బడ్జెట్‌లో నిర్మితమైన ఈ సినిమా.. బాక్సాఫీస్ దగ్గర మంచి విజయాన్ని దక్కించుకున్నది. తాజాగా, జియో హాట్‌స్టార్ వేదికగా స్ట్రీమింగ్‌కు వచ్చింది. కర్ణాటక ధర్మస్థలి సమీపంలోని ఓ మారుమూల పల్లెలో జరిగే కథ ఇది. ఆ ఊరివాళ్లకు మూఢ నమ్మకాలు ఎక్కువ. ఊరి పెద్ద రవీంద్ర (షానీల్ గౌతమ్) చాలా మంచివాడు, ధైర్యవంతుడు. ఊళ్లో జరిగే ప్రతి కార్యక్రమంలో ముందుంటాడు. ఈ క్రమంలో పెత్తనం, పెద్దరికం తమకు దక్కకుండా చేస్తున్నాడని.. ఊళ్లోని కొందరు రవీంద్రపై అసూయ పడుతుంటారు. అదే ఊళ్లో అశోక్ (జేపీ తుమినాడ్) నివసిస్తుంటాడు. పట్నంలో చదువుకుంటూ ఆ ఊరికి వచ్చిన ఓ యువతిపై మనసు పడతాడు. ఒకరోజు ఆమె స్నానాల గదిలో ఉన్నప్పుడు రహస్యంగా చూడటానికి ప్రయత్నిస్తాడు. అటుగా వచ్చినవారు గమనించడంతో.. తనకు దయ్యం పట్టినట్టుగా ప్రవర్తించి, తప్పించుకునే ప్రయత్నం చేస్తాడు. దాంతో, అతనికి నిజంగానే దయ్యం పట్టిందని ఊరివాళ్లంతా నమ్ముతారు. అశోక్‌ను గదిలో బంధించి.. దయ్యాన్ని వదిలించడం కోసం మాంత్రికుడైన గురూజీ (రాజ్ బీ శెట్టి)ని పిలిపిస్తారు. ఆ గురూజీ ఊళ్లోకి అడుగుపెట్టిన తరువాత అక్కడ ఏం జరుగుతుంది? అశోక్ దయ్యం పట్టినట్లు ప్రవర్తించడం వల్ల ఊరంతా ఎలా ఇబ్బంది పడుతుంది? ఈ క్రమంలో అశోక్‌కు ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? అనేది మిగతా కథ.



నేటి మ్యాచ్ | భారత్ X పాకిస్థాన్ | సోనీ స్పోర్ట్స్‌లో రాత్రి: 8 నుంచి

300 యోధులు

ఇంగ్లండ్ బ్యాటర్ల వీరబాదుడు | సాల్ట్ శతక హోరు | రికార్డుల జాతర



సాల్ట్ (60 బంతుల్లో 141 నాటౌట్)

మాంచెస్టర్: పొట్టి క్రికెట్‌లో ఇంగ్లండ్ సంచలనం సృష్టించింది. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా మాంచెస్టర్‌లో జరిగిన రెండో పోరులో ఆ జట్టు 20 ఓవర్లలోనే ఏకంగా 304 పరుగులు చేసి రికార్డుల దుమ్ము దులిపింది. 50 ఓవర్లలోనే కష్టతరమైన ఈ స్కోరును ఇంగ్లిష్ బ్యాటర్లు బజ్‌బాల్ ఆటతో 120 బంతుల్లోనే దంచేశారు. పొట్టి ఫార్మాట్‌లో ఐసీసీ శాశ్వత సభ్యత్వం కల్గి ఉన్న దేశాల్లో ఇదే అత్యధిక స్కోరు (అంతకుముందు భారత్.. బంగ్లాదేశ్‌పై 297/6) కాగా ఓవరాల్‌గా మూడోవది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (60 బంతుల్లో 141 నాటౌట్, 15 ఫోర్లు, 8 సిక్సర్లు) రికార్డు శతకంతో రెచ్చిపోయి వీరబాదుడు బాదాడు. జోస్ బట్లర్ (30 బంతుల్లో 83, 8 ఫోర్లు, 7 సిక్సర్లు)తో కలిసి సాల్ట్.. 7.5 ఓవర్లలోనే 126 రన్స్ జతచేశాడు. ఈ ఇద్దరూ పవర్ ప్లేలోనే వంద పరుగులు చేయగా 10 ఓవర్లకు ఇంగ్లండ్ 166/1, 12.1 ఓవర్లలో 200 దంచింది. టీ20లలో అత్యంత వేగంగా 200 రన్స్ చేయడం ఇదే మొదటిసారి. 39 బంతుల్లోనే సాల్ట్ శతకం పూర్తైంది. ఇంగ్లండ్ తరఫున టీ20లలో ఇదే ఫాస్టెస్ట్ సెంచరీ. సాల్ట్, బట్లర్ దంచుడుకు రబాడా (4 ఓవర్లలో 70), యాన్సెన్ (60) వంటి ప్రపంచ స్థాయి బౌలర్లు సైతం భారీగా పరుగులు సమర్పించుకున్నారు. అదీగాక టీ20ల్లో ఇంగ్లండ్ నుంచి అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదుచేసిన బ్యాటర్‌గానూ సాల్ట్ రికార్డులకెక్కాడు. ఈ ఫార్మాట్‌లో అతడికిది నాలుగో సెంచరీ. ఇంగ్లండ్ బ్యాటర్లు ఏకంగా 30 బౌండరీలు, 18 సిక్సర్లు బాదగా.. ఆ జట్టు ఫోర్లు, సిక్స్‌ల రూపంలోనే 228 రన్స్ రాబట్టడం గమనార్హం. అనంతరం ఛేదనలో దక్షిణాఫ్రికా 16.1 ఓవర్లలో 158 రన్స్‌కే చేతులెత్తేసింది. కెప్టెన్ మార్క్‌రమ్ (41) టాప్ స్కోరర్. దీంతో ఇంగ్లండ్ 146 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. పరుగులపరంగా ఇంగ్లండ్‌కు ఇదే అతిపెద్ద గెలుపు కాగా సఫారీలకు ఇదే అతిపెద్ద ఓటమి. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇంగ్లండ్ 1-1తో సమం చేయగా మూడో టీ20 ఆదివారం జరుగనుంది.

టీ20ల్లో అత్యధిక స్కోరు (ఫుల్ మెంబర్ టీమ్)		అసోసియేటెడ్ మెంబర్స్	
ఇంగ్లండ్..	భారత్..	జింబాబ్వే..	నేపాల్..
304/2	297/6	344/4	314/3
దక్షిణాఫ్రికాపై	బంగ్లాదేశ్‌పై	గాంబియాపై	మంగోలియాపై

ఇషా పసిడి గురి



నిన్గ్బో(చైనా): ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ షూటింగ్ కప్‌లో భారత్ ఎట్టకేలకు పతక ఖాతా తెరిచింది. పలువురు షూటర్లు ఘోరంగా నిరాశపరిచిన వేళ తాను ఉన్నానంటూ తెలంగాణ యువ షూటర్ ఇషాసింగ్..భారత్‌కు తొలి పసిడి పతకాన్ని అందించింది. శనివారం జరిగిన మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో ఇషాసింగ్ 242.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఈ క్రమంలో చైనా స్టార్ షూటర్ యావో జియాన్‌జున్ (242.5) పాయింట్ తేడాతో వెనుకకు నెడుతూ ఇషా రజతానికి పరిమితం చేసింది. కొరియా షూటర్ యెజిన్(220.7) కాంస్యం ఖాతాలో వేసుకుంది. ఇషాకు ఇది తొలి ప్రపంచకప్ స్వర్ణం కాగా, ఈ పతకంతో భారత్ ప్రస్తుతం ఐదో స్థానంలో కొనసాగుతున్నది. 'ప్రపంచకప్‌లాంటి మొదటి ఈవెంట్‌లోనే పతకం గెలువడం చాలా సంతోషంగా ఉంది. అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నందుకు గర్వంగా ఉంది' అని ఇషా పేర్కొంది. ఈ విభాగంలో ఇషాతో పాటు భారత్ నుంచి రితమ్ సాంగ్వాన్ ఫైనల్‌కు అర్హత సాధించింది.

తుది పోరుకు భారత్



హాంగ్జౌ (చైనా): మహిళల ఆసియా కప్ హాకీలో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం ఇక్కడ జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో భారత్.. 1-1తో జపాన్‌తో పోరును డ్రా చేసుకుంది. ఈ మ్యాచ్ గెలిచుంటే భారత జట్టు నేరుగా ఫైనల్స్‌కు ప్రవేశించేది. కానీ డ్రా అవడంతో చైనా, కొరియా మ్యాచ్ ఫలితం కోసం వేచి చూడాల్సి వచ్చింది. అయితే చైనా.. 1-0తో కొరియాను చిత్తుచేయడం భారత్‌కు కలిసొచ్చింది. ఒకవేళ కొరియా గనక 2-0తో గెలిచుంటే భారత్ ఆశలు ఆవిరయ్యేవి. ఆదివారం భారత్.. చైనాతో టైటిల్ పోరులో తలపడనుంది.

మూడు వారాల్లో జెర్సీ స్పాన్సర్

ముంబై: భారత క్రికెట్ జట్టుకు మరో రెండు, మూడు వారాల్లో కొత్త టైటిల్ స్పాన్సర్ రాబోతున్నట్టు బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలతో టీమ్ఇండియా టైటిల్ స్పాన్సర్ నుంచి డ్రీమ్ 11 అర్ధాంతరంగా తప్పుకోవడంతో ప్రస్తుతం యూఏఈలో జరుగుతున్న ఆసియా కప్‌లో భారత జట్టు జెర్సీ స్పాన్సర్ లేకుండానే బరిలోకి దిగుతున్నది. కాగా కొత్త స్పాన్సర్ కోసం బీసీసీఐ టెండర్ల ప్రక్రియను ప్రారంభించగా బిడ్‌లు దాఖలు చేయడానికి ఈనెల 16 ఆఖరు తేదీగా నిర్ణయించారు. ఆ ప్రక్రియ ముగిసిన 2, 3 వారాల్లో కొత్త స్పాన్సర్‌ను ప్రకటిస్తామని శుక్లా చెప్పారు.

ఫైనల్లో మీనాక్షి

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్



లివర్‌పూల్: ప్రతిష్ఠాత్మక ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా బాక్సర్ల అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. శనివారం జరిగిన మహిళల 48కిలోల సెమీఫైనల్‌లో యువ బాక్సర్ మీనాక్షి హుడా 5-0 తేడాతో లుట్సాఖనీ అట్లాంటెసెట్సెగ్(మంగోలియా)పై ఘన విజయం సాధించింది. టోర్నీలో పోటీకి దిగింది తొలిసారే అయినా ఏ మాత్రం వెనుకకు తగ్గని మీనాక్షి ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ పసిడి పోరులోకి దూసుకెళ్లింది. మాజీ ఆసియా చాంపియన్, ప్రపంచకప్ రజత విజేత అయిన మీనాక్షి పదునైన పంచ్‌లతో ప్రత్యర్థులకు దడ పుట్టిస్తున్నది. తొలి రౌండ్‌లో బై దక్కించుకున్న ఈ 24 ఏండ్ల యువ బాక్సర్ మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. రౌండ్ రౌండ్‌కు జోరు పెంచుతున్న మీనాక్షి..ఏకపక్ష విజయాలు సొంతం చేసుకుంటున్నది. రూర్కీలోని సాధారణ ఆటోరిక్షా కార్మికురాలి కూతురు అయిన మీనాక్షి అంచనాలకు మించి రాణిస్తున్నది. సెమీస్‌లోనూ మంగోలియా బాక్సర్‌కు ఏమాత్రం అవకాశమివ్వని ఈ బాక్సర్ క్లీన్ పంచ్‌లకు తోడు కౌంటర్ అటాకింగ్‌తో ఆకట్టుకున్నది. మరోవైపు ఇదే టోర్నీలో జైస్మిన్ లంబోరియా(57కి), నుపుర్ షెరాన్(80+కి) ఫైనల్లోకి ప్రవేశించిన సంగతి తెలిసిందే.


భారత్‌కు ఎదురుందా?

నేడు పాకిస్థాన్‌తో పోరు
- ఆసియాకప్ టోర్నీ
- బాయ్‌కాట్‌పై సోషల్‌మీడియాలో ట్రెండింగ్

ఆసియాకప్‌లో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్..దుబాయ్‌లో ముఖాముఖి తలపడబోతున్నాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత దాయాది దేశాలు తొలిసారి తలపడబోతున్న మ్యాచ్‌పై అభిమానుల్లో ఆసక్తి నెలకొన్నది. ఓవైపు బాయ్‌కాట్ అంటూ సోషల్‌మీడియాలో పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న నిరసన భారత్, పాక్ పోరుకు మరింత హీట్ పుట్టిస్తున్నది. అన్ని విభాగాల్లో పాక్ కంటే ఆధిపత్యంలో కనిపిస్తున్న సూర్యకుమార్ నేతృత్వంలోని టీమ్ఇండియా మంచి జోష్‌మీద ఉంది. అన్నింటా అగ్రగామిగా కనిపిస్తున్న భారత్‌కు పాక్ దీటైన పోటీనిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.



సూర్యకుమార్



దుబాయ్: క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. భారత్, పాకిస్థాన్ జట్లు ఆసియాకప్‌లో ఆదివారం అమీతుమీ తేల్చుకోబోతున్నాయి. గ్రూపు-ఏ లీగ్ పోరులో భాగంగా చిరకాల ప్రత్యర్థులు సై అంటే సై అంటున్నాయి. ఇప్పటికే ఎనిమిది సార్లు ఆసియాకప్‌ను దక్కించుకున్న టీమ్ఇండియా రికార్డు స్థాయిలో తొమ్మిదో సారి కన్నేస్తే.. కనీసం పోటీ ఇచ్చేందుకు పాక్ పట్టుదలతో ఉంది. ఓవైపు దిగ్గజ ద్వయం రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత తొలిసారి భారత్ బరిలోకి దిగుతుండగా, మరోవైపు బాబర్ ఆజమ్, రిజ్వాన్ లేకుండా పాక్ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నది. రోకో వారసత్వాన్ని పుణికి పుచ్చుకునేందుకు యంగ్ ఇండియా అడుగులు వేస్తున్నది. శుభ్‌మన్ గిల్, అభిషేక్‌శర్మ రూపంలో టీమ్ఇండియా అదిరిపోయే ఓపెనింగ్ జోడీ దొరకగా, తిలక్‌వర్మ, శాంసన్, సూర్యకుమార్, హార్దిక్, శివమ్ దూబే, బుమ్రా, కుల్దీప్ లాంటి క్రికెటర్లతో భారత్ పటిష్ఠంగా కనిపిస్తున్నది. ఆసియాకప్‌ను మరోమారు తమ ఖాతాలో వేసుకోవాలన్న ఏకైక లక్ష్యంతో అరబ్ గడ్డపై అడుగుపెట్టిన టీమ్ఇండియా మెండైన ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నది. తొలి మ్యాచ్‌లో యూఏఈని 60 పరుగుల లోపే కట్టడి చేసిన టీమ్ఇండియా బ్యాటింగ్‌లో ఐదు ఓవర్లలోపే మ్యాచ్‌ను ముగించి తమ ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పింది. దూకుడైన బ్యాటింగ్‌కు పెట్టింది పేరైన టీమ్ ఇండియాకు పాకిస్థాన్ దీటైన పోటీని ఇవ్వగలుతుందా అన్నది ఆలోచింపజేస్తున్నది. యూఏఈతో పోరులో ఓవైపు చైనామన్ స్పిన్నర్ కుల్దీప్‌యాదవ్ మాయాజాలం చేస్తే యార్కర్ కింగ్ బుమ్రా తనదైన శైలిలో వికెట్ల వేట కొనసాగించాడు. షాహిన్‌షా అఫ్రిదీ మినహాయిస్తే పెద్దగా చెప్పుకోదగ్గ బౌలర్ లేని పాక్..టీమ్ఇండియా ఏ మేరకు నిలువరిస్తుందనేది చూడాలి. ఇదిలా ఉంటే సల్మాన్ అలీ అగా కెప్టెన్సీలో ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్న పాక్‌కు సయిమ్ ఆయూబ్, హరిస్ కీలకంగా మారారు.

బాయ్‌కాట్ మ్యాచ్

పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు చనిపోయిన తర్వాత ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన ఆపరేషన్ సిందూర్‌లో పాక్ ఎయిర్‌బేస్‌లు పూర్తిగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉగ్రదాడికి నిరసనగా పాక్‌తో భారత్ మ్యాచ్ ఆడవద్దంటూ ఓవైపు సోషల్‌మీడియాలో బాయ్‌కాట్ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఉగ్రదాడిలో మరణించిన కుటుంబాలు పాక్‌తో ఆడవద్దంటూ తమ నిరసన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అయితే ఐసీసీ మల్టీ నేషన్ ఈవెంట్ కావడంతో కేంద్ర ప్రభుత్వ అనుమతితో భారత్ పోటీకి దిగింది. దీనిపై దాదాపు అన్ని వైపుల నుంచి తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి.

లంకదే విజయం

అబుదాబి: ఆసియా కప్‌లో శ్రీలంక అదిరిపోయే బోణీ కొట్టింది. శనివారం అబుదాబి వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో లంకేయులు 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. బంగ్లా నిర్దేశించిన 140 పరుగుల లక్ష్యాన్ని ఆ జట్టు 14.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ పతుమ్ నిస్సనక(50), కమిల్ మిశార(46 నాటౌట్) రాణించారు. ఈ విజయంతో లంక రెండు పాయింట్లతో రెండో స్థానంలోకి రాగా, బంగ్లా మూడులో ఉన్నది. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 139 పరుగులు చేసింది. జకెర్ అలీ (41*), షమీమ్ (42*) పోరాడి ఆ జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించారు. 53 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన దశలో వీరిద్దరు జట్టును ఒడ్డున పడేశారు. హసరంగ (2/25), తుషారా (1/17), చమీర (1/17) బంగ్లాను కట్టడిచేశారు.

సత్తా చాటిన షట్లర్లు

ఫైనల్స్‌కు సేన్, సాత్విక్ జోడీ



హాంకాంగ్: గత కొద్దికాలంగా సెమీఫైనల్స్‌కే పరిమితమవుతున్న భారత బ్యాడ్మింటన్ డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి హాంకాంగ్ ఓపెన్‌లో ఆ గండాన్ని అధిగమించారు. హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో ఈ జోడీ ఫైనల్స్‌కు చేరింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీస్‌లో భారత జంట.. 21-17, 21-15తో వరుస సెట్లలో బింగ్-వీ లిన్-చెన్ చెంగ్ కౌన్ (చైనీస్ తైపీ)ను ఓడించి ఫైనల్స్‌కు ప్రవేశించింది. ఆరు సెమీస్ ఓటముల తర్వాత సాత్విక్ జోడీకి ఈ సీజన్‌లో ఇదే తొలి ఫైనల్స్. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ కూడా ఫైనల్ చేరాడు. సెమీస్‌లో 23 ఏండ్ల ఈ ఉత్తరాఖండ్ కుర్రాడు.. 23-21, 22-20తో ప్రపంచ 9వ ర్యాంకర్ టి.సి. చౌకు షాకిచ్చాడు.

టైటిల్ దిశగా సెంట్రల్ జోన్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్స్‌లో మొదట బంతితో ఆ తర్వాత బ్యాట్‌తో రాణించిన సెంట్రల్ జోన్ జట్టు.. టైటిల్‌ను చేజిక్కించుకునేందుకు చేరువైంది. సౌత్‌జోన్‌తో జరుగుతున్న తుదిపోరులో ఆ జట్టు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఏకంగా 511 పరుగుల భారీ స్కోరు చేసింది. తద్వారా 362 పరుగుల ఆధిక్యం సాధించింది. ఆట రెండో రోజు సెంచరీ చేసిన యశ్ రాథోడ్ (194) మూడో రోజు తృటిలో ద్విశతకాన్ని చేజార్చుకున్నాడు.అనంతరం 362 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్‌లో సౌత్‌జోన్.. మూడో రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్ల నష్టానికి 129 రన్స్ చేసింది.



బాధితుడు పవన్‌కుమార్‌కు చెక్కు అందజేస్తున్న హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జస్టిస్ మౌసమీ భట్టాచర్య. చిత్రంలో మాజీ న్యాయమూర్తి జస్టిస్ జీవీ సీతాపతి, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యదర్శి ఎం శాంతివర్ధని తదితరులు

లోక్‌అదాలత్‌లో 11 లక్షల కేసుల పరిష్కారం

రూ.595 కోట్ల పరిహారం ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. ఈ లోక్ అదాలత్‌లలో 11.06 లక్షల కేసులు పరిష్కారమైనట్టు రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ సీహెచ్ పంచాక్షరి శనివారం వెల్లడించారు. తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పీ శ్యాంకోశీ, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మౌసమీ భట్టాచార్య సూచనలతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లో 11.06 లక్షల కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఇందులో ప్రీ లిటిగేషన్ కేసులు 3.63 లక్షలు, కోర్టుల్లో పెండింగ్ ఉన్నవి 7.43 లక్షల కేసులు పరిష్కారమయ్యాయని, లబ్ధిదారులకు రూ.595 కోట్లను పరిహారంగా ప్రకటించామని తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి రూ.1.20 కోట్ల పరిహారం

రోడ్డు ప్రమాదంలో గాయపడి అంగవైకల్యాన్ని ఎదుర్కొంటున్న బీటెక్ విద్యార్థి పవన్‌కుమార్‌కు శనివారం లోక్‌అదాలత్ ద్వారా న్యాయం జరిగింది. ట్రిబ్యునల్ ప్రకటించిన రూ.98.30 లక్షల పరిహారాన్ని 6 శాతం వడ్డీ కలిపి రూ.1.20 కోట్లు అందించడానికి న్యూఇండియా అస్యూరెన్స్ కంపెనీ అంగీకరించింది. ఈ చెక్కును హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జస్టిస్ మౌసమీ భట్టాచార్య చేతులమీదుగా అందజేసినట్టు కమిటీ కార్యదర్శి ఎం శాంతివర్ధని తెలిపారు. లోక్ అదాలత్‌లో మాజీ హైకోర్టు న్యాయమూర్తులు జీవీ సీతాపతి, జీ శ్రీదేవి కేసులను విచారించి 180 కేసులను పరిష్కరించారని తెలిపారు.

ఉపరితల గనుల్లో మహిళా ఆపరేటర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : మహిళా సాధికారత దిశగా సింగరేణి సంస్థ కీలక నిర్ణయం తీసుకున్నది. ఇకపై సింగరేణి ఉపరితల గనుల్లో మహిళా ఆపరేటర్లను నియమించాలని నిర్ణయించింది. ఔత్సాహిక మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది. ఓపెన్ కాస్ట్ గనుల్లో ప్రస్తుతం జనరల్ అసిస్టెంట్, బదిలీ వర్కర్‌గా పనిచేస్తున్న (35 ఏండ్లలోపు), 7వ తరగతి పాసైన మహిళా అభ్యర్థులకు ఆపరేటర్లుగా అవకాశం కల్పిస్తారు. ఇలా అవకాశం కల్పించడం సింగరేణి చరిత్రలో ఇదే తొలిసారి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.